సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 191

సోమవారం 27-3-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



నిఖత్ తడాఖా...

సొంతగడ్డపై భారత్ పంచ్ అదిరింది. భారత స్టార్ బాక్సర్, తెలుగమ్మాయి నిఖత్ జరీన్ (50 కేజీలు) వరుసగా రెండో ఏడాది విశ్వవిజేతగా నిలువగా... టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా (75 కేజీలు) తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రపంచ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్‌ను భారత్ నాలుగు స్వర్ణ పతకాలతో ముగించింది. శనివారం నీతూ (48 కేజీలు), స్వీటీ (81 కేజీలు) పసిడి పతకాలు నెగ్గగా... ఆదివారం నిఖత్, లవ్లీనా కూడా బంగారు పతకాలు గెలిచి 'గోల్డెన్ ఫినిషింగ్' ఇచ్చారు.

12 లో



మోదీ పిరికిపంద

ప్రధాని మోదీ పిరికిపంద అని.. అధికారం వెనుక దాక్కుంటున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ విమర్శించారు.

వివరాలు 6లో ▸



రెచ్చిపోయిన ఖలిస్తానీ మూకలు

వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయంపై ఖలిస్తానీ మద్దతుదారుల దాడి యత్నాన్ని సీక్రెట్ సర్వీస్ పోలీసులు విఫలం చేశారు.

వివరాలు 6లో ▸



అవయవదానం చేయండి

అవయవదానం చేయాలని ప్రధాని మోదీ ప్రజల్ని కోరారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెరగడం సంతృప్తి కలిగిస్తోందన్నారు.

వివరాలు 6లో ▸



సాత్విక్-చిరాగ్ జోడీకి టైటిల్

సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో పురుషుల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

వివరాలు 12లో ▸

న్యూస్‌రీల్

డబ్ల్యూపీఎల్ విజేత ముంబై



తొలి మహిళల ప్రీమియర్ లీగ్ టి20 టోర్నమెంట్ టైటిల్‌ను ముంబై ఇండియన్స్ సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది.

వివరాలు 12 ▸

అణ్వాయుధాలను బెలారస్‌లో ఉంచుతాం



తమ వ్యూహాత్మక అణ్వాయుధాలను బెలారస్‌లో ఉంచేందుకు ఒప్పందం కుదిరిందని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. 1990ల తర్వాత రష్యా తన కీలక ఆయుధ సంపత్తిని దేశం వెలుపలకు తరలించడం ఇదే మొదటిసారి కానుంది.

వివరాలు 6 ▸

81% భూరికార్డుల స్వచ్ఛీకరణ



భూ రికార్డుల స్వచ్ఛీకరణ రాష్ట్ర వ్యాప్తంగా 81% పూర్తయ్యింది. 26 జిల్లాల్లోని 17,564 గ్రామాలను మూడు కేటగిరీలుగా విభజించి స్వచ్ఛీకరణ చేపట్టగా.. ఇప్పటివరకు 14,235 గ్రామాల్లో పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రీసర్వే ప్రారంభించాలంటే రికార్డులను అప్‌డేట్ చేయడం తప్పనిసరి. అందుకే రెవెన్యూ యంత్రాంగం ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. 2 నెలల్లో అన్ని జిల్లాల్లోనూ రికార్డుల స్వచ్ఛీకరణను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

- వివరాలు 2లో

కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం.. నారా చంద్రబాబునాయుడు

ఓటుకు కోట్లు 2.0

పోలింగ్ రోజు అసెంబ్లీ లాబీల్లోనూ కొనసాగిన ప్రలోభాల పర్వం

ఎమ్మెల్యే రాపాకకు రూ.10కోట్లు ఆఫర్ ఇచ్చిన టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు

- అంతకుముందు కేఎస్ఎన్ రాజు ద్వారా కూడా రాపాకతో సంప్రదింపులు
- లాబీల్లో రాపాకను కలసి మాట్లాడిన విషయం నిజమేనని ఒప్పుకున్న రామరాజు
- ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ప్రలోభాల పర్వం బట్టబయలు
- గెలిచే బలం లేకున్నా అభ్యర్థిని బరిలోకి దించి క్రాస్ ఓటింగ్, అనైతిక రాజకీయాలకు తెర తీసిన చంద్రబాబు
- ఇదే అంశాన్ని మొదట్లోనే వెల్లడించిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఆ పార్టీ నేతలు



చెప్పులు రుచి మరిగిన కుక్కకు చెరకు తీపి రుచిస్తుందా?.. పుట్టుకతో వచ్చిన గుణం పుడమిలో కలిసేదాకా పోదు కదా!

బేరసారాలే ఊపిరిగా బతికే నేతల నైజం కూడా అంతే!.. కుమ్మక్కు రాజకీయాలు, కొనుగోళ్లే వారి లక్షణం.. లక్ష్యం!

సాక్షి, అమరావతి: ఎనిమిదేళ్ల క్రితం.. తెలంగాణ శాసన మండలికి 2015లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేల కొనుగోళ్లకు ప్రయత్నించి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఏపీ శాసన మండలి ఎన్నికల్లోనూ అదే విధానాన్ని నమ్ముకుంది. ఓటుకు కోట్లను ఎర వేసింది. సంఖ్యా బలం లేకపోయినా బేరసారాలకు దిగి నిస్సిగ్గుగా

మిగతా 2వ పేజీలో ▶

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బేరసారాలు నిజమే!



- టీడీపీ నుంచి రూ.10కోట్లు ఆఫర్ ఇచ్చారు: రాజోలు ఎమ్మెల్యే రాపాక
- టీడీపీ ఎమ్మెల్యే రామరాజు ఫైనాన్షియల్ మేటర్ మాట్లాడదామన్నారు.. టీడీపీ అభ్యర్థికి ఓటేయాలని కోరారు
- నేరుగా కూడా సంప్రదించారు

2 లో



ఇస్రో కీర్తి కిరీటంలో..

మరో వాణిజ్య విజయం

ఇస్రో మరో అద్భుత వాణిజ్య విజయాన్ని సొంతం చేసుకుంది. శ్రీహరికోటలోని షార్ నుంచి ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్ మొత్తం 36 వన్‌వెబ్ ఇండియా ఉపగ్రహాలను తీసుకుని ఆదివారం ఉదయం 9 గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది. బ్రిటన్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేట్ లిమిటెడ్, భారతి ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యంలోని 'వన్‌వెబ్' ఈ ఉపగ్రహాలను భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం చరిత్రాత్మకమైనదని.. వాణిజ్య ప్రయోగాలకు మరింత బలం చేకూరిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు. శాస్త్రవేత్తలను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు.

6 లో

'జేఈఈ' సెషన్-2కు అభ్యర్థుల తాకిడి

- తొలి సెషన్‌కు 8.66 లక్షల మంది రిజిస్ట్రేషన్.. అందులో 95.80 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరు
- ఇంటర్ పరీక్షలు పూర్తికానుండడంతో రెండో సెషన్‌కు పెరగనున్న విద్యార్థులు.. ఈనెల 14తో పూర్తయిన రెండో సెషన్ రిజిస్ట్రేషన్లు
- ఏప్రిల్ 6 నుంచి 12 వరకు ఈ పరీక్షలు
- ఏప్రిల్‌లో విడుదల కానున్న అడ్మిట్ కార్డులు



- వివరాలు 10లో

హలీమ్.. రుచికి సలామ్

- 6వ నవాబ్ మహబూబ్ అలీకి అరబ్బులు పరిచయం చేసిన వంటకం
- దీనికి హైదరాబాద్ రుచులు అద్దిన 7వ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్
- ప్రపంచ వ్యాప్తంగా ఇష్టమైన వంటకంగా ఆవిర్భావం
- హైదరాబాద్ తరువాత రాజమహేంద్రవరం ప్రసిద్ధి



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దీని టేస్ట్‌కు ఎవ్వరైనా సలామ్ కొట్టి గులామ్ కావాల్సిందే. ఒకసారి తింటే మళ్లీమళ్లీ తినాలపించే రుచి దీనిది. సంవత్సరంలో ఒక్క రంజాన్ మాసంలోనే ఎక్కువగా లభిస్తుంది. ముస్లింలతో పాటు అన్ని వర్గాల ప్రజలూ ఎంతో ఇష్టంగా తీసుకునే అత్యంత ఆరోగ్యకరమైన (హై హెల్దీ), శక్తిమంతమైన ఆహారం ఇది. పేరు హలీమ్. హైదరాబాద్‌లో ప్రసిద్ధి పొంది, ఆ తరువాత రాజమహేంద్రవరంలో అంత పేరు తెచ్చుకున్న వంటకం బహుశా ఇదేనేమో! హైదరాబాద్ బిర్యానీ తరువాత జిల్లా వాసులు అంత ఎక్కువగా ఇష్టపడే వంటకం హలీమ్. రంజాన్ మాసంలో సాయంత్రం 4 గంటలు దాటిన తరువాత రాజమహేంద్రవరంలో కులమతాలకు అతీతంగా చాలామంది భార్యాపిల్లలతో కలిసి షాపులకు వచ్చి హలీమ్ తినడం నిత్యం కనిపించే దృశ్యం. కోనసీమ, కాకినాడ, కొవ్వూరు నుంచి కూడా అనేకమంది ఇక్కడకు వచ్చి హలీమ్ రుచి చూస్తారు.

నవాబుల కాలంలో..

హైదరాబాద్ ఆరో నవాబు మహబూబ్ అలీఖాన్‌కు అరబ్ దియాస్పార తెగకు సంబంధించిన వ్యక్తి హలీమ్‌ను పరిచయం చేశాడు. అప్పట్లో హలీమ్‌లో నాలుగు రకాల దినుసులు మాత్రమే వాడేవారు. ఏడో నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ సూచనలతో ఆస్థాన వంటవారు బిర్యానీకి వాడే దినుసులతో హలీమ్ తయారు చేశారు. ఇది పాత హలీమ్ కంటే రుచిలో మేటిగా, శక్తినివ్వడంలో మరింత మెరుగ్గా తయారైంది. అప్పటి నుంచీ ఈ వంటకం హైదరాబాద్ నుంచి విదేశాలకు ఎగుమతి కూడా అవుతోంది. అరబ్బు దేశం నుంచి వచ్చిన ఈ వంటకం తిరిగి అక్కడికే ఎగుమతి అవుతూండటం విశేషం. ఇప్పుడు అమెరికా, బ్రిటన్ వంటి 30 దేశాల్లోని ప్రజలు దీని రుచిని ఆస్వాదిస్తున్నారు.

మూడు రకాలు

హలీమ్‌లో చికెన్, మటన్, వెజిటబుల్ అనే మూడు రకాలున్నాయి. హలీమ్ తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, గోధుమలు, జీడిపప్పు, బాదం, పిస్తా, షాజీరా, యాలకులతో పాటు సన్నగా తరిగి, నేతిలో వేయించిన ఉల్లిపాయలు, పుదీనా, కొత్తిమీర వంటి 30 రకాల వివిధ రుచికరమైన వంట పదార్థాలు వాడతారు. హైదరాబాద్ హలీమ్ పేరుతో 2010లో భారతదేశం జియోగ్రాఫికల్ ఇండికేషన్ స్టేటస్(జీఐఎస్)లో గుర్తింపు పొందింది. రంజాన్ మాసంలో అంతర్జాతీయ ఫుడ్ బిజినెస్‌లో అత్యధికంగా అమ్ముడుపోయే ఆహార పదార్థంగా హలీమ్ ఎదిగింది.

హై హెల్దీ ఫుడ్

రుచిలోనే కాదు.. పోషక విలువల్లో కూడా హలీమ్‌కు సాటి ఏదీ లేదు. అత్యధిక పోషకాలున్న ఆహారం ఇది. హై ప్రొటీన్లు, కేలరీలు, కాల్షియం ఇందులో పుష్కలంగా ఉన్నాయని న్యూట్రీషియన్లు చెబుతారు. శరీరంలో లోపించే విటమిన్లను సమృద్ధిగా అందించే ప్రత్యేక వంటకం హలీమ్. శారీరక శక్తి లోపించిన వారికి ఇది దివ్యౌషధం. అందుకే కఠినమైన ఉపవాస దీక్ష చేసే ముస్లింలు తక్షణ శక్తి కోసం ఉపవాస దీక్ష అనంతరం ఇఫ్తార్‌గా సాయంత్రం హలీమ్ తీసుకుంటారు. శరీరంలో శక్తి పునరుత్తేజితం అవుతుంది. మళ్లీ సహర్ నుంచి ఇఫ్తార్ వరకూ ఉపవాస దీక్ష చేయడానికి శక్తిని ఇస్తుంది.

తయారీ ఇలా..

హలీమ్ తయారీ చాలా కష్టంతో కూడుకున్నది. దీని తయారీకి ఇటుకలతో తయారు చేసిన బట్టీలో మంట వద్ద 10 నుంచి 12 గంటల పాటు ఇద్దరు మాస్టర్లు శ్రమ పడాల్సి ఉంటుంది. చిన్నపాటి మంటపై అడుగంటకుండా ఇద్దరు వ్యక్తులు నిత్యం పొడుగాటి చేతికర్ర తిప్పుతూ ఉండాలి. ఏ మాత్రం అడుగంటినా దీని రుచి పాడవుతుంది.

రాజమహేంద్రవరం రావాల్సిందే..

ఒకప్పుడు హలీమ్ పేరు చెప్తే హైదరాబాద్ గుర్తుకు వచ్చేది. కానీ నేడు రాజమహేంద్రవరం నగరానికి కూడా పేరు వచ్చింది. హైదరాబాద్ నుంచి వంట మాస్టర్లను తీసుకువచ్చి అదే రుచి వచ్చేలా ఇక్కడా తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరం జాంపేటలో సుమారు 20 షాపులు ఏర్పాటు చేశారు. వీటిలో 60 నుంచి 70 మంది మాస్టర్లు పని చేస్తున్నారు. చికెన్, మటన్ హలీమ్‌లు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. చికెన్ హలీమ్ రూ.90కి, మటన్ హలీమ్ రూ.120, వెజిటబుల్ హలీమ్ రూ.50కి విక్రయిస్తున్నారు. మరి కొన్ని షాపుల్లో చికెన్ హలీమ్ రూ.60, మటన్ హలీమ్ రూ.90కి విక్రయిస్తున్నారు. హలీమ్ తిన్న తరువాత ఎవ్వరైనా సరే స్పెషల్ రంజాన్ డ్రింక్‌లు తాగకుండా వెళ్లలేరు. ఫ్రూట్ సలాడ్, పాలుధా, డ్రైఫ్రూట్ ఐస్‌క్రీమ్, షర్బత్, జీరా సోడా వంటి వాటికి గిరాకీ ఎక్కువ.

శ్రమతో కూడుకున్నది

హలీమ్ తయారీకి 10 నుంచి 12 గంటల వరకూ పడుతుంది. తెల్లవారుజామున ప్రారంభిస్తే సాయంత్రం 4 గంటలకు అందించగలం. పెద్ద పొయ్యి మీద పెద్ద బానలు పెట్టి వండుతాం. ఒక్కో బానలో 10 కేజీల వరకూ హలీమ్ తయారవుతుంది. 10 కేజీల చికెన్, 10 కేజీల మటన్, 10 కేజీల వెజిటబుల్ హలీమ్ తయారు చేస్తాం. హలీమ్ తయారీలో మూడు తరాల నుంచి ప్రావీణ్యం ఉంది. - షేక్ చాంద్

ఈ టేస్ట్‌కు మరేదీ సాటి రాదు

ఇక్కడ అమ్ముతున్న హలీమ్‌ను ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో క్రమం తప్పకుండా తింటున్నాను. దీని టేస్ట్‌కు మరేదీ సాటి రాదు. చికెన్, మటన్ హలీమ్‌లు చాలా టేస్ట్‌గా ఉంటాయి. నోటిలో పెట్టుకుంటే ఇట్టే కరిగిపోతాయి. పేస్టు చేసినట్టుగా ఉండటంతో నమిలి మింగాల్సిన అవసరం లేకుండా గొంతులోకి జర్రున జారిపోతుంది. - కె.శ్రీనివాస్

విస్తృతంగా వసతులు

- పారిశ్రామిక పార్కులు, టౌన్‌షిప్స్‌లో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు.. పీపీపీ విధానంలో కనీసం ఐదు పార్కుల అభివృద్ధి లక్ష్యం
- వీటికి అదనంగా రెడీ టు బిల్ట్ పార్కులు.. ప్రైవేట్ రంగంలో ఎంఎస్ఎంఈ, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధి
- 2023-27 పారిశ్రామిక పాలసీలో విధివిధానాలు ప్రకటించిన ప్రభుత్వం



2లో

ఇంటూజాన్



ఇది ఆఫీస్ 2050



ఆఫీసు అంటే ఎలా ఉంటుంది?.. వరుసపెట్టి టేబుళ్లు, కుర్చీలు.. కంప్యూటర్లు.. హడావుడిగా పనిచేసుకునే ఉద్యోగులు..

మరి 2050లో ఆఫీస్ ఎలా ఉంటుంది?.. హోలోగ్రామ్ రిసెప్షనిస్ట్.. వర్చువల్/అగుమెంటెడ్ రియాలిటీ మీటింగ్‌లు.. చెప్పిన పనిచేసే రోబోలు.. కాసేపు కునుకు తీయడానికి బెడ్లు.. కాఫీ తెచ్చి ఇచ్చే డ్రోన్లు.. ..మరో 30 ఏళ్లలో అత్యాధునిక టెక్నాలజీల సాయంతో ఆఫీసుల రూపురేఖలు, పనివాతావరణం ఎలా మారిపోతాయనే అంశంపై 'ఫర్నీచర్ ఎట్ వర్క్' సంస్థ అధ్యయనం చేసి ఈ వివరాలను తెలిపింది. ఉద్యోగుల నుంచి మరింత 'పని'ని రాబట్టుకోవడంతోపాటు వారికి ఆరోగ్యం, ఆహ్లాదం అందించేలా ఆఫీ సులు రూపొందుతాయని పేర్కొంది. – సాక్షి, సెంట్రల్‌డెస్క్

1. అవసరానికి తగినట్టు సులువుగా మార్చుకో గలిగేలా.. కదిలే గోడలు, ఆధునిక ఫర్నీచర్ వస్తాయి.
2. అవసరానికి తగ్గట్టు లైటింగ్, గాలి నాణ్యతను చెక్ చేస్తూ శుభ్రపర్చడం, ఉష్ణోగ్రతను చెక్ చేస్తూ సమానంగా ఉంచడం వంటివి ఆటోమేటిగ్గా జరిగేలా సెన్సర్లతో ఆఫీసు భవనాలు 'స్మార్ట్'గా మారుతాయి.
3. పనితీరు మెరుగుపడేలా ఎప్పటికప్పుడు వర్చువల్ రియాలిటీతో కూడిన శిక్షణ.
4. ఆఫీసుకు వచ్చే సందర్శకులకు సమాచారం ఇవ్వగల హోలోగ్రామ్ రిసెప్షనిస్ట్
5. వేలిముద్రల (బయోమెట్రిక్)తో తెరుచుకునే ఫ్రిడ్జ్‌లు
6. ఉద్యోగులు లేచి వెళ్లాల్సిన పనిలేకుండా కాఫీ, టీలు తెచ్చే డ్రోన్లు
7. ఆఫీసులో గాలి కాలుష్యాన్ని తొలగించేలా గోడలకు నానో పెయింట్లు
8. పని అలసట నుంచి చిన్న కునుకుతో సేద తీరేందుకు న్యాపింగ్ బెడ్స్
9. ఒత్తిడిని తగ్గించుకునేందుకు వర్చువల్/అగుమెంటెడ్ రియాలిటీతో కూడిన మెడిటేషన్ గది
10. చిన్న పిల్లలున్న ఉద్యోగుల కోసం బేబీ సిట్టర్, ప్రత్యేక రూమ్
11. ఒకరినొకరు సంప్రదించుకుంటూ పని చేయాల్సిన ఉద్యోగుల కోసం ఓపెన్ ఆఫీస్
12. ఆఫీసులోకి వచ్చే ప్రతి ఒక్కరిని గుర్తించే ఫేస్ స్కానింగ్ వ్యవస్థ
13. అవసరమైన సమాచారాన్ని చూసేందుకు, సమావేశాల కోసం వర్చువల్/అగుమెంటెడ్ రియాలిటీ కళ్లద్దాలు
14. ఆహ్లాదకరమైన, కాలుష్య రహిత వాతావరణం కోసం మాడ్యులర్ గ్రీన్ వాల్స్
15. పర్యావరణ హితమైన బయోఫిలిక్ ఫర్నీచర్
16. ఎక్కువ ఏకాగ్రతతో పనిచేయాల్సిన ఉద్యోగుల కోసం 'యాంటీ డిస్ట్రాక్షన్ టెక్నాలజీ' క్యాబిన్లు
17. క్లీనింగ్‌తో పాటు వివిధ రకాల పనుల కోసం రోబోలు
18. ఉద్యోగులు, ఆఫీసర్లు నేరుగా కలిసి మాట్లాడుకున్న అనుభూతి వచ్చేలా హోలోగ్రామ్ ఆధారిత వర్చువల్ సమావేశాలు
19. శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితిని గమనించే రిస్ట్ బ్యాండ్లు

గవర్నర్‌కు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ఆహ్వానం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట కోదండ రామ స్వామి దేవస్థానంలో జరిగే శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను టీటీడీ ఆహ్వానించింది. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి కలిసి ఆహ్వాన పత్రం అందించారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

గవర్నర్‌తో హైకోర్టు న్యాయమూర్తి భేటీ

గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ ఆదివారం భేటీ అయ్యారు. విజయవాడ రాజ్‌భవన్‌లో ఆయన గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్

'ఇస్రో'కు గవర్నర్ అభినందనలు

సాక్షి, అమరావతి : ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందించారు. ఈ విజయంతో భారత దేశ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరిందని ఆయన అన్నారు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించినట్టుగా రాజ్‌భవన్ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి.

ఇస్రో బృందాన్ని అభినందించిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ ప్రయోగం విజయవంతమవడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. 'భారత అంతరిక్ష చరిత్రలో ఈ రోజు ఒక ముఖ్యమైన మైలురాయిగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది..' అంటూ ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. గ్లోబల్ స్పేస్ టెక్నాలజీపై భారతదేశ సామర్థ్యాన్ని ముందుకు తీసుకెళ్లే వన్‌వెబ్ రెండో వెంచర్ కోసం 36 ఉప గ్రహాలను మోసుకెళ్లే అతిపెద్ద రాకెట్ ఎల్‌వీఎం3ని విజయవంతంగా ప్రయోగించారని సీఎం జగన్ కొనియాడారు.

తెలుగు రాష్ట్రాల మధ్య మరో వందేభారత్ రైలు

ఏప్రిల్ 8 నుంచి సికింద్రాబాద్–తిరుపతి మధ్య..



సాక్షి, అమరావతి: తెలుగురాష్ట్రాల మధ్య మరో వందేభారత్ రైలు పట్టాలు ఎక్కనుంది. సికింద్రాబాద్–తిరుపతి మధ్య వందేభారత్ రైలు నడపాలని కేంద్ర రైల్వేశాఖ నిర్ణయించింది. ఏప్రిల్ 8 నుంచి ఈ రైలును ప్రవేశపెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించి దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సమాచారమిచ్చింది. ఈ రైలు రూట్, ప్రయాణ సమయాలు, ఆగాల్సిన రైల్వేస్టేషన్లు, చార్జీలపై నివేదికను సమర్పించమని ఆదేశించింది. దీనిపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్–తిరుపతి మధ్య నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణించే రూట్‌లోనే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నిర్వహించాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. దీనిపై అధికారికంగా నిర్ణయం తీసుకున్న తరువాత ఈ రైలును ప్రవేశపెట్టడం గురించి ప్రకటన చేయాలని వారు భావిస్తున్నారు. రెండు తెలుగురాష్ట్రాల మధ్య మూడు వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వేశాఖ గతంలోనే నిర్ణయించింది. అందులో మొదటగా సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య వందేభారత్ రైలును ఇటీవల ప్రవేశపెట్టారు. ఆ రైలుకు ప్రయాణికుల నుంచి అత్యంత ఆదరణ లభిస్తోంది. రోజూ వందశాతం ఆక్యుపెన్సీ సాధిస్తోంది. ఈ నేపథ్యంలో రెండో వందేభారత్ రైలును సికింద్రాబాద్–తిరుపతి మధ్య నడిపేందుకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది.

కాకినాడ పోర్టు–అన్నవరం రోడ్డు నిర్మాణానికి రూ.1,439.88 కోట్లు



సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: రాష్ట్రానికి మరో రహదారిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అన్నవరం నుంచి కాకినాడ పోర్టును జాతీయ రహదారి–65తో అనుసంధానిస్తూ నాలుగు లేన్ల రహదారి నిర్మించాలని నిర్ణయించింది. వాకలపూడి లైట్‌హౌస్ (కాకినాడ పోర్టు) నుంచి అన్నవరం వరకు మొత్తం 50 కి.మీ. మేర నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తారు. ఇందుకోసం రూ.1,439.88 కోట్లు ఖర్చు కాగల ప్రతిపాదనలను ఆమోదించినట్టు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదివారం ట్వీట్ చేశారు. ప్రతిపాదిత ప్రాజెక్టులో 40.621 కిలోమీటర్ల విస్తరణను హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతిలో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదన మేరకు రాష్ట్రంలో పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానిస్తూ ఇప్పటికే 13 రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. తాజాగా మరో పోర్టును అనుసంధానిస్తూ మరో రహదారి నిర్మాణ ప్రతిపాదనకు కూడా ఆమోదించడం విశేషం.

ఓటుకు కోట్లు 2.0

▶ మొదటి పేజీ తరువాయి

క్రాస్ ఓటింగ్‌ను ప్రోత్సహించింది. ఆది నుంచి తాను నమ్ముకున్న కొనుగోళ్లు, కుమ్మక్కు రాజకీయాలనే మరోసారి అనుసరించింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించడంలో విఫలమైన వారితోపాటు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ టికెట్ దక్కదనే సంకేతాలున్న వారిని ప్రలోభాలకు గురి చేసి అనైతిక చర్యలకు పాల్పడింది. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వాస్తవాలను వెల్లడించడంతో చంద్రబాబు స్క్రిప్టు ప్రకారం అమలైన 'ఓటుకు కోట్లు స్కాం 2.0' బహిర్గతమైంది.

బలం లేదని స్పష్టంగా తెలిసినా..

ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ద్వారా టీడీపీ తన అభ్యర్థి పంచుమర్తి అనూరాధను గట్టెక్కించుకోగలిగింది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175 కాగా వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులున్నారు. టీడీపీ తరపున గెలిచిన 23 మందిలో నలుగురు ఆదిలోనే ఆ పార్టీకి దూరంగా జరగడంతో సాంకేతికంగా ఉన్న సభ్యులు 19 మంది మాత్రమే. జనసేన నుంచి గెలిచిన ఎమ్మెల్యే రాపాక కూడా ఆ పార్టీకి దూరంగానే ఉంటున్నారు. టీడీపీ, జనసేన విధానాలతో విభేదించిన ఆ ఐదుగురు ఎమ్మెల్యేలూ వైఎస్సార్ సీపీకి మద్దతు ఇస్తున్నారు. అంటే అధికార పార్టీకి సాంకేతికంగా ఉన్న సభ్యులు 156 అని స్పష్టమవుతోంది. ఒక్కో ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుపొందాలంటే 22 మంది ఎమ్మెల్యేల ప్రథమ ప్రాధాన్యత ఓట్లు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్నందున ఖాళీ అయిన ఏడు స్థానాలకు తన అభ్యర్థులను బరిలోకి దించింది. గెలిచే బలం లేకపోయినప్పటికీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆ పార్టీ అభ్యర్థిని పోటీకి పెట్టారు. గెలిచే బలం లేకుండా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించడాన్ని బట్టి చూస్తుంటే తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే రూ.కోట్లు ఎర వేసి బేరసారాలకు చంద్రబాబు వ్యూహం రచించినట్లు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు ఆదిలోనే చెప్పారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.పది కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ వెదజల్లి కొనుగోలు చేసి టీడీపీ అభ్యర్థిని చంద్రబాబు గెలిపించుకున్నారని సజ్జలతోపాటు పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రాపాక వాస్తవాలను వెల్లడించడటంతో ఓటుకు కోట్లు స్కాం 2.0 బట్టబయలైంది.

అసెంబ్లీ లాబీ వేదికగా పదేపదే ప్రలోభాలు

రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ జనసేన నుంచి గెలుపొందినా పవన్ కళ్యాణ్ పోకడలను నిరసిస్తూ ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్ వెంట ప్రజాభీష్టం ప్రకారం నడుస్తున్నారు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాపాకను ప్రలోభాలకు గురి చేసి తమ వైపునకు తిప్పుకునేందుకు ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే మంతెన రామరాజును చంద్రబాబు బరిలోకి దించారు. తన మిత్రుడు కేఎస్ఎన్ రాజు ద్వారా టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించినట్లు ఎమ్మెల్యే రాపాక తాజాగా మీడియాకు బహిర్గతం చేశారు. తెలుగు దేశం పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే పెద్ద ఎత్తున డబ్బులతో పాటు పార్టీలో మంచి స్థానం కల్పిస్తామని రామరాజు తనకు ప్రతిపాదన పంపారని వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజు కూడా లాబీల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే మంతెన రామరాజు తనను పక్కకు పిలిచి మరోసారి ప్రలోభపెట్టారని రాపాక చెప్పారు. తనను పదే పదే ప్రలోభాలకు గురి చేసినా డబ్బులకు అమ్ముడుపోయి వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోలేనని మరోసారి తేల్చి చెప్పినట్లు రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. అనంతరం మరో ఇద్దరు ఎమ్మెల్యేలను కూడా టీడీపీ ప్రలోభాలకు గురిచేసిన విషయం తెలిసిందన్నారు. కాగా ఈ అంశంపై ఉండి ఎమ్మెల్యే రామరాజు మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ లాబీల్లో ఎమ్మెల్యే రాపాకను కలసి మాట్లాడిన విషయం వాస్తవమేనని అంగీకరించడం గమనార్హం. అయితే రాపాకను ప్రలోభపెట్టలేదంటూ దాటవేసే యత్నం చేశారు.

ప్రలోభాలకు ఆది గురువు

రాజకీయాల్లో ప్రలోభాల పర్వం చంద్రబాబుతోనే మొదలైందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎన్టీఆర్‌కు 1995లో వెన్నుపోటు పొడిచి టీడీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి చంద్రబాబు అధికారం చేజిక్కించుకున్న వైనాన్ని గుర్తు చేస్తున్నారు. ఇక రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ శాసన మండలికి 2015లో ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్యాబలం లేకపోయినా టీడీపీ అభ్యర్థి వేం నరేంద్రరెడ్డిని చంద్రబాబు బరిలోకి దించారు. రూ.కోట్లు ఎర వేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు తన శిష్యుడు రేవంత్‌రెడ్డిని పురమాయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు డబ్బుల కట్టలతో కూడిన బ్యాగ్‌ను అందచేస్తుండగా తెలంగాణ ఏసీబీ సాక్ష్యాధారాలతో రెడ్‌హ్యాండెడ్‌గా 2015 మే 31న పట్టుకుంది. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణ సర్కార్‌కు తాకట్టుపెట్టి మరీ రాత్రికి రాత్రే చంద్రబాబు హైదరాబాద్ నుంచి పరారై కృష్ణా కరకట్టపై ఉండవల్లి వద్ద ఉన్న అక్రమ నివాసానికి చేరుకున్నారు. తాజాగా శాసనమండలికి ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇదే రీతిలో ఓటుకు నోట్లు కుంభకోణానికి చంద్రబాబు పాల్పడటం గమనార్హం. అందుకే పుట్టుకతో వచ్చిన గుణం చచ్చే దాకా పోదనే నానుడి ఆయనకు అతికినట్లు సరిపోతుందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బేరసారాలు నిజమే!

సఖినేటిపల్లి/మలికిపురం: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలంటూ ఆ పార్టీ నుంచి తనకు భారీ ఆఫర్ అందినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు శాసనసభ్యుడు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వెల్లడించారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. దీనిపై ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. నీతి, నిజాయితీతో పని చేయాలని, అవినీతికి పాల్పడకూడదని కార్యకర్తలకు తాను సూచించినట్లు చెప్పారు. తాను అక్రమాలకు పాల్పడాలనుకుంటే, తప్పుగా ఓటు వేస్తే కనీసం రూ.10 కోట్లు వచ్చేవని చెప్పానన్నారు. 'నాకు టీడీపీ నుంచి ఆఫర్ వచ్చింది. పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని, ఫైనాన్షియల్ మేటర్ మాట్లాడదామని ఉండి ఎమ్మెల్యే రామరాజు నాతో చెప్పారు. నేను వెంటనే తిరస్కరించా. క్రాస్ ఓటు చేయబోనని చెప్పాను. దాని గురించి నాతో మాట్లాడవద్దని స్పష్టం చేశా. అంతకుముందు రోజు నా స్నేహితుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కేఎస్ఎన్ రాజుతో కూడా ఆయన ఇదే విషయం ప్రస్తావించారు. మీ ఎమ్మెల్యే మాకు అనుకూలంగా ఓటేస్తే మేం అన్ని రకాలుగా చూసుకుంటామని చెప్పారు. అయితే కేఎస్ఎన్ రాజు.. ఈ విషయం మా ఎమ్మెల్యే(రాపాక)తో చెప్పబోనని, ఇలాంటి వాటికి ఆయన ఒప్పుకోరని స్పష్టం చేశారు. తరువాత రామరాజు నన్ను నేరుగా అప్రోచ్ కావడంతో క్రాస్ ఓటు చేయబోనని తేల్చి చెప్పా' అని ఎమ్మెల్యే రాపాక వెల్లడించారు.

విస్తృతంగా వసతులు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తూ పెట్టుబడులను ఆకర్షించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం పారిశ్రామిక పార్కులు, టౌన్‌షిప్స్‌ను అభివృద్ధి చేసేలా నూతన పారిశ్రామిక విధానం 2023–27లో పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించే పార్కుల్లో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు నివాసానికి అనువుగా టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయనున్నారు. నివాసం నుంచి ఆఫీసుకు నడుచుకుంటూ వెళ్లే విధంగా వాక్ టు వర్క్ విధానంలో పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దనున్నారు. రాష్ట్రంలోని మూడు పారిశ్రామిక కారిడార్లలో ఉన్న 10 పారిశ్రామిక పార్కుల్లో కనీసం ఐదు పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. కేవలం భారీ పారిశ్రామిక పార్కులే కాకుండా పీపీపీ విధానంలో ఎంఎస్‌ఎంఈ, లాజిస్టిక్ పార్కులు, కోల్డ్ చైన్‌లను అభివృద్ధి చేస్తారు. దీనికి సంబంధించిన విధివిధానాలను పారిశ్రామిక పాలసీలో ప్రభుత్వం ప్రకటించింది.



ప్రైవేట్ పారిశ్రామిక పార్కులు

ప్రైవేట్ రంగంలో పార్కులు అభివృద్ధి చేసేందుకు కనీస ప్రారంభ పెట్టుబడి రూ.200 కోట్లుగా నిర్ణయించారు. ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు కనీసం 50 ఎకరాలకు పైగా ఉండాలి. అదే ఏపీఐఐసీ, ప్రభుత్వ భాగస్వామ్యంతో నెలకొల్పితే కనీస పరిమితిని 100 ఎకరాలుగా నిర్ణయించారు. అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కులో నివాస, వాణిజ్య సముదాయాల పరిమితి 33 శాతం మించి అనుమతించరు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా మొక్కల పెంపకం, వాననీటి సంరక్షణ కోసం 33 శాతం కేటాయించాల్సి ఉంటుంది. పూర్తిగా ప్రైవేట్ రంగంలో పార్కును అభివృద్ధి చేస్తే ఇందుకోసం ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసి భూమిని బదలాయించాలి. ఒకవేళ ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటే ఎస్‌పీవీలో పెయిడ్ క్యాపిటల్‌గా 2 – 11 శాతం వాటా ప్రభుత్వానికి కేలాయించాల్సి ఉంటుంది. ఈ పార్కులో 90 శాతం వినియోగంలోకి వచ్చిన తర్వాత వాటాను ప్రభుత్వం విక్రయిస్తుంది. ఒకవేళ ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ డెవలపర్ పార్కును అభివృద్ధి చేయడానికి వస్తే దీర్ఘకాలిక లీజు విధానంలో భూమిని కేటాయిస్తారు. స్విస్ చాలెంజ్ విధానంలో ప్రైవేట్ డెవలపర్‌ను ఎంపిక చేస్తారు. నిబంధనలకు అనుగుణంగా పార్కును అభివృద్ధి చేయడంలో డెవలపర్ విఫలమైతే ఒప్పందాన్ని రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో భారీ పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి పారదర్శకంగా బిడ్డింగ్ విధానంలో ఎంపిక చేస్తారు. కేంద్ర ప్రభుత్వ పీపీపీ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేట్ డెవలపర్స్ ఎంపిక జరుగుతుంది.

ఎంఎస్‌ఎంఈ పార్కులు

అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్‌ఎంఈ రంగంలో కూడా ప్రైవేట్ పారిశ్రామిక పార్కులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కనీసం 25 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు కానున్నాయి. రెడీ టు బిల్డ్.. అంటే తక్షణం వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించుకునే విధానంలో డిజైన్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను కనీసం 50,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే విధంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం నూతన పారిశ్రామిక విధానంలో ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ పార్కుల మౌలిక వసతుల నిర్మాణ వ్యయంలో 25 శాతం గరిష్ఠంగా రూ.కోటి వరకు తిరిగి చెల్లిస్తారు. స్టాంప్ డ్యూటీ, భూ వినియోగ మార్పిడి చార్జీలు (నాలా) వంద శాతం రీయింబర్స్‌చేస్తారు. రుణాలపై మూడేళ్లపాటు మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తారు. అభివృద్ధి చేసిన పారిశ్రామిక పార్కులో 50 శాతం వినియోగంలోకి రాగానే 50 శాతం ప్రోత్సాహకాలు అందిస్తారు. 100 శాతం వినియోగంలోకి వస్తే మిగిలిన 50 శాతం కూడా చెల్లిస్తారు.

లాజిస్టిక్ పార్కులు

సరుకు రవాణా వ్యయం తగ్గించే విధంగా లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, శీతల గిడ్డంగుల్లో ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆకర్షించేలా నూతన పారిశ్రామిక విధానంలో పలు ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. ప్రైవేట్ రంగంలో లాజిస్టిక్ పార్కులు, ఇన్‌లాండ్ కంటైనర్ డిపోలను అభివృద్ధి చేయడానికి కనీస పెట్టుబడిని రూ.50 కోట్లుగా నిర్ణయించారు. గోడౌన్ల నిర్మాణానికి రూ.5 కోట్లు, శీతల గిడ్డంగులకు రూ.3 కోట్లుగా నిర్ణయించారు. లాజిస్టిక్స్ వేర్‌హౌసింగ్‌కు పరిశ్రమ హోదా ఇవ్వడంతోపాటు 100 శాతం స్టాంప్ డ్యూటీని రీయింబర్స్ చేస్తారు. పేటెంట్ల రిజిస్ట్రేషన్ల వ్యయంలో 75 శాతంతో పాటు పారిశ్రామిక పాలసీ 2020–23లో పేర్కొన్న రాయితీలను వర్తింప చేస్తారు.

సీఎం జగన్ ప్రకాశం, విశాఖ పర్యటనలు ఖరారు

- నేడు ప్రకాశం జిల్లా కారుమంచికి ముఖ్యమంత్రి జగన్
- నేటి సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ
- రేపు విశాఖలో జీ–20 సదస్సుకు హాజరు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రకాశం జిల్లాలోను, మంగళవారం విశాఖపట్నంలోను పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చేరుకుంటారు. 11.15 గంటలకు కొండెపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు నివాసంలో ఆయన తల్లి కోటమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 1.05 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో సీఎం జగన్ మర్యాదపూర్వకంగా సమావేశం అవుతారు.

28న విశాఖ పర్యటన

28వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి సీఎం వైఎస్ జగన్ బయలుదేరి 5.15 గంటలకు విశాఖ చేరుకుంటారు. సాయంత్రం 6 గంటలకు రిషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్స్‌కు చేరుకుని రాత్రి 7–8 గంటల మధ్య జీ–20 ప్రతినిధులతో జరిగే ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అతిథులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'గాలా డిన్నర్'లో పాల్గొని రాత్రి 8.45 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 10 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

81 శాతం భూరికార్డుల స్వచ్ఛీకరణ

- రికార్డులు అప్‌డేట్ అయితేనే సర్వే ప్రారంభించే అవకాశం
- అందుకే వేగంగా పూర్తిచేస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వందశాతం పూర్తి

సాక్షి, అమరావతి: భూముల రీసర్వే నేపథ్యంలో నిర్వహిస్తున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ (ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్స్) రాష్ట్రవ్యాప్తంగా 81 శాతం పూర్తయింది. రాష్ట్రంలో వందేళ్ల తర్వాత వైఎస్సార్ జగనన్న భూరక్ష, శాశ్వత భూహక్కు పథకం పేరుతో నిర్వహిస్తున్న రీసర్వేలో రికార్డుల ప్రక్షాళన అత్యంత కీలకంగా మారింది. రీసర్వే ప్రారంభించాలంటే రికార్డులను అప్‌డేట్ చేయడం తప్పనిసరి. వెబ్‌ల్యాండ్ అడంగల్‌లను ఆర్ఎస్ఆర్‌తో పోల్చి చూడడం, అడంగల్‌లో పట్టాదారు వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో చూసి సరిచేయడం, పట్టాదారు, అనుభవదారుల వివరాల కరెక్షన్, అప్‌డేషన్, పట్టాదారు డేటాబేస్‌ను అప్‌డేట్ చేయడం వంటివన్నీ కచ్చితంగా పూర్తిచేయాల్సి ఉంది. రెవెన్యూ యంత్రాంగం ఇవన్నీ పూర్తిచేసిన తర్వాతే సర్వే బృందాలు రీసర్వే ప్రక్రియను ప్రారంభిస్తాయి. ఈ నేపథ్యంలోనే రికార్డుల స్వచ్ఛీకరణపై ప్రత్యేకదృష్టి సారించి చేస్తున్నారు. 26 జిల్లాల్లోని 17,564 గ్రామాలను మూడు కేటగిరీలుగా విభజించి స్వచ్ఛీకరణ చేపట్టారు. ఇప్పటివరకు 14,235 గ్రామాల్లో (81 శాతం) పూర్తయింది.

అల్లూరి జిల్లాలో 25 శాతం మాత్రమే

అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వందశాతం రికార్డుల స్వచ్ఛీకరణను పూర్తిచేశారు. అనంతపురం జిల్లాలో 504 గ్రామాలకు 504, కర్నూలు జిల్లాలో 472కి 472, నంద్యాల జిల్లాలో 441కి 441 గ్రామాల్లో స్వచ్ఛీకరణ పూర్తయింది. చిత్తూరు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 99 శాతం స్వచ్ఛీకరణ పూర్తయింది. ఈ జిల్లాల్లో రెండేసి గ్రామాల్లో మాత్రమే ఇంకా పూర్తికావాల్సి ఉంది. సత్యసాయి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల్లో 98 శాతం స్వచ్ఛీకరణ పూర్తయింది. అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 25 శాతం స్వచ్ఛీకరణనే పూర్తిచేయగలిగారు. ఆ తర్వాత విశాఖపట్నం జిల్లాలో 44 శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 61 శాతం స్వచ్ఛీకరణ పూర్తయింది. రెండునెలల్లో అన్ని జిల్లాల్లో వందశాతం రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తిచేసేందుకు రెవెన్యూశాఖ ప్రణాళిక రూపొందించి పనిచేస్తోంది.

క్లుప్తంగా...

వైజాగ్‌లో కార్నివాల్ సందడి


విద్యార్థుల సంప్రదాయ నృత్య ప్రదర్శన

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న జి–20 శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం వైఎంసీఏ నుంచి ఆర్కే బీచ్ వరకు వైజాగ్ కార్నివాల్ నిర్వహించారు. రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి కార్నివాల్ ప్రారంభించారు. పులి వేషాలు, కోయ వేషధారణలు, తోలు బొమ్మల వేషధారణలతో నృత్యాలు చేస్తూ కళాకారులు అలరించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కూచిపూడి, భరత నాట్యం, అరకు థింసా, బుట్టబొమ్మలు, కోలాటం, భామాకలాపం, వీర నాట్యం వంటి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. పెద్దసంఖ్యలో నగర వాసులు వివిధ వేషధారణలతో కార్నివాల్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మునిసిపల్ స్పెషల్ సెక్రటరీ శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, మునిసిపల్ కమిషనర్ పి.రాజాబాబు, కళాకారులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం చరిత్రలో నిలిచిపోతుంది

సీఎంకు కత్తి పద్మారావు లేఖ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకుడు కత్తి పద్మారావు ప్రశంసించారు. ఈ మేరకు సీఎంకు రాసిన బహిరంగ లేఖను ఆయన మీడియాకు విడుదల చేశారు. అంబేడ్కర్ స్మృతివనం కోసం గతంలో చంద్రబాబుపై పోరాటం చేశామని పేర్కొన్నారు. స్మృతివనం ఏర్పాటు కార్యక్రమంలో దళిత మహాసభను కూడా భాగస్వాముల్ని చేయాలని కోరారు. స్మృతివనానికి అనుబంధంగా అంబేడ్కర్ యూనివర్సిటీని స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ ఇవ్వడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దళితవాడల్లో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు, కుటీర పరిశ్రమలు స్థాపించాలని.. దళిత మహిళలకు 2 ఎకరాల చొప్పున భూమిని పంచాలని విజ్ఞప్తి చేశారు. మద్యం షాపుల్లో విక్రయ సమయాన్ని తగ్గించాలని విన్నవించారు.

భావోద్వేగాలు మార్చిన కోవిడ్

కోవిడ్ సోకిన భారతీయుల్లో తీవ్ర ప్రతికూలమార్పులు



- 35 శాతం మందిలో నెగిటివ్ ఎమోషన్స్ ప్రభావం
- ఆర్థిక సమస్యలు, పని ఒత్తిడి, సామాజిక నిబంధనలు, ఒంటరితనంతో ఇబ్బందులు
- కన్సల్టింగ్ సంస్థ హ్యాపీప్లస్ 'ది స్టేట్ ఆఫ్ హ్యాపీనెస్ 2023' నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: కోవిడ్ మహమ్మారి భారతీయుల భావోద్వేగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఒత్తిడి, కోపం, విచారం, ఆందోళనలతో ఇటీవల కాలంలో నిరాశ, నిస్పృహలను పెంచుతోంది. ఫలితంగా కోవిడ్ సోకిన భారతీయుల్లో సంతోషాల శాతం క్షీణిస్తోంది. కన్సల్టింగ్ సంస్థ హ్యాపీప్లస్ 'ది స్టేట్ ఆఫ్ హ్యాపీనెస్ 2023' నివేదిక ప్రకారం.. 35 శాతం మంది 'నెగిటివ్ ఎమోషన్స్' అనుభవిస్తున్నారు. ఇది గత సర్వేతో పోలిస్తే రెండుశాతం ఎక్కువగా ఉండటం గమనార్హం. మరోవైపు భారతీయుల్లో సానుకూల భావోద్వేగాలు 70 నుంచి 67 శాతానికి పడిపోయాయి. జీవన మూల్యాంకన రేటు 6.84 పాయింట్ల నుంచి 6.08 పాయింట్లకు తగ్గిపోయింది. ఆర్థిక సమస్యలు, పనిప్రదేశాల్లో ఒత్తిడి, సామాజిక నిబంధనలు, ఒంటరితనం, కుటుంబంలో అనిశ్చితులు వంటి కారణాలు అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయని సర్వే అభిప్రాయపడింది.

యువత, వృద్ధుల్లో పెరుగుతున్న కోపం

హ్యాపీప్లస్ దేశవ్యాప్తంగా 14 వేల మంది ప్రతిస్పందనల ఆధారంగా నివేదిక రూపొందించింది. ఇందులో విద్యార్థుల్లో అత్యధికంగా ప్రతికూల ప్రభావాలు కనిపిస్తున్నాయని తెలిపింది. 18 ఏళ్లలోపు, 60 ఏళ్లు పైబడిన వ్యక్తులు ఇతర వయసుల వారి కంటే ఎక్కువగా కోపం, విచారం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పదిమందికి ఇద్దరు ఈ పరిస్థితిని ఎదుర్కొంటే.. ఇప్పుడు వారిసంఖ్య ఐదుకు పెరగడం గమనార్హం.

తగ్గిన జీవన వృద్ధి

మరోవైపు తాజా అధ్యయనంలో 20 శాతం మంది వివిధ కారణాలతో బాధపడుతున్నట్టు తేలిందని నివేదిక చెబుతోంది. ఇది 2021లో 12 శాతంగా ఉండేది. అలాగే నిత్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు 63 శాతం ఉండగా.. ఇది కూడా గతేడాది కంటే (49 శాతం) పెరిగింది. ఇదిలా ఉంటే గతేడాది 39 శాతం మంది భారతీయులు తాము వృద్ధి సాధించామని చెబితే.. ఇప్పుడు 17 శాతం మంది మాత్రమే ఆ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని నివేదిక పేర్కొంది.

వాటర్ వార్నింగ్!



- మానవాళికి ముంచుకొస్తున్న నీటి సంక్షోభం
- ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల మంది ముప్పుతిప్పలు
- యునెస్కో వరల్డ్ వాటర్ నివేదిక 2023 వెల్లడి

సాక్షి, అమరావతి: మానవాళికి నీటి సంక్షోభం ముంచుకొస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 200 - 300 కోట్ల మంది నీటి కొరత ఎదుర్కొంటుండగా రాబోయే దశాబ్ద కాలంలో ఇది తీవ్రం కానుంది. అంతర్జాతీయ సమాజం మేల్కొని సహకరించుకోకుంటే పరిస్థితి చేయి దాటిపోతుందని ప్రపంచ దేశాలను ఐక్యరాజ్య సమితికి చెందిన యునెస్కో హెచ్చరించింది. మార్చి 22న వరల్డ్ వాటర్ డే సందర్భంగా న్యూయార్క్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా వినియోగం, నిర్వహణపై అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించుకోవాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. వరల్డ్ వాటర్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2 బిలియన్ల (జనాభాలో 26 శాతం) మందికి సురక్షితమైన తాగునీరు దొరకడం లేదు. 3.6 బిలియన్ల (46 శాతం) జనాభాకు సురక్షితమైన పారిశుధ్య నిర్వహణ అందుబాటులో లేదు.

ఉమ్మడి భవిష్యత్తును కాపాడుకుందాం..

ప్రపంచవ్యాప్తంగా నీటి కొరత ఎదుర్కొంటున్న పట్టణ జనాభా 2016లో 930 మిలియన్లు ఉండగా 2050 నాటికి 1.7–2.4 బిలియన్లకు పెరుగుతుందని వరల్డ్ వాటర్ నివేదిక అంచనా వేసింది. నీటిని సంరక్షించుకుంటూ జల వనరులను స్థిరంగా నిర్వహించేందుకు ప్రపంచ దేశాలు కలిసి పనిచేయడం ఎంతో అవసరమని యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆడ్రీ అజౌలే సదస్సులో సూచించారు. అందరికీ నీరు– పారిశుధ్యం అందించాలంటే ప్రపంచ దేశాలు ఉమ్మడి ప్రణాళికను అనుసరించాలన్నారు. కలసికట్టుగా నీటి సంక్షోభ నివారణ చర్యలను వేగవంతం చేయాలని యూఎన్ వాటర్ చైర్ పర్సన్ గిల్బర్ట్ ఎఫ్.హౌంగ్‌బో పిలుపునిచ్చారు.

సహకారంతో సంక్లిష్టతలను అధిగమిద్దాం..

అంతర్జాతీయ సరిహద్దులను పంచుకునే నదులు, జలాశయాల నిర్వహణలో నెలకొన్న సంక్లిష్టతలను అధిగమించకుంటే కష్టాలు తప్పవని యూఎన్ వాటర్ సదస్సు అంతర్జాతీయ సమాజాన్ని హెచ్చరించింది. ఇందుకు ప్రత్యేక దౌత్య మార్గాలను అనుసరించాలని కోరింది. ఇది నీటి భద్రతకు మించి అనేక ప్రయోజనాలను చేకూరుస్తుందని తెలిపింది. అంతర్జాతీయ భాగస్వామ్య ఒప్పందాలున్న 468 జలాశయాలలో కేవలం 6 మాత్రమే ఒప్పందానికి లోబడి ఉన్నట్లు వెల్లడించింది. 2013లో మెక్సికోలో ప్రారంభించిన మోంటెర్రే వాటర్ ఫండ్ కార్యక్రమం ద్వారా నీటి నాణ్యతను పెంచడంతో పాటు వరద నివారణ చర్యలు విజయవంతమయ్యాయని తెలిపింది. ఇక నైరోబీకి 95 శాతం మంచినీటిని, కెన్యాకు 50 శాతం విద్యుత్‌ను సరఫరా చేసే తానా–నైరోబి నదీ పరీవాహక ప్రాంతంతో పాటు ఆఫ్రికాలో అనుసరించిన విధానాలు పరస్పర సహకారానికి ఉదాహరణగా పేర్కొంది.

విద్యా సంస్థలకు యూజీసీ లేఖ



- కోవిడ్ బాధితులకు సూపర్ న్యూమరరీ సీట్లతో ఏ మేరకు లబ్ధి కలిగింది?
- ఎన్ని విద్యా సంస్థల్లో ఎన్ని సీట్లు ఇచ్చారో తెలపాలన్న యూజీసీ

సాక్షి, అమరావతి: దేశంలో అనాథ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన సూపర్ న్యూమరరీ సీట్లతో ఎంతమంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది? ఎన్ని విద్యా సంస్థల్లో వారికి సీట్లు ఇచ్చారో తెలపాలని అన్ని యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వాటికి లేఖ రాసింది. ఇందుకు సంబంధించిన నోటీసును తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. కోవిడ్‌తో 2020, 2021ల్లో అనేక మంది మృత్యువాత పడ్డ సంగతి తెలిసిందే. కొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రులిద్దరూ మరణించడంతో పిల్లలు అనాథలుగా మారారు. వీరిలో కొంతమంది పాఠశాల చదువుల్లో ఉండగా మరికొంతమంది ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. వీరు తదుపరి ఉన్నత తరగతుల్లో చేరేందుకు ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్' కింద అన్ని విద్యాసంస్థల్లోనూ సూపర్ న్యూమరరీ సీట్లు ప్రవేశపెట్టాలని గతేడాది మార్చిలో సూచించింది. ఈ మేరకు అన్ని విద్యాసంస్థలూ సూపర్ న్యూమరరీ సీట్లను అనాథ విద్యార్థులకు కేటాయించేలా చేసింది. ఇప్పుడు విద్యా సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో సూపర్ న్యూమరరీ సీట్లతో లబ్ధి పొందిన వారి సమాచారాన్ని తెలియచేయాలని యూజీసీ ఆయా విద్యాసంస్థలకు సూచించింది. విద్యార్థుల సంఖ్యతో పాటు వారు ఏయే కోర్సులు అభ్యసిస్తున్నారు? వారు ఎలాంటి సహాయం పొందుతున్నారు? వంటి అంశాలను కూడా అందించాలని కోరింది.

తెలంగాణ

డేటా లీకు.. హైదరాబాద్‌తో లింకు

- తెలుగు రాష్ట్రాల ప్రజల వ్యక్తిగత సమాచారం కూడా చౌర్యం
- నేరస్తుల చేతుల్లో బ్యాంకు ఖాతాదారుల వివరాలు
- లోతుగా ఆరా తీస్తున్న సైబరాబాద్ పోలీసులు
- త్వరలోనే జస్ట్ డయల్, గూగుల్, పలు కంపెనీలకు నోటీసులు
- రక్షణ శాఖ వివరాల తస్కరణపై ఆరా తీసిన ఆర్మీ, ఢిల్లీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన డేటా లీకు కేసు తీగ లాగితే డొంక కదులుతోంది. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు హైదరాబాద్‌తోనూ లింకులు ఉన్నట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, గృహిణులు, రక్షణ శాఖ, టెలికం విభాగం ఇలా 138 విభాగాలకు చెందిన 16.8 కోట్ల మంది వ్యక్తిగత వివరాలను చౌర్యం చేసి, విక్రయిస్తున్న ఏడుగురు అంతరాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తొలుత నోయిడా, ఢిల్లీ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత సమాచారం మాత్రమే ఉందని పోలీసులు భావించినప్పటికీ... దర్యాప్తు చేస్తున్న కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ డేటాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత వివరాలు సైతం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డేటాను సైబరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీసు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ (టీఎస్‌పీసీసీ) ద్వారా పోలీసులు విశ్లేషిస్తున్నారు.

ఎవరా హైదరాబాదీ..

తెలుగు రాష్ట్రాలకు చెందిన బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు ఖాతాదారుల వివరాలు తస్కరణకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, పిన్, సీవీవీ నంబర్లతో సహా ఫోన్ నంబర్లు, చిరునామా వంటి సమాచారం ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ డేటా లీకుపై హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా ఆరా తీస్తుంది. ఇదిలా ఉండగా.. రక్షణ శాఖకు చెందిన 2.6 లక్షల మంది వ్యక్తిగత వివరాలు సైతం నిందితులు చౌర్యం చేసిన నేపథ్యంలో.. ఆర్మీ విభాగం, ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా వివరాలను విశ్లేషించేందుకు సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు సైబరాబాద్ పోలీసులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ విభాగాల నుంచి కాకుండా థర్డ్ పార్టీ ఏజెన్సీల నుంచే ఈ సమాచారం బహిర్గతమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

టెక్నాలజీ నిపుణుల సహాయంతో...

సైబరాబాద్ డీసీపీ కల్మేశ్వర్ శింగేన్వర్ నేతృత్వంలో 9 మంది పోలీసులతో ఏర్పాటైన సిట్.. ఈ కేసును 360 డిగ్రీల కోణంలో దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు పూర్తిగా సాంకేతిక అంశంపైనే ఆధారపడి ఉండటంతో సైబరాబాద్ పోలీసులు పలు టెక్నాలజీ నిపుణుల సహాయాన్ని తీసుకుంటున్నారు. తస్కరించిన డేటాను నిందితులు జస్ట్ డయల్‌లో డేటా ప్రొవైడర్ల పేర్లతో రూ.2 వేలకు 50 వేల మంది ప్రజల సమాచారాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. దీంతో తొలి దశలో జస్ట్ డయల్, గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్ కంపెనీలతో పాటు బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులను విచారించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో త్వరలోనే ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేయనున్నామని ఓ పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ కేసు గొలుసు కట్టు మార్కెటింగ్ తరహాలో ఉండటంతో అనేక మందికి ఈ కేసుతో సంబంధాలుండే అవకాశం ఉందని, త్వరలోనే మరికొందరిని అరెస్టు చేస్తామని తెలిపారు.

పంట.. మారుతోందంట!

ఈ ఏడాదంతా చిరుధాన్యాల కార్యకలాపాలు

- మిల్లెట్ల సాగు, వినియోగం పెంచడమే ప్రధాన లక్ష్యం
- శ్రీకాకుళం జిల్లాలో 2500 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు


జనవరి 26న రిపబ్లిక్‌డే రోజున మిల్లెట్స్‌తో తయారుచేసిన ముగ్గు ప్రదర్శిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాగిజావ మళ్లీ జనాల మెనూలోకి చేరింది. సజ్జ తిరిగి ఇంటి జాడీలో చోటు సంపాదించుకుంది. జొన్న అన్నింటి కంటే మిన్న అన్న గుర్తింపు సంపాదించుకుంది. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రజల ఆహార అలవాట్లు మెల్లగా పాతకాలం పద్ధతుల వైపు మళ్లుతున్నాయి. అందుకు అనుగుణంగా అన్నదాతల సాగు పద్ధతులు కూడా చిరు ధాన్యాల వైపు మళ్లించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకు తగ్గ ప్రోత్సాహం కూడా అందిస్తోంది. జిల్లాలో చిరుధాన్యాలు పండించేందుకు రైతులకు, స్వయం సహాయక సంఘాలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రైతులతో మిల్లెట్ క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

రాయితీపై విత్తనాలు..

ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో 55 క్వింటాళ్లు, 90శాతం సబ్సిడీతో, గిరిజనేతర ప్రాంతాల్లో 500 కిలోల చిరుధాన్యాల విత్తనాలు అందించారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన స్పందనలో ఉచితంగా 500 మందికి రాగిమాల్ట్ అందించారు. ప్రభుత్వం నిర్వహించే సమావేశాల్లో మిల్లెట్స్‌తో తయారుచేసిన బిస్కెట్లనే పంపిణీ చేస్తున్నారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరు ఈ రకమైన బిస్కెట్లు రెగ్యులర్ తినుబండారాలుగా అలవాటు చేసుకునేలా చూడాలని ప్రజలకు సూచిస్తున్నారు.

దిగుబడి పెంచేలా ప్రణాళిక

తృణధాన్యాల ఉత్పత్తి పెంచడానికి జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద 12 క్లస్టర్లలో చర్యలు చేపట్టి పండించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. క్లస్టర్ ప్రదర్శనలతోపాటు పంటల విధానంపై అవగాహన కల్పించడం, అధిక దిగుబడి ఇచ్చే హైబ్రీడ్ విత్తనాల పంపిణీ, వ్యవసాయ యంత్రాలు, ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. అవగాహన పెంపొందిస్తూ రైతులతో జిల్లాలవారీగా మిలెట్ క్లస్టర్లు, వర్చువల్ విధానంలో క్లాసులు నిర్వహించాలని నిర్ణయించింది.

సాగుకు ప్రోత్సాహం

జిల్లాలో 12 క్లస్టర్లలో 2500 ఎకరాల్లో చిరుధాన్యాలు పండించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో హెక్టార్‌కి దిగుబడి 1500 కిలోలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాదంతా అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో ఆరోగ్యం, పోషక విలువలతో కూడిన చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేలా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా గార మండలంలో 2000 ఎకరాలు, జి.సిగడాం, కొత్తూరు, నందిగాం, కవిటి క్లస్టర్లలో 500 ఎకరాలకు పైగా పండించేందుకు స్వయం సహాయక సంఘాలు, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నారు. 12 క్లస్టర్లకు 40 శాతం సబ్సిడీతో ప్రాసెసింగ్ యూనిట్లు ఇచ్చేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. పండించిన చిరుధాన్యాలను మార్కెటింగ్ చేసుకునేలా నేచురల్ బాస్కెట్, శ్రేష్ట, బిగ్–బాస్కెట్, ఎన్‌జీఓలు ద్వారా సదుపాయాలు మెరుగుపరుస్తున్నారు. ప్రభుత్వం కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసే యోచన చేస్తోంది.


రాగి పంటల పొలంలో అవగాహన కార్యక్రమంలో రైతులు, జిల్లా వ్యవసాయాధికారి

సాగు పెంచడమే లక్ష్యం



జిల్లావ్యాప్తంగా వరి, అపరాలతో పాటు రాగులు, జొన్నలు, సజ్జలు, తృణధాన్యాలు పండించేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు రైతులకు అందిస్తున్నాం. క్లస్టర్లు ఏర్పాటు చేశాం. వాటి ద్వారా సాగుయంత్రాలు, విత్తనాలు రాయితీపై అందిస్తున్నాం. జిల్లాలో చిరుధాన్యాలు పండించేందుకు ఏ రైతు ముందుకొచ్చినా సహకారం అందిస్తాం. ప్రభుత్వ సమావేశాల్లో మిల్లెట్‌తో తయారుచేసిన బిస్కెట్లనే పంపిణీ చేస్తున్నాం.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

ఊబకాయం వంటివి తగ్గుతాయి

చిరుధాన్యాల్లో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల కొవ్వుని తగ్గించడంతో పాటు సుగర్, బీపీ వంటివి రాకుండా ఉంటాయి. ఊబకాయం ఉన్న వారి బరువు కూడా తగ్గుతుంది. మలబద్ధకం కూడా ఉండదు. రాగిలాంటి చిరుధాన్యాల్లో కాల్షియం వంటివి అధికంగా ఉంటాయి. ఏ వయసు వారికైనా సహజ సిద్ధంగా పండే చిరుధాన్యాలు మేలు చేస్తాయి.

– డాక్టర్ కొర్ల విద్యాసాగర్, జనరల్ ఫిజీషియన్, నెఫ్రాలజిస్ట్, శ్రీకాకుళం

అనారోగ్య శిశువుల ప్రాణాలయం


పచ్చకామెర్లు వచ్చిన శిశువులకు ఫొటోథెరపిలో చికిత్స


శిశువుకు చికిత్స అందిస్తున్న వైద్యురాలు

ప్రాణాపాయ స్థితిలో ఉన్న శిశువులకు అక్కడ ఊపిరి పోస్తున్నారు. ఇలా చికిత్స పొందుతున్న శిశువుల సంఖ్య నెలకు కనీసం 600 వరకు ఉంటుంది. అదే నవజాత శిశువుల విభాగం (ఎస్ఎన్‌సీయూ).

- ప్రాణాపాయ స్థితిలో శిశువులకు ఊపిరి పోస్తున్న ఎస్ఎన్‌సీయూ
- నెల రోజులలోపు పిల్లలకు ఎస్ఎన్‌సీయూలో చికిత్స
- నెలకు 600 నుంచి 700 మంది శిశువులకు చికిత్స

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని ఘోషాస్పత్రిలో ఉన్న నవజాత శిశువుల విభాగానికి (ఎస్ఎన్‌సీయూ) వచ్చే వారంతా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారే. బాహ్య ప్రపంచం చూడకుండానే అనారోగ్యానికి గురైన నవజాత శిశువులు అక్కడ చికిత్స కోసం వస్తారు. తక్కువ బరువుతో పుట్టిన వారు, నెలలు నిండకుండానే పుట్టినవారు, పుట్టిన తరువాత శ్వాస అందని వారు, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్స్‌కు గురైన వారు ఇక్కడ చికిత్స కోసం చేరుతారు. ఇలా ప్రాణాపాయ స్థితిలో చేరిన వారందరిని పూర్తి ఆరోగ్యవంతులుగా చేసి ఇంటికి పంపిస్తున్నారు. అదే నవజాతి శిశువుల విభాగం. అనారోగ్య శిశువులను ఆరోగ్యవంతుగా చేసే చికిత్సాలయంగా పేరుగాంచింది. పట్టణంలోని ఘోషాస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ విభాగం ఉంది. దీనికి 20 పడకలు కేటాయించారు. ఘోషాస్పత్రిలో పుట్టిన శిశువులతో పాటు సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రుల నుంచి కూడా మెరుగైన చికిత్స కోసం ఇక్కడకు వస్తారు. ఎంతో ఖరీదైన వైద్యం ఉచితంగా లభిస్తుండడంతో అధిక సంఖ్యలో రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందే రోగులకు అక్కడ వైద్య సిబ్బంది కూడా ప్రేమతో వైద్య సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.


వార్మర్‌లో చికిత్స పొందుతున్న శిశువులు

అన్ని పరికరాలు అందుబాటులో..

నవజాత శిశువుల విభాగంలో శిశువులకు వైద్యం అందించడానికి అవసరమైన పరికరాలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. ఫొటోథెరిపి, వెంటిలేటర్, సీపీఆఫ్, వార్మర్లు, పల్స్ ఆక్సీమీటర్లు అందుబాటులో ఉన్నాయి. ఫొటో థెరిపి పరికరంలో పచ్చ కామెర్లు ఉన్న వారికి వైద్యం అందిస్తారు. వార్మర్స్‌లో శిశువులకు వెచ్చదనం కోసం ఉపయోగిస్తారు. పల్స్ ఆక్సీమీటర్ శిశువుల పల్స్ ఎంతో ఉందో చూస్తారు. సీపీఆఫ్ మిషను ద్వారా ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉన్న వారికి చికిత్స అందిస్తారు. వెంటిలేటర్ ద్వారా ఊపిరి తీసుకోలేని వారికి చికిత్స అందిస్తారు.

తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు ఎక్కువ

ఎస్ఎన్‌సీయూలో బరువు తక్కువతో పుట్టిన పిల్లలకు ఎక్కువగా చికిత్స కోసం చేరుతున్నారు. ఇక్కడ బరువు తక్కువగా ఉన్న శిశువులు 40 శాతం మంది, నెలలు నిండకుండా పుట్టిన శిశువులు 35 శాతం మంది, 25 శాతం మంది ఇన్‌ఫెక్షన్స్, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడిన వారు చేరుతున్నారు. ఇన్‌పేషెంట్లుగా నెలకు 300 మంది వరకు, ఔట్ పేషెంట్ సేవలు 400 మంది వరకు పొందుతున్నారు.

శిశువులు అనారోగ్యానికి కారణాలు..

- గర్భిణుల్లో రక్తహీనత
- బాల్య వివాహాలు
- వివిధ రకాల ఇన్‌ఫెక్షన్స్
- నెలలు నిండకుండా పుట్టడం తదితర కారణాలు వల్ల శిశువులు అనారోగ్యానికి గురవ్వడం. బరువు తక్కువగా పుడుతున్నారు.

ఆరోగ్యకరమైన శిశువుల కోసం..

- మంచి పౌష్టికాహారం తీసుకోవాలి.
- రక్తహీనత లేకుండా చేసుకోవాలి.
- కిషోర బాలిక దశ నుంచి రక్తహీనత లేకుండా చూసుకోవాలి.
- తల్లులు బరువు తక్కువ లేకుండా చూసుకోవాలి.
- బాల్య వివాహాలు చేసుకోకూడదు.
- మూత్ర ఇన్‌ఫెక్షన్స్‌కు సరైన చికిత్స చేయించుకోవాలి.
- సకాలంలో వైద్య తనిఖీలు చేయించుకోవాలి.
- టీకాలు క్రమం తప్పకుండా వేసుకోవాలి.

85 శాతం రికవరీ



తీవ్ర అనారోగ్యం, ప్రాణాపాయ స్థితిలో ఉన్న శిశువులు ఇక్కడ చికిత్స కోసం చేరుతారు. వారందరికి మెరుగైన వైద్య సేవలు అందించి పూర్తి ఆరోగ్యవంతులైన తర్వాత ఇంటికి పంపిస్తాం. డిశ్చార్జ్ అయిన తర్వాత ఏడాది వరకు వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తూ సేవలు అందిస్తున్నాం. 85 శాతం రికవరీ రేటు ఉంది.

– డాక్టర్ శాంతి, ఎస్ఎన్‌సీయూ, వైద్యాధికారి



నీ గురించి నువ్వు తెలుసుకోవడమే
మొత్తం వివేకానికి ఆరంభం.
– అరిస్టాటిల్

సాక్షి

సోమవారం, మార్చి, 27

పారిస్ పవనాలు

తెలుగువాళ్లు ఉగాది జరుపుకోవడానికి సరిగ్గా ఒక్కరోజు ముందు ప్రపంచ సాహిత్యానికి 'వసంతం' వచ్చింది. సాహిత్య రంగంలో అత్యంత విశిష్టమైన మ్యాగజైన్‌గా పేరున్న 'ద పారిస్ రివ్యూ' తన 70వ వార్షికోత్సవ 'స్ప్రింగ్' సంచికను ఈ వారంలోనే విడుదల చేసింది. అన్ని సంచికలనూ క్రమసంఖ్యతో వెలువరించే సంప్రదాయం ఉన్నందున పత్రిక పరంపరలో ఇది 243వ ఇష్యూ. 2018లో మ్యాన్ బుకర్ గెలుచుకుని, అదే ఏడాది నోబెల్ పురస్కారం పొందిన పోలండ్ రచయిత్రి ఓల్గా తొకార్చుక్ ఇంటర్వ్యూ ఈ సంచిక విశేషాల్లో ఒకటి. కవిత్వం, వచనం, కళలకు అత్యంత ప్రాధాన్యముండే ఈ పత్రికలో రచయితల అంతరంగాలను లోలోతుల నుంచి అత్యంత సూక్ష్మంగా, విశదంగా స్పృశించడం మొదటినుంచీ ఒక ప్రత్యేకతగా నిలిచిపోయింది. నేపథ్యం, రాసే విధానం, విచారధారతో పాటు సాహిత్య సృజనను ప్రయోగ శాలలో పరిశీలించినంత లోతుగా జరిపే కాలాతీత సంభాషణలు ఇవి.

'ఒక రాత్రి ఓ స్నేహితుడు నాకు ఫ్రాంజ్ కాఫ్కా కథల పుస్తకం అరువిచ్చాడు. నేనుంటున్న లాడ్జికి తిరిగివెళ్లి 'ద మెటమార్ఫసిస్' చదవడం మొదలుపెట్టాను. ఆ మొదటివాక్యమే నన్ను దాదాపు మంచంలోంచి కిందపడేసినంత పని చేసింది. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆ మొదటి వాక్యం ఇలా ఉంది: ''ఒక ఉదయం కలత నిదురతో మేల్కొన్న గ్రెగర్ జాంజా, మంచంలో తానొక పెద్ద పురుగుగా మారిపోయి ఉండటం గుర్తించాడు...'' ఆ వాక్యం చదవగానే, ఎవరైనా ఇలాంటి విషయాలు కూడా రాయవచ్చని నాకు ఇంతకుముందు తెలీదే అని నాకు అనిపించింది. తెలిసివుంటే, నేను ఎప్పుడో రాయడం మొదలుపెట్టేవాడిని. వెంటనే నేను కథలు రాయడం మొదలుపెట్టాను' అని తన సాహిత్య ప్రస్థానం గురించి చెబుతారు గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్. 'ఫిక్షన్ నా జర్నలిజానికి సాహిత్య విలువను ఇచ్చింది. జర్నలిజం నా ఫిక్షన్‌ను వాస్తవానికి దగ్గరగా ఉండేట్టు చేసింది' అంటారు ఈ పాత్రికేయ రచయిత. 'నేను ఏ భాషలోనూ ఆలోచించను. నేను దృశ్యాల్లో ఆలోచిస్తాను. అసలు ఎవరికైనా ఆలోచించేటప్పుడు భాషతో పని ఉంటుందనుకోను' అని చెబుతారు తన మాతృభాష రష్యన్‌కు దూరమైన వ్లాదిమీర్ నబకోవ్. 'అచ్చులోకొచ్చిన నా ప్రతీ పదమూ అనేకమార్లు తిరగరాయబడిందే. నా ఎరేజర్లతో పోలిస్తే నా పెన్సిళ్ల జీవితకాలమే ఎక్కువ' అంటారు ఈ పర్ఫెక్షనిస్టు. 'నేను ఎవరికీ ప్రాతినిధ్యం వహించటం లేదు' అని నిర్మొహమాటంగా చెప్పే భారత మూలాలున్న ట్రినిడాడ్–బ్రిటిష్ రచయిత వి.ఎస్.నైపాల్, 'మనిషి అనునిత్యం నైతిక తీర్పుల బరువు మోయనక్కర్లేని ప్రపంచాన్ని కోరుకున్నాను' అంటారు. ఎర్నెస్ట్ హెమింగ్వే, జేమ్స్ థర్బర్, రే బ్రాడ్బరీ, స్టీఫెన్ కింగ్, రేమండ్ కార్వర్, మాయా ఏంజెలో, లిడియా డేవిస్ లాంటి వందలాది మేటి రచయితల ఇంటర్వ్యూలను 'ది ఆర్ట్ ఆఫ్ ఫిక్షన్' విభాగంలో ప్రచురించింది పారిస్ రివ్యూ. జార్జ్ లూయీ బోర్హెస్, హారుకీ మురకామి, మిలన్ కుందేరా, సైమన్ దె బువా, ఒర్హాన్ పాముక్, సల్మాన్ రష్దీ, చినువా అచెబే లాంటి భిన్న మూలాలున్న రచయితలు ఇందులో ఉన్నారు. 'ది ఆర్ట్ ఆఫ్ పొయెట్రీ'గా రాబర్ట్ ఫ్రాస్ట్, టీఎస్ ఎలియట్, అక్టావియో పాజ్, పాబ్లో నెరూడా, ఎజ్రా పౌండ్ లాంటి కవుల సంభాషణలను నమోదు చేసింది. ఇవన్నీ 'ద రైటర్స్ ఎట్ వర్క్' పుస్తకాల సిరీస్‌గా వచ్చాయి. ప్రపంచ చరిత్రలో పట్టువిడవకుండా ఒంటిచేత్తో నెరిపిన సాంస్కృతిక సంభాషణగా దీన్ని అభివర్ణించారు సాహిత్య విమర్శకుడు జో డేవిడ్ బెలామీ.

ఈ త్రైమాసిక ఆంగ్లభాష పత్రిక ఫ్రాన్స్ రాజధాని నగరం పారిస్‌లో 1953లో ప్రారంభమైంది. 1973లో అమెరికాలోని న్యూయార్క్ నగరానికి తన కార్యస్థానాన్ని మార్చుకుంది. పత్రికను స్థాపించిన నాటి నుంచీ 2003లో మరణించేదాకా– యాభై ఏళ్లపాటు అమెరికా రచయిత జార్జ్ ప్లింప్టన్ దీనికి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. ఆయన ముద్ర ఎంతటిదంటే, ఈయన తర్వాత ఆ స్థానంలోకి వచ్చిన బ్రిజిడ్ హ్యూస్... ప్లింప్టన్ గౌరవార్థం 'సంపాదకురాలు' అనిపించుకోవడానికి నిరాకరించారు. ప్రస్తుతం ఎమిలీ స్టోక్స్ సంపాదకురాలిగా ఉన్నారు. పత్రిక చరిత్రలో ఈమె ఆరో ఎడిటర్.

ఫిలిప్ రాత్, ఇటాలో కాల్వీనో, శామ్యూల్ బెకెట్, డేవిడ్ ఫాస్టర్ వాలెస్ లాంటి మహామహుల రచనలు పారిస్ రివ్యూలో చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం 24,000 ప్రింట్ కాపీల సర్క్యులేషన్, నెలకు సుమారు 12 లక్షల ఆన్‌లైన్ వ్యూస్ ఇది కలిగివుంది. ఈ ఏడు దశాబ్దాల్లో ఎన్నో సాహిత్య పత్రికలు మూతపడ్డాయి. 'ఎన్ని పోయినా మనకు 'పారిస్' మాత్రం ఉంటుంది' అంటారు రచయిత వుహాన్ విడాల్. 'పారిస్ రివ్యూ చచ్చేంత బోర్ కొడుతోందని ఎప్పటికీ అనలేం' అంటారు పబ్లిషర్ జెస్సా క్రిస్పిన్. ఉత్తమ సాహిత్యానికి పెద్దపీట వేయడంతో పాటు, ఆర్కైవు మొత్తాన్నీ అందుబాటులో ఉంచడం, అందులోని క్లాసిక్స్‌ను నవతరపు రచయితల వ్యాఖ్యానంతో పునఃప్రచురించడం లాంటివి కొత్త పాఠకులను పాత సాహిత్యంతో పరిచయం చేసుకునేలా ఉపకరిస్తున్నాయి. 2012 నుంచీ మొబైల్ యాప్ ప్రారంభించింది. 2017లో పాడ్‌కాస్ట్ మొదలుపెట్టింది. సమకాలీన రచయితల రచనలను తమ గొంతుల్లోనే వినిపించడం కూడా మొదలుపెట్టింది. ఎలా రాయాలో శిక్షణ ఇచ్చే రోక్సానే గే తన 'మాస్టర్ క్లాస్'లో వర్తమాన రచయితలకు ఇచ్చే ఒక ముఖ్యమైన సలహా: పారిస్ రివ్యూ ఇంటర్వ్యూలను లోతుగా చదవడం! సాహిత్యం రెండో ఆలోచనగా మాత్రమే ఉండే ప్రపంచంలో దాన్ని ఉత్సాహభరితం చేస్తూ, ప్రధాన స్రవంతికి తేగలిగింది 'ద పారిస్ రివ్యూ'!

విమర్శ ప్రాధాన్యం మరిచారా?

కామెంట్



కరణ్ థాపర్

కొన్నేళ్ల క్రితం నరేంద్ర మోదీ ''ప్రభుత్వాలపై, వాటి పనితీరుపై వీలైనంత కఠినాతికఠినమైన విశ్లేషణ, విమర్శ చేయాలన్నది నా బలమైన విశ్వాసం. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం నడవదు'' అన్నారు. మీడియా విమర్శనాత్మకంగా ఉండకపోతే ప్రభుత్వంలో భయం పోయి దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. చాలామంది బలమైన విమర్శను ఆహ్వానిస్తారు, కానీ ప్రభుత్వాన్ని భయంలో ఉంచాలని ఎవరూ చెప్పలేదు. కొంతమంది మంత్రులు మోదీ మాటల్ని మర్చిపోయారు. విమర్శకులను జాతి వ్యతిరేకులు అని నిందిస్తే, ఆ ప్రతిస్పందన విమర్శ కంటే ఎక్కువ ప్రభావాన్ని ప్రేరేపిస్తుంది.

సాక్షాత్తూ తన ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఉన్న ప్రాధాన్యం గురించి ప్రధానమంత్రే చెప్పిన మాటలు ఎంతమందికి గుర్తున్నాయో నాకు తెలీదు. ఆయన ప్రకటనలోని విషయం మాత్రమే కాదు, ఆయన జాగ్రత్తగా వాడిన పదాలు కూడా. ఆ ప్రసంగ వీడియోలోని క్లిప్‌ను ప్రదర్శించినట్లయితే, ప్రధాని ప్రసంగంలోని ధాటిని కూడా మీరు గమనిస్తారు. ఆ మూడింటినీ కలిపిచూస్తే, ఆయన చెప్పిన మాటల్ని సరిగ్గా అలాగే ఉద్దేశించారని మనల్ని స్పష్టంగా నమ్మమని అన్నట్లుగా ఉంటాయి.

ప్రధాని పదవిని చేపట్టిన రెండేళ్ల తర్వాత, అంటే 2016 సెప్టెంబర్‌లో 'నెట్‌వర్క్ 18' ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ అన్నారు: ''ప్రభుత్వాలపై, వాటి పనితీరుపై వీలైనంత కఠినాతికఠినమైన విశ్లేషణ, విమర్శ చేయాలన్నది నా బలమైన విశ్వాసం. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం నడవదు.''

భయం ఉండాల్సిన అవసరం

మొదటగా ఆ పదాల ఎంపికను గమనించండి. 'కఠినాతికఠినమైన' విశ్లేషణ, విమర్శ. మృదువైన, సూక్ష్మ కాదు. పరుషంగా, దాపరికం లేకుండా, శక్తిమంతంగా! రెండవది, ప్రభుత్వ పనిని మాత్రమే కాదు, ప్రభుత్వాన్నే విమర్శించి, విశ్లేషించాలి. మోదీ వీటిని ప్రత్యేక అంశాలుగా పేర్కొన్నారు. ఇది ఉద్దేశపూర్వక విభజన.

మోదీ మరింత ముందుకెళ్లారు. అంతే సమానమైన, శక్తిమంతమైన పదాలతో ఒకవేళ ప్రభుత్వాన్ని విమర్శించడంలో మీడియా విఫలమైతే రాదగిన నిర్దేశిత ఫలితమేమిటో చెప్పారు. ''ప్రభుత్వంలో తేవాల్సిన మెరుగుదల, ప్రభుత్వంలో ఉండి తీరాల్సిన భయం లేకుండాపోతాయి. ఒకవేళ ఆ భయం ప్రభుత్వంలో అదృశ్యమైతే, దేశం ఘోరంగా దెబ్బతింటుంది. అందువల్లే మీడియా అత్యంత విమర్శనాత్మకంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను''.

అంటే, ప్రభుత్వాన్ని భయపడుతున్న స్థితిలోనే ఉంచాలని ప్రధాని కోరుకుంటున్నారు. ఆయన 'భయం' అనేమాటను అనుకోకుండా ఉపయోగించలేదు. చెప్పాలంటే, ఆ పదాన్ని ఆయన మూడుసార్లు వాడారు. ప్రభుత్వం భయపడటం మానేస్తే ఏం



జరుగుతుందో గమనించండి– దేశానికి తీవ్ర నష్టం!

జాతి వ్యతిరేకులా?

ఇతర ప్రజాస్వామిక నేతలు విమర్శ అవసరం గురించి ఈ స్థాయిలో చెప్పి ఉంటారా అని నేను గుర్తు చేసుకోలేకపోతున్నాను. చాలామంది బలమైన విమర్శను ఆహ్వానిస్తారు, కానీ ప్రభుత్వాన్ని భయంలో ఉంచాలని ఎవరూ చెప్పలేదు. పైగా మోదీ ప్రభుత్వాలను అని బహువచనంలో మాట్లాడలేదు. ప్రత్యేకించి తన సొంత ప్రభుత్వం గురించే మాట్లాడారు.

ఇప్పుడు నేను దీన్ని ఎందుకు పునరుల్లేఖించాను? మామూలు కారణం ఏమిటంటే, కొంతమంది మంత్రులు దాన్ని మర్చిపోయారు లేదా ఉద్దేశపూర్వకంగా విస్మరించేశారు. అందుకు నేను అనేక ఉదాహరణలు ఇవ్వగలను. కానీ రెండింటికి మాత్రమే పరిమితమవుతాను.

కొంతమంది రిటైరైన న్యాయమూర్తులు 'భారత వ్యతిరేక గ్యాంగ్'లో భాగమయ్యారని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఎందుకంటే ఈ న్యాయమూర్తులు పాల్గొన్న ఒక సెమినార్‌లో– మోదీ ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తుల గురించిన విశ్లేషణను ప్రొఫెసర్ మోహన్ గోపాల్ సమర్పిస్తూ, వారిలో 15 శాతంమంది మతరాజ్య వ్యవస్థకు తప్ప రాజ్యాంగబద్ధ న్యాయమూర్తులుగా లేరని పేర్కొన్నారు. మోదీ ప్రకటన సరిగ్గా ఇదే మాట్లాడుతోందని న్యాయమంత్రి గుర్తించడం లేదా? అయినప్పటికీ ఆయన దాన్ని 'భారత వ్యతిరేకం' అన్నారు. న్యాయమూర్తులు దీనికి 'తగిన మూల్యం' చెల్లిస్తారని హెచ్చరించారు కూడా!

చతురత లేకపోతే...

నా రెండో ఉదాహరణ – ఉప రాష్ట్రపతికి సంబంధించినది. ఆయన మోదీ ప్రభుత్వంలో సభ్యుడు కాదు. ఆయన స్థానం ఆయన్ని మించినది. కానీ 'మేధావర్గం, మీడియా జనాల' గురించి ఆయన మాట్లాడుతూ, ''మన వృద్ధి వేగాన్ని తగ్గించి చూపడానికి భారత వ్యతిరేక శక్తులు హానికరమైన కథనాలను అల్లుతున్నాయి. మన క్రియాత్మక ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగబద్ధ సంస్థలకు కళంకం తెస్తున్నాయి'' అని వ్యాఖ్యానించారు. మోదీ ఇంటర్వ్యూలోని విషయాలు తనకు కూడా వర్తిస్తాయని ఆయన మరిచిపోయినట్లు ఉన్నారు.

''మన వృద్ధి వేగాన్ని తగ్గించాలని చూస్తున్నవారు'' మన స్థూలదేశీయోత్పత్తి యథార్థతను ప్రశ్నిస్తున్నారు. ''మన క్రియాత్మక ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగబద్ధ సంస్థలను'' కళంకపరుస్తున్నవారు పార్లమెంటు, ఎన్నికల కమిషన్, మన భద్రతా సంస్థల పనితీరును ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి విమర్శను కేవలం స్వాగతించడం కాదు, ఇది అవసరమే అని మోదీ చెప్పారు.

ప్రభుత్వ విమర్శలకు జవాబు ఇవ్వాల్సిన కేంద్ర మంత్రులూ, బీజేపీ అధికార ప్రతినిధులూ ప్రధానమంత్రి వివేకవంతమైన మాటలను కంఠతా పట్టాల్సి ఉంది. నన్ను మరో అంశాన్ని కూడా చేర్చనివ్వండి. విమర్శను ఎదుర్కొన్నప్పుడు చిరునవ్వుతో వినాలి, హుందాగా స్పందించాలి. అప్పుడు ఆ విమర్శ వెంటనే వీగిపోతుంది. అలా కాకుండా విమర్శతో ఘర్షించడం, ఇంకా ఘోరంగా విమర్శకులను జాతి వ్యతిరేకులు అని నిందించడం చేస్తే, ఆ ప్రతిస్పందన విమర్శ కంటే ఎక్కువ ప్రభావాన్ని ప్రేరేపిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, చతురతతో వ్యవహరించు, రాజకీయం చేయవద్దు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే గొప్పా?



మన విలువను కేవలం ఇన్‌స్టా ఫాలోయర్ల సంఖ్యతో కొలిచేచోట మనం పని చేయలేం. ఆ కారణంగానే నేను ఒక కాంట్రాక్టును వదులుకున్నాను. – నందితా బోస్, రచయిత్రి

ముందే తెలుసు!



పనికొచ్చే మా ఆరో క్లాసు అబ్బాయి సాహిత్య విమర్శ: "పుస్తకం కవర్ మీద కుక్క బొమ్మ ఉండి, దానికి అవార్డు వచ్చిందంటే, ఇక నేను దాన్ని చదవను. ఎందుకంటే కచ్చితంగా కుక్క చనిపోతుంది."

– రెబెక్కా మక్కాయి, స్టూడియో ఆర్ట్ డైరెక్టర్

మీరెంత అనడమే!



కాంగ్రెస్‌ను విమర్శించేవాళ్లు ఒక్కసారి వెనక్కి తగ్గి, మొత్తంగా పరిస్థితి ఏమిటో అవగతం చేసుకోవాలి. రాహుల్ గాంధీకి జరుగుతున్నదాని ఉద్దేశం, హయాంను విమర్శించే ప్రతి ఒక్కరికీ బలమైన సంకేతం పంపడం! "రాహుల్ గాంధీ లాంటివాడికే మేము ఇది చేయగలిగినప్పుడు, మీ గతి ఏమిటి?"

– మీనా కందసామి, రచయిత్రి

ఇంకెవరూ దొరకలేదా?



ఘనమైన చరిత గలిగిన నలంద విశ్వవిద్యాలయం లాంటిదాని పునరుద్ధరణను దర్శనాల పట్ల ఏ శ్రద్ధాసక్తులూ లేని అమర్త్య సేన్ లాంటివాడికి అప్పగించడం నిరాశాపూరితం, స్వీయ విధ్వంసకరం. ఆయనొక రహస్య కమ్యూనిస్టుకు తక్కువ కాదు.

– జోసెఫ్ టి. నూనీ, చరిత్రాంశాల వ్యాఖ్యాత

నాణ్యత కొరత



సివిల్ సర్వెంట్ల నాణ్యతలో క్రమ పతనం ఉంటోందని దీర్ఘానుభవం గల కొందరు రాజకీయ నాయకులు వ్యాఖ్యానిస్తారు. ఎందుకిలా? చాలావరకు ఇప్పటి బ్యూరోక్రాట్లు లిబరల్ సైన్సుల విద్యార్థులు కాకుండా కోచింగ్ క్లాసులు, భట్టీయం చదువుల ఉత్పత్తి కావడం వల్లనా?

– ధవళ్ కులకర్ణి, రచయిత

కొడుకు కోసమా?



మార్క్ జుకర్‌బర్గ్, ఆయన భార్యకు ముగ్గురు పిల్లలెందుకు? వెయ్యి మంది పిల్లల్ని పెంచడానికి కావాల్సిన డబ్బయినా వాళ్ల దగ్గరుంది సరే. కానీ ఇది డబ్బు సంగతి కాదు. ఇద్దరు కూతుళ్లకు జన్మనిచ్చిన తర్వాత కూడా వాళ్లు సంతోషంగా లేరా? ఒకవేళ ప్రిస్కిల్లా చాన్ ఆసియా మనస్తత్వమే రహస్యంగా ఒక కొడుకును కోరుకుందా?

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

నిర్వచనాలు వద్దు



నేనొక మహిళను. దయచేసి ఎప్పుడూ నా గురించి గర్భం ఉన్న వ్యక్తి, జన్మనిచ్చే మనిషి, రుతుస్రావం ఉన్న మనిషి అని సూచించకండి. ఇది ఒక మనిషిని ఎంత హీనపరచడమో జనానికి ఎందుకు తెలియట్లేదు? ఈ చెత్త వ్యాఖ్యానాలతో నిమిత్తం లేకుండా కూడా మీరు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి మద్దతు ఇవ్వొచ్చు.

– అనా కస్పరియన్, టీవీ హోస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

జాగ్రత్త పడకపోతే నరకమే!

పదివేల సంవత్సరాల ప్రయాణం తర్వాత, మానవ నాగరికతపై వాతావరణం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాబోయే కొన్నేళ్లలో మనం చేసే పనులు వేల ఏళ్ల మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. వాతావరణ మార్పులపై 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్' తాజా నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. 'అందరికీ జీవించగలిగే, స్థిరమైన భవిష్యత్తును భద్రపరచడానికి ఉన్న అవకాశం త్వరగా ముగిసిపోబోతున్నది' అని ఆ నివేదిక అంటోంది.

ఇంకా ఆ నివేదిక ఏమని హెచ్చరిస్తున్నదంటే... 2030 నాటికి తీసుకునే చర్యలూ, చేసుకునే ఎంపికలూ వేల సంవత్సరాల పాటు ప్రభావం చూపుతాయి. వాతావరణ సంక్షోభం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా జీవితాలనూ, జీవనోపాధినీ దెబ్బతీస్తోంది. 'నిరంతర ఉద్గారాలు అన్ని ప్రధాన వాతావరణ వ్యవస్థ భాగాలనూ మరింత ప్రభావితం చేస్తాయి. గ్లోబల్ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కి పరిమితం చేయాలి. 2022లో ప్రపంచ ఉద్గారాలు మళ్లీ పెరిగి కొత్త రికార్డును నెలకొల్పాయి. కాబట్టి 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పరిమితం చేయాలన్న లక్ష్యం వాస్తవికంగా లేదు. మానవాళిని రక్షించే పనిలో అప్రమత్తత అవసరం. ఏది ఏమైనప్పటికీ, ఎంత వేగంగా ఉద్గారాలను తగ్గించగలిగితే అంతగా బిలియన్ల కొద్దీ ప్రజలకు మేలు కలుగుతుంది.' నిరోధించగలిగిన ప్రతి టన్ను సీఓ2 ఉద్గారాలు వాస్తవ విపత్తు ప్రమాదాన్ని తగ్గిస్తాయి. కొత్త ప్రాజెక్టుల సంగతి పక్కన పెట్టి ... ఇప్పటికే ఆపరేషన్‌లో ఉన్న చమురు, గ్యాస్, బొగ్గు ప్రాజెక్టులను కొనసాగించినా గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పరిమితం చేసే లక్ష్యం దెబ్బతింటుంది.

ఉద్గారాలను తగ్గించడానికి అవసరమైన సాంకేతిక పద్ధతులు, అందుకు అవసరమైన నిధులు లక్ష్య సాధనలో కీలకం. సౌర, పవన శక్తి వంటివాటిని ఎక్కువగా వాడుకోవడం; అడవుల విధ్వంసాన్ని ఆపడం వంటివి ఇప్పటికే మనకు అందుబాటులో ఉన్న కొన్ని చౌకైన, కీలకమైన పరిష్కార మార్గాలు. లక్ష్య సాధనకు డబ్బుల అవసరం ఎక్కువే కానీ నిధులను ఈ దిశలోకి మళ్లించే క్రమంలో ఎదురయ్యే అడ్డంకులను అధిగమించగలగాలి. గ్లోబల్ వార్మింగ్ 2100 నాటికి 3.2 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పెరుగుతుందని అంచనా. ప్రభుత్వాలు విధానాలను బలోపేతం చేయకుండా తాత్సారం చేస్తే... పరిస్థితి నరకప్రాయం అవుతుంది. మూడు దశాబ్దాలుగా ఐపీసీసీ హెచ్చరికలు విస్మరణకు గురయ్యాయి. ఇప్పటికైనా అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్తు అంధకారమే.

– డాక్టర్ ముచ్చుకోట సురేష్ బాబు, ప్రజాసైన్స్ వేదిక

దేశం అలా విడిపోయింది!

సందర్భం



జిల్లా గోవర్ధన్

మన దాయాది దేశం మార్చి 23ను 'పాకిస్తాన్ డే'గా జరుపుకొంది. అయితే ఎందుకు అన్నదే చాలా మందికి తెలియదు.

1937లో యునైటెడ్ ప్రావిన్స్‌కు జరిగిన లెజిస్లేటివ్ ఎన్నికల్లో కాంగ్రెస్, ముస్లింలీగ్ దాదాపు మిత్ర పక్షాల్లాగానే ప్రచారం చేసుకున్నాయి. కాంగ్రెస్ 134 సీట్లు, ముస్లిం లీగ్ 39 సీట్లు కైవసం చేసుకున్నాయి. యునైటెడ్ ప్రావిన్స్‌లో మంత్రివర్గం ఏర్పాటు చేసేటప్పుడు మాత్రం కాంగ్రెస్ నాయకత్వం, ముస్లిం లీగ్ సభ్యులను దూరం పెట్టింది. కనీసం రెండైనా పదవులు కేటాయించవలసిందిగా లీగ్ నాయకులు కోరారు. కాంగ్రెస్ సీనియర్ నేత జవహర్‌లాల్ నెహ్రూ, వారి విన్నపాన్ని పట్టించుకోలేదు. 39 మంది ముస్లిం (లీగ్) సభ్యులు ప్రతిపక్ష బెంచీలకే పరిమితమయ్యారు. దీనితో సహనం కోల్పోయిన ముస్లిం లీగ్ నాయకులు, 'కాంగ్రెస్ బ్రాహ్మణ, బనియా లోగోం కీ హిందూ పార్టీ' (కాంగ్రెస్ బ్రాహ్మణ, బనియా ప్రజల హిందూ పార్టీ) అని దుమ్మెత్తి పోయడం మొదలు పెట్టారు. దీనికి తోడు, ముస్లింలను తమ వైపు మలచుకోవడానికి పండిత్ నెహ్రూ, 'ముస్లిం మాస్ కాంటాక్ట్ ప్రోగ్రాం' చేపట్టి, ముస్లిం యువకులను కాంగ్రెస్ లోకి ఆహ్వానించటం ప్రారంభించారు. ఇది లీగ్ నాయకులకు మింగుడు పడలేదు.

39 కోట్ల దేశ జనాభాలో ముస్లింల సంఖ్య కేవలం 8 కోట్లు మాత్రమే. ఈ నిష్పత్తిలో ముస్లింలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నటికీ అధికారంలోకి రాలేరని ఆలోచించిన లీగ్ నాయకుడు జిన్నా... ప్రతీ పెద్ద నగరంలో సుడిగాలి పర్యటనలు చేసి ముస్లిం చైతన్య సభలు నిర్వహించి, కాంగ్రెస్ హిందూ పక్షపాత పార్టీ అనీ, ముస్లింలు వారి మాటలతో మోసపోవద్దనీ చెప్పారు. వారి 'మసీహా,' ముస్లిం లీగ్ మాత్రమే ననీ ప్రచారం చేశారు.

1930 వరకు బాంబే ప్రావిన్స్‌లో మకుటం లేని కాంగ్రెస్ నాయకుడిగా, హిందూ ముస్లింలకు వారధిగా పేరు గడించాడు మహమ్మద్ అలీ జిన్నా. మతాన్ని రాజకీయాన్ని వేరు వేరు దృక్పథాలతో చూడాలని ఆయన ఆకాలంలో పదే పదే చాటేవాడట. తిలక్‌పై బ్రిటిష్‌వాళ్లు పెట్టిన దేశద్రోహ కేసుపై కోర్టులో ఉచితంగా వాదించారు కూడా. అటువంటి జిన్నా, తర్వాత కాలంలో పూర్తిగా మారిపోయారు.

1937 తర్వాత చెలరేగిన మతపరమైన అల్లర్ల



ప్రభావానికి హిందూ ముస్లిం సౌభ్రాతృత్వం తెగిపోయింది. నవంబరు 1939లో అనుకోని పరిస్థితుల్లో కాంగ్రెస్ మంత్రివర్గం యునైటెడ్ ప్రావిన్స్‌లో రాజీనామా చేసింది. అది తిరిగి బ్రిటిష్ గవర్నర్ పాలనలోకి రావటంతో, ముస్లిం లీగ్ బ్రిటిష్ అధికార యంత్రాంగానికి, అనుకూలంగా నడుచుకుంటూ వారి మన్ననలు పొందింది. 1940 మార్చి 22, 23, 24 తేదీల్లో లాహోర్‌లో ముస్లింలీగ్ సదస్సు జరిగింది. జిన్నా తన అధ్యక్ష ఉపన్యాసంలో, హిందూ డామినేటెడ్ భారత్‌లో ప్రజాస్వామ్య రీతిలో ముస్లింలు అధికారం చేజిక్కించుకోవటం దుర్లభం అనీ, దీనికి పరిష్కారం ముస్లింలకు ప్రత్యేక దేశమే అని తేల్చేశాడు.

మార్చి 23 నాటి సభలో బెంగాల్ ప్రావిన్స్‌కు చెందిన ఫజల్ ఉల్ హక్... ముస్లింల శ్రేయస్సుకు వేరు దేశం కావాలని తీర్మానం ప్రవేశ పెట్టాడు. దాన్ని ముక్త కంఠంతో ఆమోదించింది సభ. ఈ తీర్మానంలో పాకిస్తాన్ పదం ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ మరుసటి రోజు లాహోర్ నుండి వెలువడే ఉర్దూ పత్రిక, 'నవా ఇ వక్త్' ఈ ప్రస్తావనను, 'పాకిస్తాన్ రెజెల్యూషన్' అని ప్రచురించింది. కాంగ్రెస్‌కు చెందిన మౌలానా అబుల్ కలాం ఆజాద్, రఫీ అహ్మద్ కిద్వాయి లాంటి ప్రోగ్రెసివ్ ముస్లిం నాయకులు మతపరంగా దేశవిభజన శ్రేయస్కరం కాదని పదే పదే చెప్పినప్పటికీ, జిన్నా ప్రచారానికే చాలామంది మహమ్మదీయులు ఆకర్షితులయ్యారు.

దేశ విభజన తర్వాత 'టైమ్స్' లండన్ విలేకరి, లూయిస్ హెరెన్ అడిగిన ఒక ప్రశ్నకు, పాకిస్తాన్ గవర్నర్ జనరల్‌గా పగ్గాలు చేపట్టిన రోజుల్లో జిన్నా జవాబిస్తూ... '1937లో యూపీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలీగ్ చేరడానికి ఆయన (నెహ్రూ) అంగీకరించి ఉంటే పాకిస్తాన్ అనేది ఉండేదే కాద'ని అన్నాడని కులదీప్ నయ్యర్ తన 'బియాండ్ ద లైన్స్'లో పేర్కొన్నారు. అగ్ర నాయకుల వ్యక్తిగత పంతాల కారణాలతో దేశ విభజన కావటం నిజంగా శోచనీయం. 1940, మార్చి 23న లాహోర్ సదస్సులో 'పాకిస్తాన్ రిజల్యూషన్' ఆమోదం పొందినందున పాక్ ప్రభుత్వం ఈ రోజును 'పాకిస్తాన్ డే'గా ప్రతి ఏటా పాటిస్తోంది.

(కులదీప్ నయ్యర్ 'బియాండ్ ద లైన్స్', వెంకట్ ధూళిపాళ 'క్రియేటింగ్ ఎ న్యూ మదీనా' ఆధారంగా)

వ్యాసకర్త విశ్రాంత ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ | 98190 96949

మాతృత్వానికి ప్రతిరూపం

జిల్లెళ్లమూడి అమ్మ ఉత్తుంగ తరంగిత ప్రేమ మూర్తి, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటిన మహనీయురాలు. సర్వమత సమానత్వాన్ని చాటిన పుణ్యమూర్తి. అప్పటి గుంటూరు జిల్లా పొన్నూరు తాలూకా మన్నవ గ్రామంలో 1923 మార్చి 28వ తేదీన ఆమె ఈ లోకానికి వచ్చారు. అనసూయ అనే పేరును సార్థకం చేసుకుంటూ అన్నార్తులను ఆదరించే అన్నపూర్ణగా మారారు. 1936 మే 5వ తేదీన గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన బ్రహ్మాండం నాగేశ్వరరావుతో వివాహమైంది. ఆమెకు కులమతాలు, ధనిక పేద తారతమ్యం లాంటివి లేవు. అందుకే ఆమె నివాసం అందరి ఇల్లయ్యింది. జిల్లెళ్లమూడి ఆమె నివాసమై పవిత్ర క్షేత్రమైంది.



ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఎందరో మహానుభావులు, మహాత్ములు జన్మించారు. వారి వారి అభిరుచులు, భగవంతుని ఆదేశం మేరకు సేవలను అందించారు. అటువంటి వారిలో అమ్మ ఒకరు. అమ్మ మార్గం భిన్నమైనది. ఆమెలో ఎన్నో విశిష్టతలు కనిపిస్తాయి. 'నీ బిడ్డను నువ్వు ఎలా ప్రేమిస్తావో అందరినీ అలాగే ప్రేమించు. ఆకలితో ఉన్నవారికి పిడికెడు అన్నం పెట్టు' అని ఆమె బోధించారు. ఇంతకు మించిన మానవతా సూత్రం ఏముంటుంది?

ఆమె పుట్టింది సనాతన హిందూ సంప్రదాయ కుటుంబంలో అయినప్పటికీ అన్ని మతాలనూ సమానంగా చూశారు. అమ్మ భక్తులకు సర్వస్వరూపిణి. ఎవరి ఇష్టదైవ రూపాన్ని వారు ఆమెలో చూసుకుంటారు. తన ఐదవ ఏట ఆమె తల్లి గతించారు. తొమ్మిదో ఏట ప్రఖ్యాత పండితులు, పరివ్రాజకులు వాసుదేవాచార్యుల దర్శన భాగ్యం కలిగింది ఆమెకు. వారి బోధనలు ఆమెను ప్రభావితం చేశాయి. అమ్మ ప్రేమ తత్వం తెలుసుకున్న ఎందరో పండితులు, విద్యావేత్తలు, ఆమె మార్గాన్ని అనుసరించారు. ఆమె విద్యాదాత. అందరికీ చదువు అందాలనే సంకల్పంతో అనేక పాఠశాలలను నిర్మించారు. ఆ విద్యాదానం నేటికీ కొనసాగుతోంది.

ఆమె నిలయంలో నిత్యం అన్న సంతర్పణే. అమ్మ శతజయంతి సందర్భంగా మార్చి 28వ తేదీనుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జిల్లెళ్ళమూడిలో ఐదు రోజులపాటు శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సిద్ధేశ్వరానంద భారతీ స్వామి, రమ్యానంద భారతీ స్వామిని, విశ్వయోగి విశ్వంజీ, సీతారామ గురూజీ, కమలానంద భారతీ స్వామీజీ తదితరులు అమ్మ ప్రేమ తత్వాన్ని వినిపించబోతున్నారు. ఉత్సవాలను బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి ప్రారంభిస్తారు.

– మణిమేఖల

(మార్చి 28న జిల్లెళ్లమూడి అమ్మ శతజయంతి ఉత్సవాలు ప్రారంభం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: శు.షష్ఠి రా.7.37 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: రోహిణి సా.5.37 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ఉ.9.17 నుండి 10.55 వరకు, తిరిగి రా.11.35 నుండి 1.19 వరకు, దుర్ముహూర్తం: ప.12.27 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: ప.2.15 నుండి 3.54 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.02, సూర్యాస్తమయం: 6.07.

క్లుప్తంగా...

భూకంప బుల్లి సూచీలు

- కాకినాడ నిపుణుడి అద్భుత ఆవిష్కరణ



రమేష్‌బాబు తయారు చేసిన భూకంప సూచీ



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ) : కాకినాడ నగరానికి చెందిన సూక్ష్మ కళాఖండాల నిపుణుడు అరిపాక రమేష్‌బాబు కరెంట్ అవసరం లేని భూకంప సూచీని రూపొందించారు. ప్రస్తుతం భూకంపాల ధాటికి కనీవినీ ఎరుగని రీతిలో ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని తాను ఈ భూకంప సూచీని తయారు చేసినట్టు ఆదివారం మీడియాతో చెప్పారు. ఆయన రెండు భూకంప సూచీలను తయారు చేశారు. వీటిలో చిన్నది 0.5 సెం.మీ. నుంచి 3 సెం.మీ. వరకూ ప్రకంపనాలను గుర్తించి, అలారం ద్వారా అప్రమత్తం చేస్తుంది. రెండు సెన్సార్లతో తయారు చేసిన మరో సూచీ.. 3 సెం.మీ. లోపు తీవ్రతతో వచ్చే ప్రకంపనాలను గుర్తించి అప్రమత్తం చేస్తుంది. ఈ రెండింటినీ బ్యాటరీతో పనిచేసేలా రూపొందించినట్టు రమేష్‌బాబు చెప్పారు. వీటిని అపార్ట్‌మెంట్లతో పాటు ఇళ్లల్లోనూ పెట్టుకోవచ్చని, భూ ప్రకంపనలు రాగానే మనల్ని అప్రమత్తం చేస్తాయని వెల్లడించారు.

శ్రీదేవిని ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు



రిలే నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా నాలుగేళ్ల అధికారం అనుభవించినప్పుడు అమరావతి గుర్తుకు రాలేదా అని డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. దళిత జాతి తలదించుకునేలా వ్యవహరించిన ఆమెను ఎమ్మెల్యే పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 910వ రోజుకు చేరాయి. పలువురు ముఖ్య అతిథులు పాల్గొని ప్రసంగించారు. నిజంగా దళితులు, బహుజనులపై ఎమ్మెల్యే శ్రీదేవికి ప్రేమే ఉంటే 910 రోజులుగా బహుజనులు వికేంద్రీకరణ కోసం దీక్షలు చేస్తుంటే ఒక్క రోజైనా పరామర్శించారా అని నిలదీశారు. డబ్బుల కోసం ఆత్మగౌరవం చంపుకొని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి పక్క పార్టీకి ఓటేసి నీతులు వల్లిస్తున్న శ్రీదేవి జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదిస్తానని బెదిరించడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడికి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ పూజలు



సంగమేశ్వరాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న మోహన్ భగవత్

కొత్తపల్లి: నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని సప్తనది సంగమేశ్వరాలయాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం సందర్శించారు. భారీ బందోబస్తు నడుమ ఆయన ఆలయానికి చేరుకున్నారు. పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. సప్తనదుల సంగమ ప్రాంతాన్ని సందర్శించి గంగపూజ, అక్కడ ఉన్న ప్రత్యేక శివలింగానికి పూజలు చేశారు. సంగమేశ్వరాలయం గర్భగుడిలోని వేపదారు శివలింగానికి నదీజలాలతో అభిషేకం, పుష్పాభిషేకం, రుద్రాభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. కాశీవిశ్వనాథ ఆలయానికి ఏర్పాటు చేసిన కారిడార్ మాదిరిగా సంగమేశ్వర కారిడార్ ఏర్పాటు చేయాలని ఆలయ పురోహితులు మోహన్ భగవత్‌ను కోరారు. ఆయన వెంట ఆర్‌ఎస్‌ఎస్ స్టేట్ జోనల్ ఇన్‌చార్జ్ భరత్‌కుమార్, జి.పుల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి, నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణ తదితరులున్నారు.

గిరి సీమల్లో విదేశీ విరులు

నెదర్లాండ్స్, డెన్మార్క్ నుంచి మొక్కల సీడ్

- గంజాయికి ప్రత్యామ్నాయంగా పూలసాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- చింతపల్లి పరిసర ప్రాంతాల్లో సాగు చేస్తున్న గిరిజనులు
- పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో పూల మొక్కల పెంపకంపై శిక్షణ







ఆంధ్రా కాశ్మీర్‌గా పేరొందిన లంబసింగి పరిసర ప్రాంతాల్లో విదేశీ పూల సోయగాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం పరిశోధనలు ఫలించడంతో సంప్రదాయ పంటలు సాగు చేసే గిరిజనులకు పూల సాగుపై ఆసక్తి పెరిగింది. ఫలితంగా గిరి సీమల్లో పూలసాగు విస్తరణకు బాటలు పడ్డాయి. పూల వనాలను అగ్రి టూరిజం స్పాట్స్‌గా తీర్చిదిద్దడంతో గిరిజనులకు రెట్టింపు ఆదాయం వస్తోంది. - సాక్షి, అమరావతి

45 రోజుల్లోనే దిగుబడులు

విదేశాలతోపాటు హిమాచల్ ప్రదేశ్, శ్రీనగర్, బెంగళూరు, పూణే, మదనపల్లి ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి వివిధ రకాల పూల రకాలను రైతులకు అందిస్తున్నారు. రైతు క్షేత్రాల్లో డ్రిప్ ఏర్పాటు చేసి ఎత్తయిన బెడ్లు, మల్చింగ్ విధానంలో సాగు చేయడంతో 45 రోజుల్లోనే దిగుబడులు మొదలవుతున్నాయి.

పర్యాటకుల ద్వారా అదనపు ఆదాయం

పూల వనాలను చూసేందుకు పర్యాటకుల నుంచి వసూలు చేస్తున్న టోకెన్ చార్జీల ద్వారా సీజన్‌లో రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఈ ప్రాంత రైతులు అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. నాణ్యమైన పూలు ఉత్పత్తి అవుతుండడంతో నర్సీపట్నం, విశాఖ, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాల నుంచి హోల్‌సేల్ పూల వ్యాపారులు నేరుగా రైతు క్షేత్రాల నుంచే కొనుగోలు చేస్తున్నారు. రకాన్ని బట్టి ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తుండగా.. పెట్టుబడులు పోను రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం వస్తోంది.

పూల సాగుపై ఆసక్తి

విదేశీ పూల రకాలు లంబసింగి పరిసర ప్రాంతాలు ఎంతో అనువైనవి. గిరిజన రైతులు ఇప్పుడిప్పుడే ఈ దిశగా ఆసక్తి చూపిస్తున్నారు. పూల సాగుతో పాటు పర్యాటకం ద్వారా కూడా మంచి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. చట్టవిరుద్ధమైన పంటలను సాగు చేసే వారిని పూల సాగువైపు మళ్లించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

– ఎం.సురేష్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త, చింతపల్లి పరిశోధనా కేంద్రం

విదేశీ పూల సాగుపై ఫలించిన పరిశోధనలు

సాధారణంగా కొండ ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న, వేరుశనగ, కందులు, వలిశెలు, రాజ్మా చిక్కుళ్లతో పాటు పసుపు, అల్లం, కాఫీ వంటి పంటలు సాగు చేస్తుంటారు. అకాల, అధిక వర్షాల వల్ల ఆశించిన దిగుబడులు రాక గిరిజనులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో చట్టవిరుద్ధమైన గంజాయి తదితర పంటల్ని సాగు చేస్తూ కొందరు తరచూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు మళ్లించే లక్ష్యంతో గిరిసీమల్లో వాణిజ్య పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించింది. చింతపల్లి పరిశోధనా కేంద్రం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయాన్నిచ్చే విదేశీ పూల సాగుపై విస్తృత పరిశోధనలు చేసింది. రెండేళ్లగా గ్లాడియోలస్, లిలియం, చైనా ఆస్టర్, జెర్బరా, తులిప్ వంటి విదేశీ పూల మొక్కల సాగుపై జరిపిన పరిశోధనలు ఫలించాయి. నెదర్లాండ్స్, డెన్మార్క్ నుంచి తెచ్చిన సీడ్స్‌తో లంబసింగి ప్రాంతంలో ప్రయోగాత్మక సాగు సత్ఫలితాలనివ్వడంతో ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. లంబసింగిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఇక్కడ సాధారణ వర్షపాతం 1,240 మి.మీ. కాగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు 4–12 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 23–38 డిగ్రీల మధ్య నమోదవుతుంటాయి. చల్లని వాతావరణం, అధిక తేమ శాతం పూల సాగుకు కూడా అనుకూలం కావడంతో చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ద్వారా హెచ్‌ఏటీ జోన్‌లో విదేశీ పూల సాగుపై ఇప్పటివరకు సుమారు 400 మందికి శిక్షణనిచ్చారు. గంజాయి కేసుల్లో ఇరుక్కున్న వారు సైతం పూలసాగుపై దృష్టి సారించేలా చేస్తున్నారు.

ఎంత పెద్ద సీతాకోక చిలుకో!



ఈ చిత్రంలో కనిపిస్తున్న భారీ సీతాకోక చిలుక చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది. సాధారణంగా సీతాకోక చిలుకలు రెండు నుంచి రెండున్నర అంగుళాలుంటాయి. అయితే ఇది దాదాపు పది అంగుళాల వరకూ ఉండటం విశేషం. సాధారణ సీతాకోక చిలుకల రంగుల కంటే ఇది భిన్నంగా ఉంది. శరీరంపై నాలుగుచోట్ల ఆకర్షణీయంగా గుండ్రని మచ్చలున్నాయి. రంగు, ఆకారంలో ఎంతో ప్రత్యేకంగా ఉన్న ఈ సీతాకోక చిలుక ఆదివారం అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలోని ఓ ఇంటి గోడపై వాలింది. – గుర్రంకొండ

విశాఖలో రికార్డింగ్ స్టూడియో నిర్మిస్తా..

- ప్రముఖ సినీ సంగీత దర్శకుడు థమన్

ఏయూక్యాంపస్: సినిమా సంగీతం రూపకల్పనకు వీలుగా విశాఖలోని భీమిలిలో రికార్డింగ్ స్టూడియోను నిర్మిస్తానని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్‌ఎస్ థమన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెయింట్ లూక్స్ సంస్థ సహకారంతో నూతనంగా నిర్మించిన ఆడియో రికార్డింగ్ స్టూడియో, తరగతి గదులను ఆదివారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో కలిసి థమన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను మ్యూజిక్ ల్యాండ్‌గా భావిస్తున్నానని, విశాఖ కేంద్రంగా సినీ సంగీత ప్రయాణానికి ఇదో మంచి ఆరంభంగా నిలుస్తుందన్నారు. తనకు దేశ, విదేశాల్లో స్టూడియోలున్నాయని, త్వరలో విశాఖలోనూ స్టూడియో నిర్మిస్తానన్నారు. తన విశ్రాంత జీవితాన్ని ప్రశాంత నగరమైన విశాఖలో గడిపేందుకే తాను ఇష్టపడతానని తెలిపారు. ఎంతో సుదీర్ఘ అనుభవం కలిగిన సంగీత దర్శకుడు ఆశీర్వాద్ లూక్స్ మార్గదర్శకంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ అకాడమీని ప్రారంభించడం మంచి పరిణామమని, రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఏయూను తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు చెప్పారు. సంగీత దర్శకుడు ఆశీర్వాద్ లూక్స్, సెయింట్ లూక్స్ సంస్థల అధినేత ప్రీతం లూక్స్ తదితరులు పాల్గొన్నారు.



స్టూడియో ప్రారంభిస్తున్న థమన్

అసెంబ్లీ తీర్మానంపై హర్షం

- దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా నిరాకరించడం సరికాదంటూ తీర్మానం చేయడంపై కృతజ్ఞతలు
- విజయవాడ కథోలిక పీఠం బిషప్



మాట్లాడుతున్న బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు

పటమట(విజయవాడతూర్పు): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా నిరాకరించడం సరికాదంటూ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడంపై 'ది ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్' తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నామని విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమటలోని సెయింట్‌పాల్స్ కథెడ్రల్ చర్చి వద్ద ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరి 27న తమ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లిసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరామని, దీనిపై ఆయన త్వరితగతిన స్పందించి శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దళిత క్రైస్తవుల్లో ఆర్థికంగా, సామాజికంగా ఎలాంటి మార్పులేదన్నారు. దళిత బౌద్ధులకు, దళిత సిక్కులకు ఎస్సీ హోదా కల్పించి.. కేవలం దళిత క్రిస్టియన్లు, దళిత ముస్లింలకు ఆ హోదా లేకపోవడంపై అనేక కోణాల్లో తాము సీఎంకు వివరించామని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి డయాసిస్ సీఎస్ఐ బిషప్ టి.జార్జి కొర్నిలియస్, మోన్సిగ్నోర్ సెయింట్‌పాల్స్ కథెడ్రల్ విచారణ కర్తలు, ఫెడరేషన్ కార్యదర్శి ఫాదర్ మువ్వల ప్రసాద్, సీఎస్ఐ పాస్టర్లు పాల్గొన్నారు.

ఇంగితజ్ఞానం, విషయజ్ఞానం లేని వ్యక్తి రామోజీ

- రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లడమే ఆయన ఎజెండా
- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఈనాడు రామోజీరావుకు వయసు పెరిగిందే తప్ప.. ఇంగితజ్ఞానం, విషయపరిజ్ఞానం పెరగలేదని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడమే ఎజెండాగా పెట్టుకుని రామోజీరావు పిచ్చి రాతలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాతల్లో కనీస వాస్తవం కూడా ఉండటం లేదన్నారు. టీడీపీ నేతలు మాట్లాడడం.. రామోజీ రాయడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం 2015లో డిసెంబర్ 4న జీవో నంబర్ 15ను విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద హెక్టారుకు రూ.15 వేలు ఇస్తామన్నారని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన జీవో ప్రకారమే ఇస్తుంటే.. కనీస విషయ పరిజ్ఞానం కూడా లేకుండా తమ ప్రభుత్వంపై రామోజీ పిచ్చి రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ఈ జీవోలు ఉన్నాయని కూడా తెలియకుండా వార్తలు రాయడం సిగ్గుచేటన్నారు. కేంద్రం పరిమితులను దృష్టిలో పెట్టుకునే పరిహారం ఉంటుందన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో వ్యవసాయం ఏ విధంగా సాగుతోంది? రైతులు ఏ విధంగా పంటలు పండిస్తున్నారు?, సాగునీటి నుంచి కరువు మండలాల వరకు ఇలా అన్నింటిలో వ్యత్యాసం ఎలా ఉందో తెలియజేస్తూ రామోజీ ఈనాడులో రాయగలరా? అని మంత్రి కాకాణి నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో కరువుతో రైతులు అల్లాడారని గుర్తు చేశారు. ప్రస్తుతం సకాలంలో వర్షాలు పడుతున్నాయని.. నీరు సమృద్ధిగా ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కానీ ఇవేమీ పట్టని రామోజీరావు తెలంగాణ అంశాలను ఏపీకి ముడిపెడుతూ పిచ్చిరాతలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ దయతోనే తామంతా గెలిచామని మంత్రి కాకాణి తెలిపారు.

తెలంగాణ

మళ్లీ సొంతగూటికి డీఎస్

సాక్షి, హైదరాబాద్: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) సొంత గూటికి చేరుకున్నారు. తన కుమారుడు సంజయ్‌తో కలిసి ఆదివారం ఉదయం గాంధీభవన్‌కు వచ్చిన డీఎస్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సమక్షంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కె.జానారెడ్డిలు ఆయనకు పార్టీ కండువాలు కప్పారు. ఆయనతో పాటు నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, మేడ్చల్ సత్యనారాయణలు కూడా పార్టీలో చేరారు. తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడంపై డీఎస్ మీడియాతో మాట్లాడుతూ తనకు చాలా సంతోషంగా, ఆనందంగా ఉందన్నారు. తాను కాంగ్రెస్‌ను వీడి తప్పు చేశానని, భవిష్యత్తులో అలాంటి తప్పు చేయనని, తాను చనిపోయినపుడు తన మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండానే ఉంచాలని సోనియాగాంధీని కలిసినప్పుడు చెప్పానని వెల్లడించారు.

పంట సీజన్ ముగియక ముందే పరిహారం

- 2015 డిసెంబర్‌లో ఇచ్చిన జీవో నం.15 ప్రకారమే పరిహారం
- వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ 2015 డిసెంబర్‌లో విడుదల చేసిన జీవో నం.15 ప్రకారమే చెల్లిస్తున్నట్టు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట కాలపరిమితి ముగియకముందే పెట్టుబడి రాయితీని రైతుల ఖాతాలో జమచేస్తున్నట్టు పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్‌లో సంభవించిన మాండూస్ తుపానుతో పంట నష్టపోయిన రైతుల జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతుభరోసా కేంద్రాల వద్ద ఉంచి రైతుల అభ్యంతరాలను కూడా తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ల ప్రతిపాదన మేరకు మొత్తం 60,450 హెక్టార్లలో పంట నష్టపోయిన మొత్తం 91,237 మంది రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్ముగా రూ.76.98 కోట్లను ఈ ఏడాది ఫిబ్రవరి 28న వారి ఖాతాల్లో జమచేసినట్టు గుర్తుచేశారు. కానీ కొన్ని పత్రికలు అరకొర సాయమంటూ, అర్హత గల రైతులను వదిలేశారంటూ తప్పుడు కథనాలు ప్రచురించాయని, ఇందులో వాస్తవం లేదని ఖండించారు. పంట నష్టపోయిన రైతుల పేర్లను ఆర్బీకేల వద్ద చదివి వినిపించి, అభ్యంతరాలు లేవని రైతులు ధ్రువీకరించిన తర్వాతే జాబితా తయారు చేస్తున్నామని, ఆ తర్వాతే పెట్టుబడి రాయితీని జీవో నం.15 ప్రకారం చెల్లిస్తున్నామని వివరించారు. ఇప్పుడూ అదే పద్ధతిని పారదర్శకతతో పాటిస్తున్నామని, ఈ నెలలో కురిసిన అకాల వర్షాలకు పంటనష్టం అంచనాలను, రైతుల జాబితాలను తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. ఈ జాబితా సామాజిక తనిఖీ, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం అనంతరం కలెక్టర్ల ప్రతిపాదనలతో ఏప్రిల్ 4వ తేదీ నాటికి కమిషనర్ కార్యాలయానికి పంపాలని నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ప్రతిపాదనలు అందిన తర్వాత నష్టపోయిన రైతుల ఖాతాలకు పెట్టుబడి రాయితీ సొమ్ము జమచేస్తామని ఆయన తెలిపారు.

రాజ్‌భవన్‌లో బిల్లుల పెండింగ్‌పై
నేడు సుప్రీంలో విచారణ

- కౌంటర్ దాఖలు చేయనున్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే న్యాయ నిపుణులతో చర్చించిన గవర్నర్ తమిళిసై
- సీజేఐ ధర్మాసనం నిర్ణయంపై ఆశలు పెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాల నేపథ్యంలో రాజ్‌భవన్‌లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు బిల్లుల వ్యవహారంపై సోమవారం సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరగనుంది. గవర్నర్ తమిళిసై బిల్లులను ఆమోదించకపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా ఈ నెల 20న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్... కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రానికి నోటీసులు పంపడం తెలిసిందే. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండటంతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు నోటీసులు జారీ చేయలేమని వ్యాఖ్యానించిన ధర్మాసనం.... కేసు తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసు విషయమై అనుసరించాల్సిన వ్యూహంపై గవర్నర్ తమిళిసై ఢిల్లీలోని న్యాయ నిపుణులతో చర్చించినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగే విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో కేంద్రం అభిప్రాయంతోపాటు రాజ్‌భవన్ వైఖరి సైతం వెల్లడి కానుంది. ఈ వ్యవహారంలో సుప్రీం ధర్మాసనం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావంతో ఉంది.

194 రోజులుగా పెండింగ్‌లో 7 బిల్లులు..

గతేడాది సెప్టెంబర్ 13న శాసనసభ, శాసన మండలి ఆమోదించిన మొత్తం 8 బిల్లులను ప్రభుత్వం గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపించింది. అందులో జీఎస్టీ చట్ట సవరణ బిల్లుకు మాత్రమే గవర్నర్ ఆమోదం తెలిపారు. మిగతా ఏడు బిల్లులు 194 రోజులుగా రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ప్రైవేటు వర్సిటీల బిల్లు ముఖ్యమైనది. ఈ బిల్లుపై గవర్నర్ పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గతేడాది నవంబర్ 8న రాజ్‌భవన్‌కు వెళ్లి అనుమానాలను నివృత్తి చేశారు. అయినా బిల్లు పెండింగ్‌లోనే ఉండిపోయింది. మరోవైపు వర్సిటీల్లో బోధన, బోధనేతర విభాగాల కొలువుల భర్తీ జరగక ఉన్నత విద్య కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ములుగు అటవీ కళాశాల పేరును తెలంగాణ అటవీ యూనివర్సిటీగా మార్పు ప్రతిపాదన బిల్లు, ప్రైవేటు వర్సిటీల చట్టం బిల్లు, పురపాలికల చట్ట సవరణ బిల్లు, ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంత చట్ట సవరణ బిల్లు, పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్ట సవరణ బిల్లు, మోటార్ వెహికల్స్ ట్యాక్సేషన్ చట్ట సవరణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఈ ఏడాది ఫిబ్రవరి 12న శాసనసభ, శాసనమండలి ఆమోదించిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

తెలంగాణ

రైతు వాదంతోనే సమస్యలకు పరిష్కారం

- మహారాష్ట్ర సభలో తెలంగాణ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో జాతి వాదం, మత వాదాన్ని విడిచిపెట్టి రైతు వాదం చేపట్టాలని.. అప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని కాంధార్ లోహాలో 'అబ్‌కీ బార్.. కిసాన్ సర్కార్' నినాదంతో బీఆర్‌ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఇన్నాళ్లుగా దేశంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజలకు, రైతులకు న్యాయం జరగలేదని.. రైతు సర్కారు వచ్చినప్పుడే సమస్యలు తీరుతాయని చెప్పారు. తనతో కలసి ఉద్యమించేందుకు మహారాష్ట్ర రైతులు ముందుకు రావాలని, ప్రతి ఎకరానికి సాగునీరు అందించే బాధ్యత తనదని చెప్పారు. రైతులకు ప్రతి ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి సాయం, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, ఉచిత సాగునీరు, ప్రతి ధాన్యం గింజ కొనుగోలు వంటివి అమలు చేసేంత వరకు మహారాష్ట్రలో రైతులతో కలిసి తన పోరాటం కొనసాగుతుందన్నారు. తెలంగాణ తరహాలో ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందజేసే దళితబంధు పథకం అంబేడ్కర్ పుట్టిన మహారాష్ట్ర గడ్డపై అమలయ్యేంత వరకు వస్తూనే ఉంటానన్నారు. 'నాతో కలిసి ఉద్యమించండి. ప్రతీ ఎకరానికి నీరు అందించే బాధ్యత నాది. నా మాటలను ఇక్కడే వదిలి వెళ్లకుండా మీ గ్రామాల్లో, మీ కుటుంబాల్లో చర్చించండి' అని పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో, అన్ని జిల్లా పరిషత్‌లలో బీఆర్‌ఎస్ పోటీచేసి గులాబీ జెండా ఎగుర వేస్తుందని కేసీఆర్ చెప్పారు. తొమ్మిదేళ్ల క్రితం దారుణ స్థితిలో ఉన్న తెలంగాణ ఇప్పుడు గొప్ప ప్రగతితో ఆదర్శంగా నిలుస్తోంది. అలాంటిది ఎంతో సంపద ఉన్న మహారాష్ట్రను శక్తివంతమైన రాష్ట్రంగా మార్చవచ్చన్నారు. కేసీఆర్ పర్యటన సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన మహారాష్ట్ర నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు.

చకచకా.. రామయ్య తలంబ్రాలు

- గతంలో చేతితో ప్యాకెట్ల తయారీ
- ఇప్పుడు అందుబాటులోకి ప్రత్యేక యంత్రాలు

భద్రాచలం: భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు సిద్ధమవుతున్నాయి. భద్రాచలంలో కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు పంచడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకునేవారికి సరఫరా చేసేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ మంది భక్తులకు తలంబ్రాలు అందించేందుకు వీలుగా ప్రత్యేక యంత్రాల ద్వారా వాటిని ప్యాకింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ తలంబ్రాల తయారీ ప్రక్రియ వేగం పుంజుకుంది. రామయ్య కల్యాణ తలంబ్రాలు కావాలనుకునేవారు మీసేవ కేంద్రాల ద్వారా బుక్ చేసుకోవచ్చు.

ఇన్నాళ్ల ఇబ్బందికి చెక్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఏటా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సీతారాములకు సమర్పించే ముత్యాల తలంబ్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. ఆ ముత్యాల తలంబ్రాలను ఇంటికి తీసుకెళితే మంచి జరుగుతుందన్న భావనతో చాలా మంది భక్తులు తీసుకుంటుంటారు. శ్రీరామనవమి రోజున భద్రాచలం వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగానే ముత్యాల తలంబ్రాలను అందిస్తారు. దూర ప్రాంతాల్లో ఉండి కల్యాణోత్సవానికి హాజరుకాలేని వారితోపాటు బంధువులు, స్నేహితులకు అందజేసేందుకు కావాలనుకునే భక్తుల కోసం దేవస్థానం రెండు ముత్యాలతో కూడిన తలంబ్రాలను విక్రయిస్తోంది. గతంలో ఈ తలంబ్రాలను స్వచ్ఛంద సంస్థ సభ్యులతో ప్యాకింగ్ చేయించేవారు. దీనితో చాలా సమయం పట్టడంతోపాటు ఆ ప్యాకెట్లు రవాణాలో చిరిగిపోయేవి. ఈ క్రమంలోనే వేగంగా ప్యాకింగ్ చేయడం, రవాణాలో దెబ్బతినకుండా ఉండేలా దేవస్థానం అధికారులు ప్యాకింగ్ యంత్రాలపై దృష్టిపెట్టారు.

దాతల చేయూతతో యంత్రాలు

ముత్యాల తలంబ్రాలు, పులిహోర ప్రసాదం ప్యాకింగ్ యంత్రాల కోసం దేవస్థానం అధికారులు దాతలను సంప్రదించారు. తిరుపతి ఖాదీబండార్‌కు చెందిన కుమార్ కిట్టు యాజమాన్యం రూ.1.40 లక్షలతో తలంబ్రాల ప్యాకింగ్ యంత్రాన్ని, శశి విద్యాసంస్థల యాజమాన్యం రూ.1.50 లక్షల విలువైన ప్యాకింగ్ కవర్లను సమకూర్చాయి. ఇక రూ.1.45 లక్షల విలువైన పులిహోర ప్రసాదం ప్యాకింగ్ యంత్రాన్ని తులసి ఆస్పత్రి యజమాన్యం ఏజేఆర్ సేవా సంస్థ పేరుతో సమకూర్చింది.

గంటకు 1,500 ప్యాకెట్లు

యంత్రంలో తలంబ్రాల నడుమ ముత్యాలు ఉంచి ఆన్ చేస్తే ఆటోమేటిక్‌గా ప్యాకెట్లు తయారై బయటికి వస్తాయి. ఈ యంత్రం ద్వారా నిమిషానికి 25 చొప్పున గంటకు 1,500 ప్యాకెట్లు సిద్ధమవుతున్నాయి. రోజూ 12–13 గంటల చొప్పున సుమారు 20 వేల వరకు ప్యాకెట్లు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రెండు లక్షల తలంబ్రాల ప్యాకెట్లను భక్తులకు అందుబాటులో ఉంచాలని అధికారులు నిర్ణయించారు. పులిహోర ప్రసాదం ప్యాకింగ్ యంత్రం ద్వారా గంటకు 1,400 వరకు ప్యాకెట్లు సిద్ధమవుతున్నాయి. ఇటీవలి వరకు రోజువారీగా విక్రయించే ప్రసాదాన్ని ప్యాక్ చేయాలంటే కార్మికులకు ఒకపూటంతా పట్టేదని.. ఇప్పుడు రెండు గంటల్లోనే పని పూర్తవుతోందని దేవస్థానం అధికారులు చెప్పారు. పోస్టల్ శాఖ, ఆర్టీసీ కార్గో ద్వారా ముత్యాల తలంబ్రాలను భక్తులకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా..

ఆ కత్తి.. ఒక కూడలి !



రామ్‌పూర్ (యూపీ): 1980 నాటి బాలీవుడ్ సినిమాల్లో రామ్‌పూర్ కత్తి అంటే ప్రేక్షకులకి ఒక పిడిబాకే. ఆ కత్తితో చేసే విన్యాసాలు హడల్ పుట్టించేవి. ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ ఒకప్పుడు కత్తులకు, కటార్లకు బాగా ఫేమస్. అత్యంత నాణ్యమైన కత్తులు లభించేవి. ఫోల్డ బుల్ కత్తులు ఎవరికైనా కావాలంటే రామ్‌పూర్ వెళ్లవలసిందే. ఎప్పుడైతే చైనా మార్కెట్ భారత్‌ను ముంచేసి తక్కువ ధరకే చాకులు లభ్యమయ్యాయో ఈ రామ్‌పూర్ చాకుల్ని జనం కొనడం మానేశారు. అయినప్పటికీ దానికుండే క్రేజ్ దానికి ఉంది. అందుకే రామ్‌పూర్ అధికారులు నైనిటాల్ నుంచి రామ్‌పూర్‌కు వచ్చే మార్గంలో ఒక కూడలిలో ఈ కత్తిని ఏర్పాటు చేశారు. దానికి రామ్‌పూర్ చాకు చౌక్ అని పెట్టారు. దాదాపుగా 20 అడుగుల ఎత్తైన రామ్‌పూర్ కత్తి ఇప్పుడు ఠీవీగా కనిపిస్తూ పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. ఒకప్పుడు ఈ కత్తి పేరు చెబితే హడలిపోయేవారే ఇప్పుడు దానినొక కళాకృతి కింద చూడడం విశేషం.

గర్ల్ ఫ్రెండ్‌కి సాయం చేయబోయి పాపం జైలుపాలయ్యాడు

ఫ్లోరిడా: అమెరికాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన శిక్షలు ఎదుర్కోవాలి. తన గర్ల్‌ఫ్రెండ్‌ని సరైన సమయానికి ఇంటర్వ్యూకి తీసుకువెళ్లాలని గంటకి 160కి.మీ. వేగంతో కారు నడిపిన వ్యక్తి ఇప్పుడు కటకటాలు ఊచలు లెక్కపెడుతున్నాడు. ఫ్లోరిడాకు చెందిన జెవన్ పీర్ జాక్సన్ (22) గంటకి 65కి.మీ. వేగంతో మాత్రమే ప్రయాణించే జోన్‌లో నిబంధనల్ని బేఖాతర్ చేశాడు. ఏకంగా 160 కి.మీ. వేగంతో కారు నడిపాడు. మార్గం మధ్యలో కొన్ని వాహనాలను కూడా ఢీ కొట్టబోయి తృటిలో ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. జాక్సన్ ఢీ కొట్టబోయిన ఒక వాహనంలో పోలీసు వాహనంతో పాటు ముగ్గురు చిన్నారులున్న మరో వాహనం ఉండడంతో అతని చుట్టూ ఉచ్చు బిగిసింది. ట్రాఫిక్ నిబంధనల్ని ఉల్లంఘించడమే కాకుండా, చిన్న పిల్లలకి హాని జరగబోయిందన్న కేసు పెట్టిన పోలీసులు జాక్సన్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. అరెస్ట్ చేసి జైలుకి తరలించారు.

వీకెండ్ కాపురాలు

పెళ్లంటే రెండు జీవితాల కలయిక. నిండు నూరేళ్ల సావాసం. ఎన్ని కష్టనష్టాలెదురైనా జీవితాంతం ఒకరి చేయి మరొకరు విడిచిపెట్టకూడదు. ఒకేచోట కలిసుంటేనే బంధం బలపడుతుంది...

ఇన్నాళ్లూ పెళ్లికి మనకి ఈ అర్థాలే తెలుసు...

కానీ... నేటి జనరేషన్ జెడ్ పెళ్లికి కొత్త భాష్యాలు చెబుతోంది. 'ఎవరి జీవితం వారిది. ఎవరి ఆర్థిక స్వాతంత్ర్యం వారిది. ఎవరి వ్యక్తిత్వం వారిది. ఒకరి కోసం మరొకరు వాటిని వదులుకోనక్కర్లేదు. అందమైన జీవితాన్ని మూడు ముళ్లతో బంధించి జీవితాంతం రాజీ పడనక్కర్లేదు' వంటి ఆలోచనల నుంచి వీకెండ్ మ్యారేజెస్ కాన్సెప్ట్ పుట్టుకొచ్చింది. జపాన్లోనైతే ఇవి ట్రెండుగా మారాయి. భారత్‌లోనూ మెల్లిగా తెరపైకి వస్తున్నాయి...

-సాక్షి, నేషనల్ డెస్క్

పాశ్చాత్యదేశాల్లో నయా ట్రెండ్

వారంలో అయిదు రోజులు ఎవరికి వారు	మిగిలిన రెండు రోజులు ఒకరికొకరు	పెళ్లికి జనరేషన్ జెడ్ కొత్త భాష్యం



వీకెండ్ మ్యారేజెస్ అంటే..?

ఇవాళ రేపు ఆడ, మగ ఇద్దరూ సమానమే. ఒకరు తక్కువ మరొకరు ఎక్కువ అని లేదు. భర్త బయట పని చేసి డబ్బు సంపాదిస్తే, భార్య ఇంటిని చక్కదిద్దుకుంటూ గృహిణి జీవితం గడిపే రోజులు పోయాయి. మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లు సంపాదిస్తున్నారు. తమ వ్యక్తిత్వాన్ని వదులుకోవడానికి, జీవితంలో సర్దుకుపోవడానికి ససేమిరా అంటున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఊపిరి పీల్చుకోవడానికి కూడా వీల్లేని బిజీ లైఫ్‌లో గడిపేస్తున్నారు. అందుకే పెళ్లి చేసుకొని ఒకే చోట ఉండడం కంటే వీకెండ్స్‌లో కలిసి ఉండాలని ముందే ఒక అవగాహన కుదుర్చుకుంటున్నారు. వారంలో అయిదు రోజులు ఎవరి జీవితం వారిది, మిగిలిన రెండు రోజులు ఒకరికొకరుగా కలిసి జీవిస్తారు. కష్టసుఖాలు కలబోసుకుంటారు. గుండెల నిండా గూడు కట్టుకున్న ప్రేమని పంచుకుంటూ రెండు రోజులు రెండు క్షణాల్లా గడిపేస్తారు.

వీకెండ్ కాపురాలకు కారణాలు

- ఆఫీసులో పని ఒత్తిడితో ఆడ, మగ లైఫ్‌స్టైల్ వేర్వేరుగా ఉంటున్నాయి. ఒకరికి ఉదయం షిఫ్ట్ అయితే మరొకరికి రాత్రి షిఫ్ట్ ఉంటుంది. ఒకరి ఆఫీసు ఊరికి ఒక మూల ఉంటే, మరొకరిది మరో మూల ఉంటుంది. దీంతో ఒకేచోట కలిసుండే పరిస్థితి ఉండడం లేదు
- పెళ్లి చేసుకున్నా ఇద్దరిలో ఎవరికి వారే తాము పుట్టి పెరిగిన వాతావరణాన్ని వదులుకోవడానికి సిద్ధపడడం లేదు.
- ముఖపరిచయం కూడా లేకుండా పెళ్లి చూపుల్లోనే ఒకరినొకరు చూసుకునే జంటలు ఒకరితో ఒకరు ఎంతవరకు జెల్ అవగలరో తెలుసుకోలేకపోతున్నారు. అందుకే ముందుగా వీకెండ్స్‌లో కలిసుంటే ఒకరినొకరు అర్థం చేసుకోవచ్చునని భావిస్తున్నారు.
- భార్యాభర్తలకి ఒకరి నుంచి మరొకరికి ఎక్స్‌పెక్టేషన్‌లు ఉంటాయి. ఆఫీసు నుంచి అలిసిపోయి ఇంటికి వచ్చిన వారికి భాగస్వామి తమకి అనుకూలంగా లేకపోతే చిర్రెత్తుకొచ్చి దెబ్బలాటలకి దారి తీస్తాయి. అదే వీకెండ్స్‌లో మాత్రమే కలిస్తే, కలిసుండేది కాస్త సమయమైనా హాయిగా గడుపుదామని అనిపిస్తుంది. మళ్లీ వారం వరకు చూడలేమన్న ఫీల్‌తో ఒకరిపై మరొకరికి ప్రేమ పొంగుకొస్తుంది. సర్‌ప్రైజ్‌లు, రొమాన్స్‌లు కొత్తగా వింతగా అనిపించి మానసికంగా ఎనలేని సంతృప్తి ఉంటుంది.
- ఆర్థికంగా ఎవరి స్వాతంత్ర్యం వారికుంటుంది. ఎవరికి వారు వాళ్ల ఇళ్లల్లో ఉంటారు కాబట్టి డబ్బుల్ని ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది.
- అబ్బాయిలు, అమ్మాయిలు అన్న తేడా లేకుండా ఈ మధ్య అందరూ తమకి మాత్రమే సొంతమైన ఒక స్పేస్ కావాలని బలంగా కోరుకుంటున్నారు. వీకెండ్ కాపురాల్లో ఎవరికి కావల్సినంత స్పేస్ వారికి దొరుకుతుంది.

భారత్‌లో కుదిరే పనేనా..?

వీకెండ్ పెళ్లి పేరుతో వారానికోసారి కలుస్తామంటే అంగీకరించే సామాజిక పరిస్థితులు భారత్‌లో లేవు. ముంబైలాంటి నగరాల్లో కొందరు ప్రయోగాత్మకంగా వీకెండ్ కాపురాలు మొదలు పెట్టారు. ఆఫీసులు చెరో మూల ఉన్నప్పుడు ఇలా వీకెండ్స్‌లో కలవడమే బెటర్ అని నిర్ణయించుకునే జంటలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. రోజంతా ట్రాఫిక్ జామ్‌లో పడి ఏ రాత్రికో ఉసూరంటూ ఇంటికి చేరడానికి బదులుగా ఎవరిళ్లలో వారుంటూ వీకెండ్ వరకు ఎదురు చూడడమే మంచిదన్న అభిప్రాయానికి నేటితరం వస్తున్నా కుటుంబాలైతే అంగీకరించడం లేదు. మన దేశంలో పెళ్లంటే రెండు కుటుంబాల కలయిక. వడం. కనుక[illegible] కట్టుబాట్లు, సంప్రదాయాలు తప్పనిసరి. పెళ్లి చేసుకుంటే ఒక కమిట్‌మెంట్‌తో ఉండాలి. జపాన్, చైనా వంటి దేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవడానికి, పిల్లలు కనడానికి యువతరం విముఖంగా ఉంటోంది. ఏళ్ల తరబడి పిల్లల్ని కనొద్దని ప్రభుత్వం పెట్టిన ఆంక్షలే శాపంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో పసిపాపల బోసినవ్వులు కనిపించి ఏళ్లవుతున్నాయి. అందుకే పెళ్లి చేసుకొని వారంలో రెండు రోజులైనా కలిసుంటే చాలన్న స్థితి వచ్చింది. మన దగ్గర ఆలా కాదు. ముఖ్యంగా పిల్లలు పుడితే ఏం చేస్తారు ? తల్లి తండ్రి ఇద్దరి ప్రేమ మధ్య పెరగాల్సిన పిల్లల్ని కూడా వారానికొకరని పంచుకోవడం అసాధ్యం. వ్యక్తిత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం పేరుతో వీకెండ్ కాపురాలు చేయాలని యువతరం భావించినా పెద్దలు వారిని అడ్డుకుంటున్నారు. అందుకే భారత దేశంలోని కుటుంబ వ్యవస్థ ఇప్పటికీ ప్రపంచానికి మార్గదర్శకంగా ఉంటోంది.

> "భారత్‌లో పెళ్లికి ఒక పవిత్రత ఉంది. దాన్నో ప్రయోగంగా మార్చాలని ఎవరూ అనుకోరు. ఇద్దరూ వారంలో రెండు రోజులు మాత్రమే కలిసుంటే వారిద్దరి మధ్య పరస్పర నమ్మకం, అవగాహన ఏర్పడడం కష్టం. భాగస్వామిలోనున్న లోపాలను కూడా ప్రేమించగలిగినప్పుడే ఆ వివాహం పదికాలాలు పచ్చగా ఉంటుంది. కానీ లోపాలను కప్పిపుచ్చుకుంటూ మనలో ఉన్న మంచిని మాత్రమే అవతలి వ్యక్తికి చూపించాలనుకున్నప్పుడు పెళ్లి అన్న పదానికే అర్థం లేకుండా పోతుంది"
>
> - శ్రేయా కౌలమ్, సైకాలజిస్ట్

మోదీ పిరికిపంద

అధికారం వెనుక దాక్కుంటున్నాడు: ప్రియాంక

రాహుల్‌ను అవమానించిన వారిపై కేసులేవీ?	దేశం కోసం రక్తం ధార పోసిన కుటుంబం మాది	ఇప్పటికీ అవమానిస్తూనే ఉన్నారని ఆవేదన	దేశవ్యాప్తంగా కాంగ్రెస్ 'సంకల్ప్ సత్యాగ్రహం'

న్యూఢిల్లీ: ''దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ప్రధాని రాజీవ్‌గాంధీ కుమారుడు రాహుల్. దేశ ఐక్యత కోసం వేలాది కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. అలాంటి వ్యక్తి దేశాన్ని ఎందుకు అవమానిస్తారు?'' అని ఆయన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. ''బీజేపీ నేతలు రాహుల్‌ను మీరు జాఫర్ అంటూ ఎగతాళి చేశారు. జాతి వ్యతిరేక శక్తి అని నిందించారు. మా తల్లిని అవమానించారు. నెహ్రూ ఇంటిపేరు ఎందుకు పెట్టుకోలేదంటూ మమ్మల్ని ఎద్దేవా చేశారు. మా కుటుంబాన్ని, కశ్మీరీ పండిట్ల సంప్రదాయాన్ని ఆక్షేపించారు. అయినా వారిపై ఎందుకు కేసులు పెట్టలేదు? జైలు శిక్షలు విధించలేదు?'' అని ప్రశ్నించారు. తమ కుటుంబాన్ని ఇప్పటికీ అవమానిస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ''హార్వర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో చదివిన రాహుల్‌ను 'పప్పు' అని ఎగతాళి చేస్తున్నారు. కానీ ఆయన పప్పు కాదని బీజేపీ నాయకులకు తెలిసిపోయింది. అందుకే పార్లమెంటు నుంచి బయటికి పంపించారు'' అంటూ దుయ్యబట్టారు. రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసనగా కాంగ్రెస్ ఆదివారం దేశవ్యాప్తంగా 'సంకల్ప్ సత్యాగ్రహ' దీక్షలు చేపట్టింది. ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద దీక్షలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితర అగ్ర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై ప్రియాంక నిప్పులు చెరిగారు. ''మోదీ ఉత్త పిరికిపంద. అధికారం వెనుక దాక్కుంటున్నారు'' అంటూ ఎద్దేవా చేశారు. అహంకారపూరిత మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం నేర్పించడం తథ్యమన్నారు. అరాచక బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ''మా కుటుంబం ధారపోసిన రక్తం దేశ ప్రజాస్వామ్యానికి ఊతమిచ్చింది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేనికైనా సిద్ధంగా ఉన్నాం'' అని చెప్పారు. ఇకపై తాము మౌనంగా ఉండే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

'మోదీ'లను విమర్శిస్తే నొప్పెందుకు: ఖర్గే

''ఒక వ్యక్తిని కాపాడడానికి మొత్తం ప్రభుత్వం, కేబినెట్ మంత్రులు, ఎంపీలు ప్రయత్నిస్తున్నారు. అసలు అదానీ ఎవరు? ప్రభుత్వం ఆయనకు ఎందుకు అండగా ఉంటోందో చెప్పాలి'' అని ప్రియాంక నిలదీశారు. ''ప్రజల హక్కుల కోసం రాహుల్ పోరాడుతున్నారు. జోడో యాత్రలో ఆయన వెంట లక్షల మంది నడిచారు'' అన్నారు. అక్రమాలకు పాల్పడి విదేశాలకు పరారైన నీరవ్ మోదీ, లలిత్ మోదీలను విమర్శిస్తే బీజేపీ ప్రభుత్వానికి నొప్పి ఎందుకని ఖర్గే ప్రశ్నించారు.



ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న ప్రియాంక

'అనర్హత వేటు పడిన ఎంపీ'

ట్విట్టర్ ఖాతాను అప్‌డేట్ చేసిన రాహుల్

లోక్‌సభ సభ్యుడిగా తనపై అనర్హత వేటు పడిన నేపథ్యంలో రాహుల్ ఆదివారం తన ట్విట్టర్ ఖాతాను అప్‌డేట్ చేశారు. బయోడేటాను 'అనర్హత వేటుపడిన ఎంపీ'గా మార్చారు. తన అధికారిక వయనాడ్ ట్విట్టర్ ఖాతాలోనూ 'డిస్క్వాలిఫైడ్ ఎంపీ' అని రాశారు.

సత్యాగ్రహం పేరిట కాంగ్రెస్ దీక్ష చేయడం సిగ్గుచేటని బీజేపీ దుయ్యబట్టింది. దానికి ఆ అధికారమే లేదని బీజేపీ నేత సుధాంశు త్రివేది అన్నారు.

కృత్రిమ ఉపగ్రహ కాంతితో భూమికి ముప్పు!

జీవుల అలవాట్లు, ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం



ఆధునిక సాంకేతిక యుగంలో మనషుల మనుగడ కృత్రిమ ఉపగ్రహాల (శాటిలైట్లు)పై ఆధారపడి ఉందంటే అతిశయోక్తి కాదు. అన్ని రంగాల్లోనూ వీటి అవసరం పెరిగిపోతోంది. అయితే ఈ ఉపగ్రహాల కాంతి, విద్యుత్ బల్బుల వెలుగుతో పుడమికి పెద్ద ముప్పు వాటిల్లుతున్నట్లు ఇటలీ, చిలీ, గేలిసియా శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది. అధ్యయనం వివరాలను 'నేచర్ అస్ట్రానమీ' పత్రికలో ప్రచురించారు.

రానున్న రోజుల్లో విపరీణామాలే: భూగోళం చుట్టూ ప్రస్తుతం 8,000కు పైగా శాటిలైట్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇవి భూమిపై ప్రతి అంగుళాన్ని కవర్ చేస్తున్నాయి. స్పేస్‌ఎక్స్ సంస్థ 3,000కు పైగా చిన్నపాటి ఇంటర్నెట్ శాటిలైట్లను ప్రయోగించింది. వన్‌వెబ్ కూడా వందలాది కృత్రిమ ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. దేశాల మధ్య పోటీ నేపథ్యంలో భవిష్యత్తులోనూ వీటి సంఖ్య పెరగడమే తప్ప తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. మరోవైపు విద్యుత్ లైట్ల అవసరం పెరుగుతూనే ఉంది. శాటిలైట్ల నుంచి వెలువడే కాంతి, కరెంటు దీపాల నుంచి కాంతి వల్ల భూమిపై ప్రకృతికి విఘాతం వాటిల్లుతున్నట్లు సైంటిస్టులు గుర్తించారు. వీటివల్ల రాత్రిపూట ఆకాశం స్పష్టంగా కనిపించడం లేదని తేల్చారు. ''అంతేగాక ఖగోళ శాస్త్రవేత్తల విధులకూ ఆటంకం కలుగుతోంది. అస్ట్రానామికల్ అబ్జర్వేటరీల పనితీరు మందగిస్తున్నట్లు తేలింది. ఈ కాంతి కాలుష్యం కారణంగా రాత్రివేళలో అనంతమైన విశ్వాన్ని కళ్లతో, పరికరాలతో స్పష్టంగా చూడగలిగే అవకాశం తగ్గుతోంది. అంతేగాక భూమిపై జీవుల అలవాట్లలో, ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు వస్తున్నాయి'' అని వెల్లడించారు. దీనికి అడ్డుకట్ట వేసి సహజ ప్రకృతిని పరిరక్షించుకొనే దిశగా దృష్టి పెట్టాలని సూచించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పరిష్కారం ఏమిటి?

కాంతి కాలుష్యానికి ఇప్పటికిప్పుడు పూర్తిస్థాయి పరిష్కార మార్గం లేదని నిపుణులు అంటున్నారు. దాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టడం మేలు. ''శాటిలైట్లలో బ్రైట్‌నెస్ తగ్గించాలి. టెలిస్కోప్ పరికరాల్లోని షట్టర్లను కాసేపు మూసేయడం ద్వారా కాంతి తీవ్రతను తగ్గించవచ్చు'' అని సూచిస్తున్నారు. కృత్రిమ ఉపగ్రహాలతో కాంతి కాలుష్యమే గాక మరెన్నో సమస్యలున్నాయి. కాలం తీరిన శాటిలైట్లు అంతరిక్షంలోనే వ్యర్థాలుగా పోగుపడుతున్నాయి. అంతరిక్ష కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. పైగా వీటినుంచి ప్రమాదకర విషవాయువులు వెలువడుతుంటాయి. ఆర్బిటాల్ ట్రాఫిక్ మరో పెను సమస్య.

కిస్కా కథ అలా ముగిసింది..!

ప్రపంచంలోనే అత్యంత ఒంటరి తిమింగలంగా పేరు	శాంక్చువరీలోనే 40 ఏళ్లు ఖైదు.. ఇటీవలే తుదిశ్వాస



ఒంటారియో: కిస్కా. ఓర్కా రకం కిల్లర్ వేల్. ప్రపంచంలోనే అత్యంత ఒంటరి తిమింగలం. దాదాపు 40 ఏళ్లపాటు నీళ్ల ట్యాంకులో ఒంటరిగా బతుకీడ్చింది. చోటు మార్చాలని జంతువుల హక్కుల సంఘాలు చేసిన ప్రయత్నాలు విఫలం కాగా, అనారోగ్యంతో ఇటీవలే కన్నుమూసింది. ఐస్‌ల్యాండ్ సమీపంలోని సముద్ర జలాల్లో ఏడేళ్ల వయసున్నప్పుడు ఈ కిల్లర్ వేల్ పట్టుబడింది. దీనిని ఒంటారియోలోని నయాగరా జలపాతం వద్ద ఉన్న మెరైన్‌ల్యాండ్ జూ పార్క్‌కు అమ్మేశారు. 40 ఏళ్ల పాటు కిస్కా ఓ నీళ్ల ట్యాంకుకే పరిమితమైపోయింది. ప్రపంచంలోనే అత్యంత ఒంటరి తిమింగలంగా ముద్రపడింది. ఇటీవలే సుమారు 47 ఏళ్ల వయస్సులో కిస్కా చనిపోయింది. 'కిస్కా మృతి పట్ల విచారిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఓర్కా రకం తిమింగలాలు బందీలుగా ఉన్నాయి. కెనడా ప్రభుత్వం నోవాస్కోటియాలో వందెకరాల్లో వేల్ శాంక్చువరీ ప్రాజెక్టు ఏర్పాటు పనుల్లో ఉంది. ఇది పూర్తయితే ట్యాంకుల్లో కన్నా స్వేచ్ఛగా, మెరుగైన సురక్షిత వాతావరణంలో పట్టుబడిన తిమింగలాలు, డాల్ఫిన్లను ఉంచడానికి అవకాశం ఏర్పడుతుంది'అని ఏనిమల్ జస్టిస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెమిల్లె లబ్చుక్ అన్నారు. తిమింగలాల్లో అత్యంత బలమైన ఈ ఓర్కాల ఆయుర్దాయం 50 నుంచి 90 ఏళ్లు.

బ్రిటన్ హిందువుల ఆరోగ్యం భేష్ !

లండన్: ఆరోగ్యమే మహాభాగ్యమని మన పెద్దలు అంటారు. దానికి తగ్గట్టుగానే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో హిందువులకి మించిన వారు లేరని బ్రిటన్‌లోని ఒక సర్వేలో తేలింది. బ్రిటన్‌లో నివసించే హిందువులు అత్యంత ఆరోగ్యవంతులు, విద్యాధికులని తేలితే, సిక్కులందరికీ దాదాపుగా సొంతిల్లు ఉందని వెల్లడైంది. ఇంగ్లండ్, వేల్స్‌లోని జనగణన సందర్భంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. యూకేలో ఆఫీస్ ఫర్ నేషనల్ స్టేటస్టిక్స్ (ఒఎన్‌ఎస్) ఈ జనగణన వివరాలను విడుదల చేసింది. ''2021లో మార్చిలో జరిపిన ఈ సర్వేలో హిందువుల్లో ఆరోగ్యంగా ఉన్నవారు 87.8% ఉంటే, మొత్తంగా జనాభాలో 82%మంది ఆరోగ్యంతో ఉన్నారు. ఇక ఉన్నత విద్యనభ్యసించిన హిందువులు 54.8% ఉంటే, మొత్తం బ్రిటన్ జనాభాలో 33.8% ఉన్నారు. ఇక సిక్కుల్లో 77.7% మంది సొంతిళ్లలో నివసిస్తున్నారు.ఉద్యోగాల్లేక అవస్థలు పడుతున్న వారిలో ముస్లింలు ఎక్కువ మంది ఉన్నారు. బ్రిటన్‌లో నివసిస్తున్న 16–64 ఏళ్ల మధ్య వయసున్న ముస్లింలలో 51% మందే ఉద్యోగాలు చేస్తున్నారు'' అని సర్వే నివేదిక వివరించింది.

ఇస్రో కీర్తి కిరీటంలో... మరో వాణిజ్య విజయం

- దిగ్విజయంగా వన్‌వెబ్ ఇండియా-2 ఉపగ్రహాల ప్రయోగం
- విజయవంతంగా కక్ష్యలోకి 36 సమాచార ఉపగ్రహాలు



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): ఇస్రో మరో అద్భుత వాణిజ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొత్తం 36 వన్‌వెబ్ ఇండియా–2 ఇంటర్నెట్ సమాచార ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి అత్యంత బరువైన ఎల్‌వీఎం3–ఎం3 బాహుబలి రాకెట్ వాటిని తీసుకుని ఆదివారం ఉదయం 9.00 గంటలకు నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్లింది. బ్రిటన్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేట్ లిమిటెడ్, ఇండియన్ భారతి ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా రూపొందించిన 5,805 కిలోలు బరువున్న ఈ ఉపగ్రహాలను భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ 36 ఉపగ్రహాలను 97 నిమిషాల వ్యవధిలో ఒక్కోసారి నాలుగేసి ఉపగ్రహాల చొప్పున 9 విడుతలుగా భూమికి అతి తక్కువ దూరంలో లోయర్ ఎర్త్ లియో అర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు. అవన్నీ కక్ష్యలోకి చేరాయని, అంటార్కిటికా గ్రౌండ్‌స్టేషన్ నుంచి సిగ్నల్స్ అందాయని ఇస్రో ప్రకటించింది. వన్‌వెబ్ ఇండియా–1 పేరిట 2022 అక్టోబర్ 23న తొలి బ్యాచ్‌లో 36 ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించడం తెలిసిందే. తాజా ప్రయోగంతో మొత్తం 72 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపారు.

ఇస్రో స్థాయి పెరిగింది: చైర్మన్ సోమనాథ్

ప్రయోగం విజయవంతం కాగానే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో శాస్త్రవేత్తలు పరస్పరం అలింగనం చేసుకుని ఆనందం పంచుకున్నారు. రాకెట్‌లోని అన్ని దశలు అద్భుతంగా పనిచేసినట్టు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ చెప్పారు. ''ఇది టీం వర్క్. ప్రపంచంలోనే అద్భుతమైన విజయంతో ఇస్రో కీర్తి ప్రతిష్టలను పెంచినందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రయోగం చరిత్రాత్మకమైనది. దీనివల్ల ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల ప్రయోజనాలకు మరింత బలం చేకూరింది. ఇదే ఊపులో పీఎస్‌ఎల్‌వీ సీ55 రాకెట్ ద్వారా ఏప్రిల్‌లో సింగపూర్‌కు చెందిన ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నాం. ఈ ఏడాది చంద్రయాన్–3, ఆదిత్య–ఎల్1తో పాటు మరో నాలుగు ప్రయోగాలు చేసే అవకాశముంది'' అని చెప్పారు. వాణిజ్య ప్రయోగాలకు ఎల్‌వీఎం3 రాకెట్ ఎంతో ఉపయోగకారి అని న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సీఎండీ డి.రాధాకృష్ణన్, మిషన్ డైరెక్టర్ ఎస్.మోహన్‌కుమార్ చెప్పారు.

ఆత్మనిర్భరతకు తార్కాణం

ప్రధాని మోదీ అభినందనలు

వన్‌వెబ్ ఇండియా–2 ప్రయోగం దిగ్విజయం కావడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. ఇస్రోకు అభినందనలు తెలిపారు. ''వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల్లో అంతర్జాతీయంగా భారత్ పై చేయిని ఈ ప్రయోగం మరింత దృఢపరిచింది. ఆత్మనిర్భరత స్ఫూర్తిని ఎలుగెత్తి చాటింది'' అని ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు.

మళ్లీ పేట్రేగిపోయిన ఖలిస్తానీ మూకలు

అమెరికాలో భారత ఎంబసీపై దాడికి విఫలయత్నం



న్యూఢిల్లీ/వాషింగ్టన్: ఖలిస్తానీ మూకలు మళ్లీ పేట్రేగాయి. ఈసారి అమెరికాలో వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయాన్ని లక్ష్యం చేసుకున్నాయి. దానిపై దాడికి ఖలిస్తానీ మద్దతుదారులు చేసిన యత్నాన్ని సీక్రెట్ సర్వీస్ పోలీసులు విఫలం చేశారు. ఎంబసీ ఎదుట వారు హింసను ప్రేరేపించేలా ప్రసంగించారు. ఆ సమయంలో కార్యాలయంలో లేని దౌత్యాధికారి తరన్‌జిత్ సంధును బహిరంగంగానే బెదిరించారు! ఎంబసీ కిటికీలు, అద్దాలు పగులగొట్టేందుకు కర్రలను తెచ్చిపెట్టుకున్నారు. నిరసనలను కవర్ చేస్తున్న పీటీఐ ప్రతినిధినీ దూషించారు. ఆయన్ను నెట్టేస్తూ, ఖలిస్తానీ జెండా కర్రలతో కొట్టేందుకు ప్రయత్నించారు. దాంతో ఆయన పోలీసులకు ఫోన్ చేశారు. సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. త్రివర్ణ పతాకమున్న పోల్‌ను విరగ్గొట్టేందుకు చేసిన ప్రయత్నాలను వమ్ము చేశారు. ఈ ఘటనను భారత దౌత్య కార్యాలయం తీవ్రంగా ఖండించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత్ కాన్సులేట్, లండన్‌లోని భారత హైకమిషన్ వద్ద కూడా ఖలిస్తానీ మూకలు గొడవలకు దిగడం తెలిసిందే. కెనడాలోని తమ దౌత్య కార్యాలయాలు, కాన్సులేట్లపై తీవ్రవాద, వేర్పాటువాద శక్తుల దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కెనడా హైకమిషనర్‌కు సమన్లు జారీ చేసింది.

అవయవదానానికి ముందుకు రండి: మోదీ

న్యూఢిల్లీ: అవయవదానానికి ముందుకు రావాలని ప్రజలను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెరగడం సంతృప్తి కలిగిస్తోందన్నారు. ఆదివారం ఆయన 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడారు. 2013లో అవయవ దానాలు 5 వేల లోపే ఉండగా 2022లో 15వేలకు పెరగడం హర్షణీయమన్నారు. సౌర శక్తి వినియోగంలో దేశం దూసుకుపోతోందన్నారు. పలు రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందంటూ లోకో పైలట్ సురేఖా యాదవ్ పేరును ప్రస్తావించారు.

భోజ్‌పురి నటి ఆకాంక్ష దుబే ఆత్మహత్య



వారణాసి: ప్రముఖ భోజ్‌పురి నటి ఆకాంక్ష దుబే(25) ఆదివారం వారణాసిలోని ఓ హోటల్ గదిలో చనిపోయారు. యూపీలోని భదోహికి చెందిన ఆకాంక్ష ఓ సినిమా షూటింగ్ నిమిత్తం వారణాసి వచ్చారు. సార్‌నాథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో బస చేశారు. ఆదివారం ఉదయం ఆమె తన గది నుంచి బయటకు రాలేదు. దీంతో ఆమె సహచరుల సమక్షంలో హోటల్ సిబ్బంది గది తలుపులు తెరిచారు. గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. ఆమె అప్పటికే చనిపోయారు. ''ముంబైలో ఉంటున్న ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించాం. గదిలో ఎటువంటి సూసైడ్ నోట్ లభించలేదు'' అని పోలీసులు తెలిపారు.

బెలారస్‌లో అణ్వాయుధాలు: పుతిన్

మాస్కో: రష్యా తన వ్యూహాత్మక అణ్వాయుధాలను పొరుగున ఉన్న బెలారస్‌కు తరలించనుంది. ఈ మేరకు ఒప్పందం కుదిరిందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. 1990ల తర్వాత రష్యా తన కీలక ఆయుధ సంపత్తిని దేశం వెలుపలికి తరలించడం ఇదే తొలిసారి! దీనిపై ఉక్రెయిన్ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఐరాస అత్యవసరంగా సమావేశమై దీనిపై చర్చించాలని కోరింది.

సాక్షి 24|7 తమిళనాడు

TAMILNADU

సోమవారం | 27 | మార్చి | 2023

కీళడి మ్యూజియంలో ప్రవేశ రుసుము

– ఏప్రిల్ 1 నుంచి అమలుకు నిర్ణయం

అన్నానగర్: శివగంగై జిల్లా తిరుప్పువనం సమీపంలోని కీళడి మ్యూజియానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా ఈ మ్యూజియాన్ని సందర్శించే వారికి అధికారులు రుసుము నిర్ణయించారు. ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి వస్తుంది. విజిటర్ ఫీజు పెద్దలకు రూ.15, మైనర్లకు రూ.10, దేశీయ కేటగిరీలో విద్యార్థులకు రూ.5, పెద్దలకు రూ.50, విదేశీ డైనర్ కేటగిరీలో మైనర్లకు రూ.25గా నిర్ణయించారు. అలాగే సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీయడానికి రూ.30, వీడియో తీసేందుకు రూ.100 ఫీజు నిర్ణయించారు. కాగా ఇప్పటి వరకు ఈ మ్యూజియానికి వచ్చే సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉండేది. రద్దీ పెరగడంతో టికెట్ ధర నిర్ణయించినట్లు అధికారులు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్


ఐసీయూలో ఎమ్మెల్యే ఈవీకేఎస్



సాక్షి, చెన్నై : ఈరోడ్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే, సీనియర్‌నేత ఈవీకేఎస్ ఇళంగోవన్‌ను శాశ్వత సమస్యతో ఐసీయూలో అడ్మిట్ చేశారు. ఈరోడ్ తూర్పు నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు ఈనెల మొదటివారంలో వెలువడిన విషయం తెలిసిందే. ఇందులో ఈవీకేఎస్ విజయకేతనం ఎగురవేశారు. ఆ తదుపరి అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. 34 ఏళ్ల అనంతరం అసెంబ్లీకి ఆయన ఎన్నికైనా ఇంత వరకు సభలో అడుగు పెట్టలేదు. అనారోగ్యం బారిన పడటం, కరోనా నిర్ధారణ కావడం వంటి పరిణామాలతో ఆసుపత్రిలో చేరారు. రెండు రోజుల క్రితం తాను ఆరోగ్యంగా ఉన్నట్లు వీడియో కూడా విడుదల చేశారు. ఈ పరిస్థితులలో ఆదివారం ఉదయం ఆయనకు శ్వాస సమస్య తలెత్తింది. దీంతో ఆయన్ని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కరోనా నుంచి ఆయన కోలుకున్నారని అయితే శ్వాస సమస్య కారణంగా ఐసీయూలో ఉంచామని తెలిపారు. రెండు మూడు రోజులలో సాధారణ వార్డుకు మారుస్తామని వైద్యులు వెల్లడించారు.

నేడు డ్యాం పరిశీలన

– రంగంలోకి కేంద్ర నిపుణుల కమిటీ



ముల్లై పెరియార్ డ్యాం

సాక్షి, చెన్నై : ముల్లై పెరియార్ డ్యాం పరిశీలనకు కేంద్ర ప్రభుత్వ నిపుణుల కమిటీ సోమవారం రంగంలోకి దిగనుంది. సమగ్ర పరిశీలనానంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. వివరాలు.. కేరళ రాష్ట్రం ఇడిక్కిలోని ముల్లై పెరియార్ జలాశయంపై పూర్తి హక్కులు తమిళనాడుకు ఉన్న విషయం తెలిసిందే. ఈ జలాశయం నుంచి వచ్చే నీటిపైనే తేని, మదురై, విరుదునగర్, శివగంగై, రామనాథపురం జిల్లాలు ఆధారపడి ఉన్నాయి. ఇక్కడి ప్రజల సాగు, తాగు నీటి అవసరాలను ఈ జలాశయమే తీరుస్తోంది. ఈ డ్యాం నీటిమట్టం 142 అడుగులకు పెంచుకునే విధంగా గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. అయితే ఈ డ్యాం పటిష్టతపై తరచూ కేరళ పాలకులు అనుమానాలు వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. ఈ వ్యవహారంపై తరచూ సుప్రీంకోర్టు స్పందించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో జలాశయం పటిష్టత, సామర్థ్యం, పరిశీలన, పర్యవేక్షణ తదితర వ్యవహారాలు, వేసవిలో చేపట్టాల్సిన పనులు, జూన్‌లో నైరుతి రుతు పవనాల సీజన్ దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలపై కేంద్ర ప్రభుత్వం కమిటీ దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో కేరళ, తమిళనాడు అధికారులతో పాటు కేంద్ర నీటి పారుదల శాఖ ప్రధాన అధికారి కూడా ఉన్నారు. గత ఏడాది ఈ కమిటీ డ్యాంను పరిశీలించింది. మళ్లీ 10 నెలల అనంతరం సోమవారం మరోసారి పరిశీలనకు రెడీ అయ్యింది. కేంద్ర నీటి పారుదల శాఖ ఇంజినీరు విజయ్‌శరన్ నేతృత్వంలోని ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐఏఎస్ అధికారులు సందీప్‌సక్సేనా, సుబ్రమణియన్ ఉన్నారు. ఈ బృందం కేరళ అధికారులతో కలిసి డ్యాం, పరిసరాల్లో సమగ్ర పరిశీలనకు సోమవారం శ్రీకారం చుట్టనుంది.

సాగరంలో సరదాగా..!

అనంత జలరాశిలో ఆనందంగా విహరిస్తే.. నీలిరంగు నీటిలో పడవలపై రయ్యిమంటూ దూసుకెళ్తే.. తేలియాడే రెస్టారెంట్‌లో భోజనం చేస్తే.. ఆ మజానే వేరు. చెన్నై ప్రజలకు ఈ అనుభూతిని మరింతగా కలిగించేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ సిద్ధమైంది. ఇందుకోసం ఎన్నూర్ తీరాన్ని అధికారులు ఎంపిక చేశారు. పరిశీలన కూడా పూర్తవడంతో త్వరలో కొత్త బోటింగ్ హౌస్ కార్యరూపం దాల్చనుంది.



ముట్టుకాడు బోట్ హౌస్ వ్యూ



ఎన్నూర్ సముద్ర తీరం

- చెన్నైలో మరో బోటింగ్ హౌస్ రూపకల్పనకు కసరత్తు
- ఏర్పాట్లు చేస్తున్న పర్యాటక శాఖ
- ఎన్నూర్‌లో పరిశీలన పూర్తి
- ముట్టుకాడులో నీటిలో తేలియాడే హోటల్
- రూ. 5 కోట్లతో పనులు

సాక్షి, చెన్నై: చెన్నై నగర శివారులోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో (పర్యాటక శాఖ నేతృత్వంలో) ఇప్పటికే అతిపెద్ద బోటింగ్ హౌస్ ఉన్న విషయం తెలిసిందే. ముట్టుకాడు వద్ద ఉన్న ఈ బోటింగ్ హౌస్‌ను 1984లో సముద్ర ముఖ ద్వారం, బకింగ్ హాం కాలువలోని నీటిని ఆధారంగా చేసుకుని ఏర్పాటు చేశారు. ఇది చెన్నై అడయార్ నుంచి 23 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ 15 అత్యంత వేగవంతమైన బోట్లు, 27 సాధారణ, మరో 9 సైక్లింగ్ బోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడకు నిత్యం పర్యాటకుల రాక అధికంగానే ఉంటోంది. అందుకే ఈ బోట్‌హౌస్‌ను మరింత అభివృద్ధి పరిచే విధంగా రూ. 5 కోట్లతో 125 అడుగుల పొడవు, 25 అడుగుల వెడల్పుతో రెండు అంతస్తులతో నీటిపై తేలియాడే చిన్న పాటి నౌక తరహాలో లగ్జరీ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను కొచ్చిన్‌కు చెందిన గ్రాండ్ ట్యూనర్ మెరైన్ ఇంటర్నేషనల్ సంస్థ చేపట్టి ఉంది. ఈ పనులు ముగియగానే ఈ రెస్టారెంట్‌ను ప్రైవేటు వినోద కార్యక్రమాలకు సైతం కేటాయించేందుకు పర్యాటక శాఖ సిద్ధమైంది. అదే సమయంలో చెన్నై మెరీనా తీరంలో అత్యాధునిక హంగులతో సముద్ర తీరంలో బోట్ హౌస్ రూపకల్పన అసాధ్యమని అధికారులు తేల్చారు.

ఎన్నూర్ ఎంపిక..

చెన్నైలో అతిపెద్ద పర్యాటక బీచ్‌గా మెరీనా ఉన్న విషయం తెలిసిందే. దీనిని మరింత విస్తరించేందుకు కసరత్తులు సాగుతున్నాయి. మెరీనాకు ఇరువైపులా ఉన్న కాశిమేడు, ఎన్నూర్, బీసెంట్ నగర్, తిరువాన్మియూరు, కోవలం వరకు బీచ్‌లన్నింటినీ ఏకం చేసి పర్యాటకాన్ని మరింతగా తీర్చిదిద్దాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా పర్యాటక తాకిడి అధికంగా ఉండే మెరీనా తీరంలో సముద్ర విహారం కోసం బోట్ హౌస్‌కు సిద్ధమయ్యారు. అయితే అలల తీవ్రత వల్ల అది సాధ్యం కాదని నిపుణులు స్పష్టం చేశారు. ఇక్కడ సముద్ర విహారం శ్రమతో కూడుకున్న పనిగా తేల్చారు. పైగా ఇక్కడే రాజకీయ దిగ్గజాల సమాధులు ఉన్నాయి. అలాగే ఇప్పటికే ఇక్కడ చేపడుతున్న నిర్మాణాలకు వ్యతిరేకంగా కోర్టుల్లో పెద్దఎత్తున ప్రజా ప్రయోజన వాజ్యాలు దాఖలవుతున్నాయి. దీంతో అధికారులు కొత్త బోటింగ్ హౌస్ కోసం ఎన్నూర్ తీరాన్ని ఎంపిక చేశారు. వారం పాటు ఎన్నూరు, కాశీమేడు, మెరీనా తీరం వరకు సముద్రంలో విహరించేందుకు వీలుగా బోటు షికారు సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక పరిశీలన చేపట్టారు. మెరీనాలో కన్నా, ఎన్నూర్‌లో బోట్ హౌస్ ఏర్పాటు చేయడం ద్వారా అన్ని రకాల ఉపయోగం ఉంటుందని, ఆ పరిసరాలు సైతం అభివృద్ధి చెందుతాయని అధికారులు భావిస్తున్నారు. కన్యాకుమారిలో ఒడ్డు నుంచి వివేకానందరాక్, తిరువళ్లువర్ విగ్రహాలకు ఉన్నట్లుగానే పూంబుహార్ బోట్లను ఇక్కడి బోట్ హౌస్‌లో కొలువు దీర్చడం, అలాగే అత్యాధునిక హంగులతో మరిన్ని కొత్త బోట్లను రంగంలోకి దించేందుకు తగ్గ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. సమగ్ర నివేదిక ఆధారంగా చెన్నై మెట్రో డెవలప్ మెంట్ అథారిటీ తుది నిర్ణయం తీసుకోంది. ఆ తదుపరి పర్యాటక శాఖ పూర్తిస్థాయిలో దృష్టి పెట్టనుంది. ఇది కార్యరూపం దాల్చితే మెరీనా తీరం విస్తరణ, సుందరీకరణలో ఈ బోట్ హౌస్‌కు మరింత గుర్తింపు రావడం ఖాయం.



ముట్టుకాడులో పడవపై విహరిస్తున్న పర్యాటకులు



డబుల్ డెక్కర్ బోటు

పెద్దఎత్తున పడవ పోటీలు..

బోటు షికారే కాదు, సముద్ర తీరంలో పడవ పోటీలు సైతం ఇటీవల కాలంలో అధికారులు నిర్వహిస్తూ వస్తున్నారు. కొన్ని సైలింగ్ అసోసియేషన్లు, రాజకీయ పార్టీల నేతృత్వంలో, మద్రాసు బోట్ క్లబ్ నేతృత్వంలో ఈ పోటీలు సాగుతున్నాయి. ఈ పోటీలను మరింతగా విస్తరించాలని క్రీడా శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆదివారం 21 జాలర్ల గ్రామాల నుంచి రెండు చొప్పున ఎంపిక చేసి కోవళంలో పడవ పోటీలు నిర్వహించారు. మొత్తం 42 పడవలు సముద్రంలో దూసుకెళ్లాయి. ఈ కార్యక్రమానికి హాజరైన క్రీడల మంత్రి ఉదయ నిధి స్టాలిన్ మాట్లాడుతూ, మున్ముందు బోట్ క్లబ్‌లలో, సముద్ర తీరాలలో పడవ పోటీలను మరింతగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



కోవలం పడవ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు

ఆరులేన్ల రహదారిగా.. తూత్తుకుడి హార్బర్ మార్గం

- రూ. 200 కోట్లు కేటాయింపు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



తూత్తుకుడి హార్బర్

సాక్షి, చెన్నై: తూత్తుకుడి– హార్బర్ మార్గం సిక్స్‌వేగా విస్తరించనున్నామని కేంద్ర రహదారులు, హార్బర్ల శాఖ మంత్రి నితిన్‌గడ్కారీ ప్రకటించారు. ఇందుకోసం రూ. 200 కోట్లు కేటాయించామన్నారు. వివరాలు.. తమిళనాడు రాజధాని నగరం చెన్నై తదుపరి దక్షిణ తమిళనాడులోని జిల్లాలకు సరకుల రవాణాలో తూత్తుకుడి హార్బర్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడికి సింగపూర్, మలేషియా, శ్రీలంక, తదితర దేశాల నుంచి సరకుల కంటైనర్లతో నౌకల రాక పోకలు పెరిగాయి. అయితే హార్బర్ నుంచి జాతీయ రహదారికి వాహనాలు వెళ్లాలంటే పరిస్థితులు గగనంగా మారాయి. ఇరుకైన రోడ్డు, నగరంలోని మరి కొన్ని అనుసంధాన రోడ్ల ద్వారా జాతీయ రహదారిలోకి వాహనాలు వెళ్లాలంటే శ్రమతప్పడం లేదు. అలాగే నగరం, శివారు ప్రాంతాల్లో కంటైనర్ల రూపంలో ట్రాఫిక్ కష్టాలు నిత్యం ఎక్కువే. దీనిని పరిగణనలోకి తీసుకుని హార్బర్ నుంచి జాతీయ రహదారిని అనుసంధానించేందుకు సిక్స్‌వే మార్గం రూపొందించాలని పలుమార్లు కేంద్రానికి సీఎం స్టాలిన్ లేఖ రాశారు. అలాగే, డీఎంకే ఎంపీలు పార్లమెంట్‌లో కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఎట్టకేలకు తూత్తుకుడి వాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రహదారులు, హార్బర్ల శాఖమంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. హార్బర్ వరకు జాతీయ రహదారిని పొడిగించడమే కాకుండా, ఆ మార్గాన్ని సిక్స్‌వేగా విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం రూ. 200 కోట్లు కేటయించామని ట్విట్టర్ వేదికగా ఆదివారం ప్రకటించారు. 5.16 కి.మీ దూరం మేరకు ఈ మార్గాన్ని ఆరులేన్లుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

ఐపీఎల్ సందడి

- నేటి నుంచి టికెట్ల విక్రయాలు
- చేపాక్కం వద్ద భారీ బందోబస్తు



సాక్షి, చెన్నై: చెన్నైలో ఐపీఎల్ సీజన్ క్రికెట్ సందడి నెలకొంది. చేపాక్కం చిదంబరం స్టేడియంలో మ్యాచ్‌ల వీక్షణకు సోమవారం నుంచి ఆన్‌లైన్, కౌంటర్ల ద్వారా టికెట్లు విక్రయించనున్నారు. పెద్దఎత్తున అభిమానులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో చేపాక్కం స్టేడియంలోని కౌంటర్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. వివరాలు.. తమిళనాట క్రికెట్ అభిమానులకు కొదవలేదు. జాతీయ స్థాయి పోటీలతో పాటు ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకించేందుకు స్టేడియాలకు అభిమానులు పోటెత్తుతుంటారు. ముఖ్యంగా చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు తమదే అన్నట్లు అభిమానులు భావిస్తుంటారు. ఆ జట్టు ఆడే మ్యాచ్‌లను తిలకించేందుకు మరింత ఉత్సాహం చూపిస్తుంటారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. స్టేడియంలో పరుగుల వరద కురిపించేందుకు క్రికెటర్లు సిద్ధమవుతున్నారు. వీరిలో మరింత ఉత్సాహాన్ని నింపే విధంగా స్టేడియంలో కేరింతలు కొట్టేందుకు అభిమానుల సైతం రెడీ అయ్యారు. టీవీలలో వీక్షించడం కన్నా ప్రత్యక్షంగా మ్యాచ్‌లను చూసేందుకు సిద్ధంగా ఉన్న అభిమానుల కోసం సోమవారం నుంచి టికెట్లను విక్రయించనున్నారు. చెన్నై చేపాక్కం ఎంఏ చిదంబరం స్టేడియంలో 50 వేల మంది కూర్చునే అవకాశం ఉన్నా, 37 నుంచి 40 వేల లోపు టికెట్లను మాత్రమే ప్రేక్షకులకు కేటాయిస్తున్నారు. చెన్నైలో ఈసారి ఐపీఎల్ సీజన్‌లో 7 లీగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను వీక్షించే అభిమానుల కోసం టికెట్లను ఆన్‌లైన్ ద్వారా , నేరుగా కౌంటర్ల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి చేపాక్కం స్టేడియం ఆవరణలోని కౌంటర్లలో టికెట్లను విక్రయించనున్నారు. పెద్ద ఎత్తున అభిమానుల తరలి వచ్చే అవకాశాలతో ఆ పరిసరాలలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా క్యూలను సిద్ధం చేశారు. తోపులాటలు, వివాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తలు చేపట్టారు. పోలీసు యంత్రాంగం ఆ పరిసరాలలో గట్టి భద్రతా ఏర్పాట్లను చేసింది. ఈసారి టికెట్ల ధర రూ. 1500 నుంచి రూ. 3 వేల వరకు నిర్ణయించారు. అలాగే వీఐపీ క్లాస్ టికెట్లు మరింత ఎక్కువ ధర పలకనున్నాయి.

మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం



ఎంపీ రంజన్‌కుమార్ నేతృత్వంలో చెన్నై, అన్నానగర్‌లో సత్యాగ్రహ దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తిరువళ్లూరులో..

- ఎంపీ తిరునావుక్కరసర్ స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల సత్యాగ్రహ దీక్ష

సాక్షి, చెన్నై: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం సత్యాగ్రహ దీక్షను కాంగ్రెస్ నేతలు చేపట్టారు. తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ తిరునావుక్కరసర్ స్పష్టం చేశారు. మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సూరత్ కోర్టు తీర్పు వెలువరించడం, ఆ మరుసటి రోజే రాహుల్ గాంధీని ఎంపీ పదవి నుంచి తొలగిస్తూ అనర్హత వేటు వేయడం వంటి పరిణామాలు దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ వైఖరిని ఖండిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు నిరసనలు కొనసాగిస్తున్నారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, నగర కేంద్రాలలో సత్యాగ్రహ దీక్ష పేరిట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీపెరంబదూరు, చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, మదురై, ఈరోడ్, తిరుచ్చి, సేలం, తిరునల్వేలి, శివగంగై, తెన్‌కాశి, విరుదునగర్‌లో సత్యాగ్రహ దీక్షలు హోరెత్తాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు నిరసనలకు నేతృత్వం వహించారు. రాహుల్ గాంధీని ఎదుర్కొనే సత్తా లేకుండా దొడ్డి దారిన అనర్హత వేటు వేశారని ఎంపీలు శివాలెత్తారు. అదానీ వ్యవహారాన్ని పక్క దారి పట్టించేందుకే రాహుల్‌ను టార్గెట్ చేశారని మండిపడ్డారు. రానున్న ఎన్నికలలో ఓటమిని బీజేపీ ముందే గ్రహించినట్లుందని, అందుకే ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవడం కోసం రాహుల్‌ను ఎన్నికల కదన రంగంలో నుంచి తప్పించే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, చెన్నైలో జరిగిన నిరసనలో కాంగ్రెస్ ఎంపీ తిరునావుక్కసర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్‌లో కూర్చుని ఇక, తాము చేసేది ఏముందని, ఎంపీలందరూ రాజీనామాకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. తమ నాయకుడిని ప్రత్యక్షంగా ఎదుర్కొనే ధైర్యం లేక, కుట్రలతో ముందుకెళ్తున్నారని, పార్లమెంట్‌వేదికగా ప్రజాస్వామ్యాన్ని పాతి పెట్టేశారని మండి పడ్డారు. అందుకే తామంతా రాజీనామా చేయడానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

తిరువళ్లూరు: రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలు శిక్షతో పాటు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ దశల వారీగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్యాగ్రహ పోరాటాన్ని నిర్వహించారు. తిరువళ్లూరు కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జాన్, జిల్లా అధ్యక్షుడు చిదంబరం హాజరై ప్రసంగించారు. ప్రధాని మోదీని విమర్శించారనే నెపంతో తప్పుడు కేసు నమోదు చేసి కక్షపూరితంగా వ్యవహరించడం తగదన్నారు. రాహుల్‌గాంధీపై తీసుకున్న చర్యలను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో ఆ పార్టీ నేతలు మోహన్‌దాస్, ఏకాటూరు ఆనందన్, శివకుమార్, రఘురామన్, మధుసూదనరావ్, యశోద తదితరులు పాల్గొన్నారు.

మదురై మెట్రో పనులకు శ్రీకారం

- నివేదిక సమర్పణకు ఒప్పందాలు ఖరారు

సాక్షి, చెన్నై : మదురై మెట్రో రైలు పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈమేరకు సమగ్ర పరిశీలన అనంతరం నివేదిక సమర్పణకు ఆదివారం ఒప్పందాలు ఖరారయ్యాయి. వివరాలు.. చెన్నైలో ప్రస్తుతం రెండు మార్గాలలో మెట్రో రైలు సేవలు అందుతున్న విషయం తెలిసిందే. ఈ సేవలకు రోజురోజుకూ విపరీతమైన స్పందన వస్తోంది. దీంతో రెండో దశలో మరో మూడు మార్గాల్లో పనులు వేగవంతం చేశారు. అలాగే మెట్రో సేవలను కోయంబత్తూరు, మదురై నగరాలకు విస్తరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కోయంబత్తూరులో అవినాశి నుంచి కరుమత్తం పట్టి మీదుగా సత్యమంగళం వరకు మెట్రో సేవల కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించారు. తాజాగా మదురై మెట్రో పనులపై దృష్టి సారించారు. ఈ పనులకు ఇప్పటికే అసెంబ్లీలో ప్రభుత్వం రూ. 8,500 కోట్లను కేటాయించింది. దీంతో పనుల పై మెట్రో యాజమన్యం దృష్టి పెట్టింది. మదురైలో మెట్రో పనులపై సమగ్ర పరిశీలన, సాధ్యాసాధ్యాలు, రూట్‌మ్యాప్, రైల్వే స్టేషన్ నిర్మాణాలు తదితర అన్ని రకాల అంశాలతో నివేదిక సమర్పించేందుకు ఓ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఆర్‌వీ అసోసియేట్స్ పేరిట ఉన్న ఈ సంస్థకు కొత్తగా పనులను అప్పగిస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ ఇందుకోసం 1.35 కోట్లను కేటాయించారు. త్వరితగతిన ఈ సంస్థ పరిశీలన జరిపి నివేదికను సమర్పించనుంది.



మెట్రో రైలు

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరువళ్లూరు: చెన్నై గోల్డెన్ భారత్ లయన్స్‌క్లబ్ ఐసీ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఆదివారం తిరువళ్లూరులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్దకుప్పం తదితర ప్రాంతాల నుంచి సుమారు 300 మంది హాజరై కంటి పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. ఈ వైద్యశిబిరాన్ని అన్నాడీఎంకే ఓపీఎస్ వర్గం నేతలు వీరరాఘవన్, ఆయగినియన్, ప్రవీణ్‌కుమార్, లోకరంగన్, అరుణ్‌పాండ్యన్ తదితరులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎంకే కౌన్సిలర్లు కమలి, ఆనంది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదురంగపట్నం వాసుల గగ్గోలు

సాక్షి, చెన్నై: రెవెన్యూ అధికారుల నిర్వాకంతో చదురంగ పట్నం వాసులు స్థలాలు విక్రయించలేక, కొత్త ఇళ్లు నిర్మించుకోలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు వారి సమస్యలను పట్టించుకోకపోవడంతో వారు పోరాటాలకు సిద్ధమవుతున్నారు. వివరాలు.. చెంగల్‌పట్టు జిల్లా కల్పాకం సమీపంలో చదురంగ పట్నం గ్రామం ఉంది. ఇది పురాతన గ్రామం. ఇక్కడ 2,700 గృహాలున్నాయి. 16 వేల మంది ప్రజలు నివాసం ఉన్నారు. ఇక్కడ వక్ఫ్‌బోర్డుకు ఉన్న ఎకరం స్థలం రూపంలో రెవెన్యూ అధికారులు సృష్టించిన గందరగోళం స్థానికులను ఇరకాటంలో పడేసింది. స్థలాలు కొనుగోలు చేయలేక, అమ్మలేక, కొత్త ఇళ్లు నిర్మించుకోలేక గగ్గోలు పెడుతున్నారు. రెవెన్యూ అధికారులు తమ పొరపాటు కారణంగా ఇక్కడి స్థలాలన్నీ వక్ఫ్‌బోర్డుకు చెందినట్టుగా గెజిట్‌లో ప్రకటించడమే అసలు సమస్యకు కారణంగా మారింది. దీంతో ఇక్కడున్న మైనారిటీలు, గ్రామ ప్రజలు, పంచాయతీ పాలక మండలి చెంగల్పట్టు జిల్లా యంత్రాంగాన్ని సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించేందుకు సిద్ధమయ్యారు. అధికారులు స్పందించని పక్షంలో పోరాటాలకు కార్యాచరణ సిద్ధం చేశారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన ఎకరం స్థలానికి సంబంధించిన సమగ్ర వివరాలు తమ వద్ద ఉన్నాయని, వాటన్నింటినీ అధికారులకు సమర్పిస్తామని గ్రామ పెద్దలు ఆదివారం మీడియాకు వివరించారు. ఎకరం స్థలాన్ని గెజిట్‌లో పేర్కొనే సమయంలో పొరబాటున 27 ఎకరాలు అని రెవెన్యూ అధికారులు ప్రకటించడం గందరగోళానికి దారి తీసిందని వారు పేర్కొంటున్నారు.

న్యాయవాదుల తీరు ఆదర్శంగా ఉండాలి

తిరువళ్లూరు: కోర్టు ఆవరణలో న్యాయవాదుల తీరు ఆదర్శంగా ఉండాలని మంత్రి నాజర్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా పట్రపెరంబదూరులోని డాక్టర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఆవరణంలో జాతీయ మోడల్ కోర్టు పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేసే కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కయల్‌విళి అధ్యక్షత వహించగా విశిష్ట అతిథిలుగా ఎంపీ గిరిరాజన్, ఎమ్మెల్యేలు తిరుత్తణి చంద్రన్, వీజీ రాజేంద్రన్, కృష్ణస్వామి తదితరులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి నాజర్ హాజరై ప్రసంగిస్తూ డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయవాదుల సంక్షేమ బోర్డు ద్వారా అందించే నిధిని రూ.7 నుంచి రూ. 10 లక్షలకు పెంచినట్లు వివరించారు. బార్ కౌన్సిల్‌కు సైతం డిపాజిట్ నిధుల నుంచి రూ. 20 కోట్లు కేటాయించారని తెలిపారు. అయితే న్యాయవాదులు కోర్టు ఆవరణం, బయట హుందాగా వ్యవహించాలన్నారు. అనంతరం మోడల్ కోర్టు పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మూర్తి, ఏపీపీ రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న మంత్రి నాజర్, ఎంపీ గిరిరాజన్, ఎమ్మెల్యేలు

వైభవంగా తీర్థీశ్వరుడి తిరుకల్యాణం



తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

తిరువళ్లూరు: ప్రసిద్ధి చెందిన శ్రీ త్రిపుర సుందరి సమేత తీర్థీశ్వరుడి ఆలయ పంగుణి బ్రహ్మోత్సవాలో భాగంగా స్వామి వారి తిరుకల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తిరువళ్లూరు పట్టణంలో పురాతన ప్రసిద్ధి చెందిన త్రిపుర సుందరి సమేత తీర్థీశ్వరుడి ఆలయం ఉంది. సుమారు 1000 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని ఇటీవల పునరుద్ధరించి కుంభాభిషేకం నిర్వహించారు. కాగా ఆలయంలో ఏటా పంగుణి ఉత్సవాలను 12 రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల్లో రోజూ ప్రత్యేకం వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి త్రిపుర సుందరి సమేత తీర్థీశ్వరుడికి తిరుకల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు అమ్మవారితో కలిసి అశ్వవాహనంలో మాడవీధుల్లో దర్శనమిచ్చారు. తిరుకల్యాణ ఉత్సవంలో పాల్గొంటే వివాహ దోషాలు తొలగుతాయనే నమ్మకం భక్తుల్లో ఉండడంతో పెద్దఎత్తున యువత పాల్గొన్నారు. కాగా భక్తులకు అన్నదానంతో పాటు మంగళసూత్రాలను ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు.

ఘనంగా విశ్వశోభ – 2023 వేడుకలు



ఉగాది పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు, అతిథులు

– విభిన్న రంగాల వారికి పురస్కారాలు ప్రదానం

కొరుక్కుపేట: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా)- తమిళనాడు శాఖ, అన్నానగర్ ఆర్య వైశ్య సంఘం, క్రోమ్ పేట ఆర్యవైశ్య మహాసభ, అడయార్ ఆర్యవైశ్య అసోసియేషన్ సంయుక్తంగా కలిసి విశ్వశోభ-2023 పేరుతో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. దీనికి పుదుపేటలోని నాదముని హాల్ వేదికైంది. అవోపా అధ్యక్షుడు టి.జి. శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జయరాజ్ గ్రూప్ చైర్మన్ టి.రాజశేఖర్, అజంతా శంకరరావు, సి.వి సుబ్బారావు, గోపురం వై.వి.హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న రంగాల్లో రాణిస్తున్న వారికి ఉగాది, జీవిత సాఫల్యం పురస్కారాలను ప్రదానం చేశారు. ఉగాది పురస్కారాలు అందుకున్న వారిలో బ్లడ్ డోనర్ టి.ఆర్.అభినవ్ కృష్ణ, క్రీడాకారిణి ఎం.నివేధిత, కళాకారిణి అండ్ థెరపిస్ట్ బి.వరలక్ష్మి, రిటైర్డ్ కస్టమ్స్ అధికారి సి.సురేంద్ర కుమార్, యువ పైలెట్ కెప్టెన్ కె.సుదర్శన్ మూర్తి ఉన్నారు. జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న వారిలో సామాజిక సేవకులు నేతా మునిరత్నం ఉన్నారు. కార్యక్రమ నిర్వహణ సెక్రటరీ సి.రంగనాథం చెట్టి చేయగా, అతిథులను, అవార్డు గ్రహీతలను జాయింట్ సెక్రటరీ ఏ.సుధాకర్, కోశాధికారి పి.రాధాకృష్ణ సభకు పరిచయం చేశారు. ఎన్.గోవింద రాజులు, డాక్టర్ కె.బాలగురునాథం, ఎం.కాశి విశ్వనాథం, పి.కృష్ణమూర్తి, ఎస్.వి.ప్రసాదరావు, జి.రవికుమార్, అంకం శ్రీనివాసులు, ఎ.జగన్ మోహన్, కే.కె త్రినాథ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతీయులకు రిజర్వేషన్ ఆరు శాతానికి పెంచాలి



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కొత్త కార్యవర్గ సభ్యులు

కొరుక్కుపేట: రాష్ట్ర ప్రభుత్వం అరుంధతీయులకు అందిస్తున్న రిజర్వేషన్లను 6 శాతానికి పెంచాలని ఎమ్మార్పీఎస్ తమిళనాడు రాష్ట్ర నూతన అధ్యక్షుడు కర్రా లోకేష్ కుమార్ కోరారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఉత్తర్వుల మేరకు ఎమ్మార్పీఎస్ తమిళనాడు రాష్ట్ర నూతన కమిటీని శనివారం రాత్రి చెన్నై ఎగ్మోర్‌లోని జీవన జ్యోతి హాలులో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కర్రా లోకేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కావలి సుకుమార్, కోశాధికారి బక్కా పాల్ నియమితులయ్యారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యులు, ప్రిసీడియం చైర్మన్‌గా ఎం.ఎం కొండయ్య, ఉపాధ్యక్షులుగా ఇరకట్ల నాగభూషణం, కొదమల చిన్నయ్య, మొద్దు బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవ సహాయం, సహాయ కార్యదర్శిగా డి.వై శ్రీనివాసులు, అధికార ప్రతినిధులుగా కన్నెమరకల కుమార్, వల్లేరు విశ్వప్రసాద్, ఎంఈఎఫ్ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పందిటి ఆదిలక్ష్మణ్, అధ్యక్షులుగా బి.వసంతరావు, ప్రధాన కార్యదర్శిగా కెసికొండయ్య, సహాయ కార్యదర్శిగా గోపి, కోశాధికారిగా ఎస్.ఆనందరావు ఎంపికయ్యారు. అనంతరం కొత్త అధ్యక్షుడు కర్రా లోకేష్ కుమార్ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహించారు. అరుంధతీయులను అడుగడుగునా కించపరుస్తున్న సీమాన్‌కు వ్యతిరేకంగా ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న పెంపుడు జంతువుల ప్రదర్శన



తమ పెంపుడు కుక్కలతో యజమానులు



తిరువొత్తియూరు: చెన్నై నందనం వైఎంసీఏ మైదానంలో ఆదివారం నిర్వహించిన పెంపుడు జంతువుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో డాబర్‌మెన్, లేప్‌డార్, గోల్డెన్ డ్రైవర్, స్పిటిల్, బొమరియన్‌ల తదితర విదేశీ జాతికి చెందిన కుక్కలు, స్వదేశీ జాతికి చెందిన వివిధ రకాల జంతువులను యజమానులు తీసుకొచ్చారు. కాగా పెంపుడు జంతువులను విన్యాసాలను చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు.

యువకుడి అనుమానాస్పద మృతి




కామరాజ్ (ఫైల్)

తిరుత్తణి: వ్యవసాయ బావిలో తేలియాడుతున్న యువకుడి మృతదేహాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తిరుత్తణి శివార్లలోని అమృతాపురం వద్ద వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికుల ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన కామరాజ్ (45) తిరుత్తణి గాంధీరోడ్డుకు చెందిన అన్నాడీఎంకే నాయకుడు కుప్పుస్వామి బంధువని పోలీసుల దర్యాప్తులో తేలింది. అయితే అతను ఆత్మహత్య చేసుకున్నాడా..? లేదా హత్యకు గురయ్యాడా..? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరగాట్టుకారన్ చిత్రానికి సీక్వెల్?

తమిళ సినిమా: ప్రస్తుతం కోలీవుడ్లో సీక్వెల్స్, రీమేక్‌ల ట్రెండ్ నడుస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికే మణిరత్నం దర్శకత్వం వహించిన పొన్నియిన్ సెల్వన్‌- 2 చిత్రం ఏప్రిల్ 28వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. అదేవిధంగా సూరి కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం విడుదలై చిత్రం ఈ నెల 31న తెరపైకి రానుంది. దీనికి రెండవ భాగం కూడా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. కాగా చాలా కాలం క్రితం విడుదలైన కాసేదాన్ కడవులడా చిత్రాన్ని మిర్చి శివ కథానాయకుడుగా రీమేక్ చేశారు. ఇది ఇటీవలే విడుదలైంది. కాగా నటుడు రామరాజన్, కనక జంటగా నటించిన చిత్రం కరగాట్టుకారన్. నటుడు గౌండ్రమణి, సెంథిల్, కోవై సరళ ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతాన్ని అందించారు. ఆయన సోదరుడు గంగైఅమరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1989లో సంచలన విజయం సాధించింది. ఆ చిత్రంలోని పాటలు ఇప్పటికీ మారుమోగుతూనే ఉన్నాయి. నటుడు గౌండ్రమణి, సెంథిల్‌ల హాస్య సన్నివేశాలు అప్పట్లో ట్రెండింగ్ అయ్యాయి. అంతే కాకుండా ఏడాదికి పైగా థియేటర్లలో ప్రదర్శింపబడిన చిత్రం అది. కాగా ఇప్పుడు ఆ చిత్రం సీక్వెల్ తెరకెక్కించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తాజా సమాచారం. దీనికి గంగైఅమరన్ తనయుడు ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దర్శకత్వం వహించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రామరాజు నటించిన పాత్రలో మిర్చి శివ నటిస్తున్నట్లు, యువన్ శంకరాజా దీనికి సంగీతాన్ని అందించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సమాచారం.



దర్శకుడు వెంకట్ ప్రభు

కోలీవుడ్ టాక్స్

సూపర్ స్టార్‌ను డైరెక్ట్ చేయడమే లక్ష్యం

తమిళ సినిమా: మలేషియాకు చెందిన దర్శకుడు టి.సూర్యవేలన్ దర్శకత్వం వహించి కథానాయకుడిగా నటించిన టీవీ సీరియల్ నామ్. ఈయన స్టీఫెన్ జక్రియా, అజ్మల్ దాసన్‌తో కలిసి దీన్ని నిర్మించారు. ఐదుగురు సంగీత కళాకారులు కలిసి తమ ప్రతిభను నిరూపించుకుని విజయం సాధించడమే ఈ సీరియల్ ప్రధాన ఇతివృత్తం. ఈ సీరియల్ 2020లో ప్రసారమై విశేష ప్రేక్షకాదరణ పొందిందని దర్శకుడు నటుడు టి.సూర్యవేలన్ తెలిపారు. కాగా తాజాగా దానికి సీక్వెల్‌గా రూపొందించిన వెబ్ సిరీస్ నామ్‌- 2 అని తెలిపారు. ఆ సీరియల్ విజయం సాధించడంతో నామ్‌- 2 వెబ్ సిరీస్ రూపకల్పన తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. అయితే దాని సమర్థవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. అదేవిధంగా దీనికి ఒక సరికొత్త నేపథ్యం ఉండాలని భావించామన్నారు. దీంతో సింగపూర్ సమీపంలో రుద్రాండ అనే ఒక కల్పిత దీవిని సృష్టించినట్లు చెప్పారు. ఒక దీవిలో సర్వాధికారాలతో పాలించే వారి బారి నుంచి పురుషులు, స్త్రీలు తమ స్వేచ్ఛ కోసం ఎలా పోరాడారు? అన్న కల్పిత కథతో రూపొందించిన వెబ్ సిరీస్ ఇది అన్నారు. కాగా ఇది ప్రేక్షకుల మధ్య మంచి ఆదరణ పొందుతుందని నమ్మకం ఉందన్నారు. ఇటీవలే నెట్ ఫిక్స్‌లో విడుదలై స్ట్రీమింగ్ అవుతున్న ఈ వెబ్ సిరీస్ ఏప్రిల్ వరకు ప్రసారం అవుతుందన్నారు. కాగా నామ్ టీవీ సీరియల్‌తో దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఈ దర్శక నటుడు తన ఇష్టమైన నటుడు సూపర్ స్టార్ రజినీకాంత్‌ను డైరెక్ట్ చేయడమే తన లక్ష్యం అని పేర్కొన్నారు. కాగా టి.సూర్యవేలన్ ఇటీవల నటుడు రజనీకాంత్ ను కలిసి ఆశీస్సులను అందుకున్నారు.



రజనీకాంత్‌తో సూర్యవేలన్



రేసర్ చిత్రంలో ఓ సన్నివేశం

బైక్ రేసర్ హీరోగా కొత్త చిత్రం

తమిళ సినిమా: బైక్ రేసర్ అఖిల్ సంతోష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం రేసర్. హస్టలర్ ఎంటర్‌టైన్ పతాకంపై కార్తీక్ దయాస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బుల్లితెర నటి లావణ్య కథానాయకిగా పరిచయం అవుతోంది. నటుడు ఆరుబాలా, ద్రౌపతి సుబ్రమణియం తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

సతీష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రభాకర్ ఛాయా గ్రహణం, భరత్ సంగీతాన్ని అందిస్తున్నారు. దీనికి ప్రధాన్ మీడియా వర్క్స్ సంస్థ అధినేత సంతోష్ కృష్ణమూర్తి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. దీని గురించి దర్శకుడు తెలుపుతూ ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన యువకుడు బైక్ రేసర్‌గా కప్పు గెలవాలనే లక్ష్యంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. చివరికి అతని లక్ష్యం నెరవేరిందా? లేదా అన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం అన్నారు. చెన్నై, పుదుచ్చేరి, ఏర్కాడు ప్రాంతాల్లో ఈ చిత్ర షూటింగ్ నిర్వహించి పూర్తి చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ఈ చిత్రం కోసం పుదుచ్చేరిలో భారీ బైక్ రేస్ కోసం ట్రాక్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిజంగా బైక్ రేసర్ ఇందులో హీరోగా నటించడంతో చిత్రం చాలా రియలిస్టిక్‌గా ఉంటుందని చెప్పారు. చిత్రంలో బైక్ రేస్ పోటీలు, యాక్షన్ సన్నివేశాలు ఆసక్తికరంగా ఉంటాయన్నారు.



శివ కార్తికేయన్

చలో కశ్మీర్?

తమిళ సినిమా: ప్రిన్స్ చిత్రం దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న నటుడు శివకార్తికేయన్ కొత్త చిత్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మావీరన్ చిత్రంలో నటిస్తున్నారు. మడోనా అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగులోనూ మహావీరుడు పేరుతో విడుదలకానుంది. దర్శకుడు శంకర్ వారసురాలు అతిథి శంకర్ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. దీంతో శివకార్తికేయన్ తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. దీన్ని కమలహాసన్ తన రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్నారు. ఇది శివకార్తికేయన్ 21వ చిత్రం కావడం గమనార్హం. ఇందులో సాయి పల్లవి నాయకిగా నటించనుంది. రాజకుమార్ పెరియసామి కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించనున్నారు. కాగా ఈ చిత్రం షూటింగ్‌ను వచ్చే నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా తొలి షెడ్యూల్‌ను కశ్మీర్‌లో చిత్రీకరించాలని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే అక్కడ ఇటీవల స్వల్ప భూకంపం వచ్చి కశ్మీర్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ విజయ్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న లియో చిత్రం షూటింగ్ జరుపుకున్న విషయం తెలిసిందే. అయితే భూకంపం కారణంగానే లియో చిత్ర యూనిట్ హడావుడిగా షూటింగ్‌ను ముగించుకుని చెన్నైకు తిరిగొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో శివకార్తికేయన్ నటించనున్న చిత్రాన్ని అక్కడ షూటింగ్ నిర్వహించడానికి ముందు అక్కడ వాతావరణం గురించి లియో చిత్రం దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌ను అడిగి తెలుసుకుని ఆ తరువాత కాశ్మీర్‌లో షూటింగ్ నిర్వహించాలా? లేదా? అన్నది నిర్ణయించనున్నట్లు సమాచారం.



నటి సాయి పల్లవి



నటి నయనతార

మరోసారి అందాల ఆరబోతకు..

తమిళ సినిమా: కథానాయకలు బికినీ దుస్తుల్లో అందాలు ఆరబోయడం కొత్తేమీ కాదు. అలా అగ్ర కథానాయకగా రాణిస్తున్న నయనతార కూడా ఇంతకుముందు బికినీ దుస్తుల్లో ప్రేక్షకులకు కనువిందు చేశారు. అజిత్ సరసన నటించిన బిల్లా, విజయ్‌తో జతకట్టిన విల్లు చిత్రాల్లో ఈ భామ అందాల మోత మోగించారు. కాగా ప్రస్తుతం నయనతార బాలీవుడ్లో షారుక్ ఖాన్ సరసన నటిస్తున్న విషయం తెలిసిందే. దీనికి జవాన్ అనే టైటిల్ నిర్ణయించారు. దీన్ని కోలీవుడ్ యువ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. కాగా షారుక్ ఖాన్ దీపికా పదుకొనే జంటగా నటించిన హిందీ చిత్రం పఠాన్ ఇటీవల విడుదలై సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఆ చిత్రంలో దీపిక పదుకొనే శృతి మించి బికినీ దుస్తుల్లో అందాలు ఆరబోసి నటించిందనే విమర్శలను ఎదుర్కొంది. అయితే ఆ చిత్రాన్ని ఆమె అందాల కోసమే కుర్రకారు ఎగబడి చూశారనే ప్రచారం కూడా జరిగింది. ఏదేమైనా బాలీవుడ్లో హీరోయిన్లు బికినీ దుస్తుల్లో నటించటం పరిపాటే. ఒకప్పుడు హాలీవుడ్లో ఆ తర్వాత బాలీవుడ్‌లో ఉన్న ఆ సంస్కృతి ఇప్పుడు దక్షిణాది సినిమాలకూ వ్యాపించింది. నయనతార నటిస్తున్నది హిందీ చిత్రం కావడంతో జవాన్‌లోనూ ఆమె బికినీ దుస్తుల్లో నటిస్తున్నట్లు తాజా సమాచారం. అప్పట్లో బిల్లా చిత్రంలో బికినీ దుస్తుల్లో నటించిన నయనతార చాలా గ్యాప్ తర్వాత అదీ పెళ్లయిన తర్వాత కూడా యువతను అలరించడానికి సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే జవాన్ చిత్రంలో నయనతార బికినీ దుస్తుల్లో నటిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజమెంత అన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్సే.

క్లుప్తంగా

విధులను బహిష్కరిస్తే వేతనం కట్

• ఉద్యోగులకు హెచ్చరిక

సాక్షి, చెన్నై : విధులు బహిష్కరించి పోరు బాట పట్టిన పక్షంలో జీతాలు కట్ చేస్తామని ఉద్యోగులకు గ్రామీణాభివృద్ధి శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 30వ తేదీన అసెంబ్లీలో గ్రామీణాభివృద్ధి శాఖకు నిధుల కేటాయింపులపై చర్చ జరగనుంది. ఇదే రోజున ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా విధుల బహిష్కరణకు నిర్ణయం తీసుకున్నారు. సెలవుపై వెళ్లి పోరాటాలతో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సమాచారంతో గ్రామీణాభివృద్ధి శాఖ అప్రమత్తమైంది. సెలవు పెట్టినా, పోరాట బాట పట్టినా జీతంలో కోత తప్పదని, దయ చేసి ఆందోళన వీడాలని ఆదివారం ఆ శాఖ ఉన్నతాధికారులు హెచ్చరికలతో కూడిన ఉత్తర్వులు జారీ చేశారు.

11కు చేరిన మృతుల సంఖ్య

తిరువొత్తియూరు: కాంచీపురం సమీపంలోని బాణసంచా కర్మాగారంలో పేలుడు ప్రమాదంలో మృతుల సంఖ్య 11కు చేరింది. తీవ్ర గాయాలైన 16 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాంచీపురం, కురివిమలై వసంత నగర్ ప్రాంతంలో టపాసుల తయారీ కర్మాగారం ఉంది. ఇక్కడ 30 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. గత 22వ తేదీన కార్మికులు కర్మాగారంలో పని చేస్తుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో హఠాత్తుగా గోడౌన్‌లో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అదే చోట మృతి చెందారు. 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని కాంచీపురం, చెన్నై కీల్పాకం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్చారు. చికిత్స పొందుతూ మహిళ సహా 9 మంది మృతి చెందారు. ఈ క్రమంలో చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గజేంద్రన్ (50), జగదీశన్ (35) ఆదివారం మృతి చెందారు. ఈ క్రమంలో టపాసుల కర్మాగారంలో జరిగిన ప్రేలుడు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి సంఖ్య 11కు చేరింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తల్లికి నవజాత శిశువు అప్పగింత

అన్నానగర్: కిడ్నాప్‌కు గురైన నవజాత శిశువును పోలీసులు తల్లికి అప్పగించారు. తిరుపూర్‌లోని తారాపురం రోడ్డులోని సెరింకాడుకు చెందిన గోపి (34) బనియన్ కంపెనీలో ఇస్త్రీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య సత్య (30) తిరుపూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో 19వ తేదీన మగబిడ్డకి జన్మనిచ్చింది. వారం రోజులుగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సత్యను శనివారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కోసం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లారు. అప్పుడు 2 రోజులుగా సత్యకు సాయం చేసిన మహిళ ఆమె కుమారుడిని కిడ్నాప్ చేసింది. ఫిర్యాదు మేరకు తిరుపూర్ సౌత్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళ తిరుపూర్‌లోని ఇడువై ప్రాంతానికి చెందిన పాండియమ్మాళ్ (42)గా గుర్తించారు. ప్రత్యేక బృందం పోలీసులు ఇడువైకి వెళ్లి పాండియమ్మాల్‌ను అరెస్టు చేశారు. ఆమె నుంచి పసికందును రక్షించి సత్యకు అప్పగించారు.

ఆటో డ్రైవర్‌కు కత్తిపోట్లు

• బాలుడు సహా ఏడుగురి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్‌పాడిలో ఆటో డ్రైవర్‌ను కత్తులతో పొడిచిన బాలుడు సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై వ్యాసార్‌పాడి దామోదరన్ నగర్ 5వ వీధికి చెందిన మాయకృష్ణన్ (40) అద్దెకు ఆటో నడుపుతున్నాడు. శనివారం సాయంత్రం వ్యాసార్ పాడి జీవా రైల్వే స్టేషన్, గణేష్ పురం వద్ద నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఐదుగురు మాయకృష్ణన్‌తో వాగ్వాదానికి దిగా రు. కత్తులతో దాడి చేసి పారిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న ఓటేరి పోలీసు ఇన్‌స్పెక్టర్ జానీ చెల్లప్ప నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకుని మాయకృష్ణన్‌ను స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విచారణలో మాయకృష్ణన్ జీవా నగర్ ప్రాంతంలో ఆటో డ్రైవర్ల సంఘంలో సభ్యుడిగా లేడని, అతను తక్కువ ఛార్జీ లు తీసుకుని ప్రయాణికులను తరలిస్తున్నాడని తెలిసింది. ఈ క్రమంలో కొంతమంది అతనిపై దాడి చేసినట్టు గుర్తించారు. వ్యాసార్‌పాడి ప్రాంతానికి చెందిన ప్రకాష్ (25), మదన్ (23), అమర్‌నాథ్ (28), సతీష్ కుమార్ (28), సంజయ్ (21), ప్రేమ్‌నాథ్ (22) మరో 17 సంవత్సరాల బాలుడిని అరెస్టు చేశారు.

కావేరి వంతెనపై యువకుల హల్‌చల్

అన్నానగర్ : తిరుచ్చి చత్రం, శ్రీరంగంను కలిపే కావేరి వంతెనపై కొందరు యువకులు పగలు, రాత్రి తేడా లేకుండా ఖరీదైన హార్స్ పవర్ మోటార్ సైకిళ్లపై సాహసాలు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మెరుస్తున్న రోడ్డుపై టైర్లు ఎత్తి యాక్సిలరేటర్‌ను తిప్పుతూ చిలిపి చేష్టలకు దిగుతున్నారు. కొందరు వీడియోగా రికార్డు చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇటువంటి సాహసాలను కొత్త అరియలూర్-చిదంబరం రహదారిలో తిరుచ్చి-చెన్నై బైపాస్ వంతెన సమీపంలో, రద్దీగా ఉండే తిరుచ్చి మున్సిపల్ కార్పొరేషన్, చర్చి రోడ్ ప్రాంతాలలో చేస్తున్నారు. ఇలాంటి చర్యలను ఆపాలని, యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిభావాన్ని నింపిన రామదాసు కీర్తనలు


భక్త రామదాసు కీర్తనలు అలపిస్తున్న కిడాంబి లక్ష్మీకాంత్


కిడాంబి లక్ష్మీకాంత్‌ను సత్కరిస్తున్న తమ్మినేని బాబు, టీఆర్ఎస్ శర్మ

కొరుక్కుపేట: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక సంగీత గాయకులు కిడాంబి లక్ష్మీకాంత్ అలపించిన భక్త రామదాసు కీర్తనలు ఆద్యంతం భక్తి భావాన్ని నింపాయి. పెరంబూరు తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో అనన్య సామాన్య ధారావాహిక ఉపన్యాస కార్యక్రమంలో 95వ ప్రసంగం ఆదివారం సాయంత్రం జరిగింది. ఇందుకు పెరంబూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న డీఆర్‌బీసీసీ మహోన్నత పాఠశాల ప్రాంగణం వేదికైంది. రానున్న శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రి రామదాసు – సంగీతోపన్యాసం అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం చేపట్టారు. గాయకులు కిడాంబి లక్ష్మీకాంత్ భక్త రామదాసు చరిత్రను వివరిస్తూ వారి కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. ఇదిగో భద్రాద్రి, పలుకే బంగారమాయెనా, నను బ్రోవమని చెప్పవే, గరుడగమన రారా, తారకమంత్రము కోరిన దొరికెను వంటి భక్త రామదాసు కీర్తనలు ఆలపించారు. మృదంగం వాయిద్య సహకారాన్ని శ్రీముఖ్ అందించారు. స్వాగతోపన్యాసాన్ని సమితి కార్యదర్శి డాక్టర్ టి.ఆర్.ఎస్.శర్మ (శ్రీలక్ష్మీప్రియ) చేయగా సమితి అధ్యక్షులు తమ్మినేని బాబు వక్త లక్ష్మీకాంత్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే తెలుగు ప్రముఖులు కాసల నాగభూషణం, ఆంబ్రూణి, గుడిమెట్ల చెన్నయ్య, అరుణా శ్రీనాథ్, వంజరపు శివయ్య తదితరులు కూడా వక్తను శాలువాలతో సత్కరించారు. అరుణా శ్రీనాథ ప్రార్థనా గీతం అలపించగా, వందన సమర్పణను వసుంధర దేవి గావించారు.

రబ్బరు బోటు బోల్తాపడి ఆంధ్రా యువకుడి మృతి


మృతిచెందిన ప్రవీణ్


చెరువులో అగ్నిమాపక శాఖ సిబ్బంది గాలింపు


• బయటపడ్డ నలుగురు యువకులు

పళ్లిపట్టు: చెరువులో రబ్బరు బోటు బోల్తాపడి ఆంధ్రాకు చెందిన యువకుడు మృతిచెందగా మరో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన పళ్లిపట్టులో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలం బోలినాయుడుపల్లెకు చెందన రమేష్ కుమారుడు ప్రవీణ్ తండ్రి కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో అతని తల్లి విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. బీటెక్ వరకు చదువుకున్న ప్రవీణ్ విదేశంలో చదువుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. అతను ముగ్గురు స్నేహితులతో కలిసి పళ్లిపట్టు బస్టాండు సమీపంలోని చెరువుకట్ట వద్ద మద్యం తాగారు. అరక్కోణంకు చెందిన ఇద్దరు యువకులతో పరిచయం ఏర్పడింది. ఆరుగురు కలిసి చేపలు పట్టేందుకు వినియోగించే చిన్న రబ్బరు బోటు తీసుకుని చెరువులో షికారు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వారిలో ఒక వ్యక్తి ఈత రాదని బయటే ఉండిపోయాడు. ఈత రాకపోయినా ప్రవీణ్ వారితో బోటులో వెళ్లాడు, చెరువు మధ్యలో బోటు బోల్తాపడింది. నలుగురికి ఈత రావడంతో కట్ట వద్దకు చేరుకున్నారు. ప్రవీణ్ చెరువులో మునిగిపోయాడు. భయాందోళన చెందిన అరక్కోణం నుంచి వచ్చిన యువకులు పరారయ్యారు. అతనితో వచ్చిన యువకులు మాత్రం కేకలు వేయడంతో స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు గాలింపు చేపట్టారు. అరక్కోణం నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకున్న కొంతసేపటికి చెరువు లోపలి నుంచి ప్రవీణ్ మృతదేహం తేలింది. మృతదేహాన్ని తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రవీణ్ మృతితో తల్లి, బంధువుల రోదనలు మిన్నంటాయి.

విశ్రాంత కోర్టు ఉద్యోగి ఇంటిలో 100 సవర్ల నగల చోరీ

తిరువొత్తియూరు: తిరువారూరు జిల్లాలో విశ్రాంత కోర్టు ఉద్యోగి ఇంటిలో 100 సవర్ల నగలు చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరువారూర్ జిల్లా నీడామగళం సమీపంలోని ఆదనూర్ మండపం మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్న గురుమూర్తి (66) తంజై కోర్టులో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. వివాహమై బయట ఊర్లలో ఉంటున్నారు. తన కుమార్తెలకు కట్నంగా ఇచ్చిన 50 సవర్లు, మరో 50 సవర్ల నగలు ఇంటిలో ఉన్నాయి. 17వ తేదీన ఆయన భార్యతో కలిసి కలైసెల్వితో కలిసి పుదుకోటైలో ఉన్న తన చిన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. గురుమూర్తి శనివారం ఉదయం 11 గంటలకు తన ఇంటి వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల పరిశీలించగా బీరువాలో ఉంచిన 100 సవర్ల నగలు, రూ.3 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. నీడా మంగళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి రూ.40 లక్షల విలువ చేసే నగలు, నగదును చోరి చేసిన గుర్తు తెలియని దుండగుల కోసం గాలిస్తున్నారు.

తిరుపరంకుండ్రంలో పంగుణి ఉత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణం చేస్తున్న శివాచార్యులు

తిరువొత్తియూరు: తిరుపరంకుండ్రం సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆదివారం పంగుణి ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 9న రథోత్సవం జరుగుతుంది. ఆరుపడై వీడుగల్‌లలో మొదటిదైన తిరుపరంకుండ్రం సుబ్రమణ్య స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం పంగుణి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరానికి పంగుణి ఉత్సవాలు ఆదివారం ఉదయం 8.15 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా సుబ్రమణ్యస్వామి, దేవయాని ఉత్సవ మూర్తులకు, ధ్వస్తంభానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. దేవయాని సమేత సుబ్రమణ్య స్వామి ఉదయం బంగారు సప్పరంలోను, సాయంత్రం భూత వాహనం, హంస, స్వర్ణ, మయూరం, అశ్వ, శేష వాహనాలలో నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఏప్రిల్ 7వ తేదీ సాయంత్రం పట్టాభిషేకం, 8వ తేదీన ఉదయం కల్యాణోత్సవం చేపడతారు. ఇందులో మదురై నుంచి మీనాక్షి సుందరేశ్వరర్ స్వామి పాల్గొంటారు. ఈ ఉత్సవంలో ప్రధాన ఉత్సవమైన పంగుణి రథోత్సవం ఏప్రిల్ 9వ తేది ఉదయం జరుగుతుంది. రథంపై సుబ్రమణ్య స్వామి, దేవయాని అమ్మవారితో కలిసి 3 కిలోమీటర్ల దూరం ఉన్న గిరి వలయంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.

పరందూరు ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం

సాక్షి, చెన్నై: పరందూరు విమానాశ్రయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. కాగా సమగ్ర నివేదిక సమర్పణకు నాలుగు సంస్థలు ముందుకు వచ్చాయి. వివరాలు.. చెన్నై విమానాశ్రాయంలో రద్దీ విపరీతంగా పెరగడంతో కాంచీపురం జిల్లా పరందూరులో ప్రత్యామ్నాయంగా మరో విమానాశ్రయానికి కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సైతం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. స్థల సేకరణ పనులపై అధికారులు దృష్టి సారించిన సమయంలో పరందూరు పరిసర గ్రామాల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఇక్కడి ప్రజలు ఉద్యమంగా తమ నిరసనను తెలుపుతూ వస్తున్నారు. వీరిని బుజ్జగించేందుకు పలుమార్లు ప్రయత్నించినా, ఏదో ఒక రూపంలో సమస్య వచ్చి పడుతుండడంతో పాలకులు సైతం ఇక మౌనం పాటించేందుకు సిద్ధమయ్యారు. దీంతో బలవంతగానైనా ఇక స్థల సేకరణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు అద్దం పట్టే విధంగా పనుల్లో వేగం పెంచేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు పనులపై సమగ్ర సర్వే, వివరాల సేకరణ, పర్యావరణ పరిస్థితులపై అధ్యయనం, మాస్టర్ ప్లాన్ రూపకల్పన, తదితర అన్ని రకాల పనులపై దృష్టి పెట్టారు. సమగ్ర నివేదిక సమర్పించాలని టెండర్లను ఆహ్వానించారు. దీంతో నాలుగు సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ సంస్థల్లో ఓ సంస్థను ఎంపిక చేసి పనులను అప్పగించేందుకు విమానయాన శాఖ వర్గాలు ముందుకెళ్తున్నాయి. ఏడాదిలోపు ఈ ఎయిర్‌పోర్టుపై నివేదిక విమానయాన శాఖకు సమర్పించాలని అధికారులు భావిస్తున్నారు.

29 నుంచి కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29తో ప్రారంభమై, ఏప్రిల్ 9వతేదీతో ముగుస్తాయి. ప్రతిరోజు ఉదయం, రాత్రి వివిధ రూపాల్లో వాహనాల్లో స్వామి వారు విహరించనున్నారు. 29న విష్వక్సేన తిరుమంజనం, ఉత్సవం, 30న శ్రీరామనవమి, సింహవాహనం, 31న హంస, సూర్యప్రభ వాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు. ఏప్రిల్ 1న గరుడ వాహనం, హనుమంత వాహనం, 2న శేషవాహనం, చంద్రప్రభవాహనం, 3న పల్లకి ఉత్సవం, మోహిని అలంకారం, యాళివాహనం, 4న వేణుగోపాల అలంకారం, వసంతోత్సవం, గజవాహనం, 5న రథోత్సవం, తోట ఉత్సవం, 6న పల్లకిలో వెన్నకృష్ణుడి అలంకారం, గుర్రపు వాహనం, 7న భిక్షాటన, పుణ్యకోటి విమానం, 8 మహా తిరుమంజనం, సీతారాముల కల్యాణం, పుష్పపల్లకి సేవ, 9న ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

రూ.1.50 కోట్ల సముద్రపు నత్తలు స్వాధీనం

• ముగ్గురి అరెస్టు

అన్నానగర్: నాగై అక్కరైపేట సమీపంలోని సుద్దుకుప్పం కడువైయాట్రిన్ సమీపంలోని శబరినాథన్‌కు చెందిన గోడౌన్‌లో విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రాసెస్ చేస్తున్న సముద్రపు నత్తలను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు కోస్ట్ గార్డ్ గ్రూప్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రాసెస్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేందుకు బుట్టలో నిల్వ చేసిన రూ.1.50 కోట్ల విలువైన సముద్రపు నత్తలను గుర్తించారు. 1000 కిలోల సముద్రపు నత్తలు స్వాధీనం చేసుకున్నారు. నాగై శబరినాథన్ (40), సురేష్ (47), సెల్వం (50)ను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న సముద్రపు నత్తలను కోస్ట్ గార్డ్ గ్రూప్ పోలీసులు, నాగై ఫారెస్టు కార్యాలయానికి అప్పగించారు.

రూ. 72 లక్షల స్థలం మోసం

• పోలీసుపై కేసు నమోదు

తిరువొత్తియూరు: రూ.72 లక్షల విలువైన 4 సెంట్ల స్థలాన్ని మోసం చేసిన నాగర్‌కోవిల్ వెట్టూర్ని మఠంకు చెందిన పోలీసుపై కేసు నమోదు చేయాలని నాగర్‌కోవిల్ జ్యుడిషియల్ కోర్టు ఆదేశాలిచ్చింది. నాగర్‌కోయిల్ వెట్టూర్ని మఠం పరమత్తిలింగాపురానికి చెందిన అసలవన్ (62) నాగర్‌కోవిల్ జ్యుడిషియల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో తనకు సొంతమైన వెడచ్చేరిలో ఉన్న 4 సెంట్ల స్థలాన్ని మోసం చేసి క్రయం రాసుకున్న వెట్టూర్నిమఠం పరమత్తి లింగాపురానికి చెందిన మణికంఠ ప్రదీప్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సెంటు స్థలం ప్రస్తుతం రూ.18 లక్షలు పలుకుతోందని, 4 సెంట్లకు రూ.72 లక్షలు అవుతుందని వెల్లడించారు. తనకు న్యాయం చేయాలని కోరారు. కేసు దర్యాప్తు చేయాలని కోర్టు జిల్లా క్రైం పోలీసులను ఆదేశించింది. జిల్లా క్రైం పోలీసులు విచారణ చేసి మణికంఠ ప్రదీప్ కుమార్, అతని తండ్రి రాజేంద్రన్‌పై ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మణికంఠన్ ప్రదీప్ కుమార్ ప్రస్తుతం నాగర్‌కోవిల్ నేశమణి మనగర్ పోలీసు స్టేషన్‌లో పోలీసుగా పని చేస్తున్నారు.

విద్యార్థినిపై లైంగిక దాడి

అన్నానగర్ : కృష్ణగిరి సమీపంలోని ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న 10వ తరగతి విద్యార్థినిని బెదిరించి లైంగిక దాడి చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. కృష్ణగిరి జిల్లా తెన్ కణికోట్టై తాలూకా కెలమంగళం సమీపంలోని బొమ్మాదాత్తనూర్ గ్రామానికి చెందిన కూలి కూతురు అక్కడి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. 8వ తేదీన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో సఖారాలప్ప(40) సామగ్రి కావాలని ఇంట్లోకి వచ్చాడు. బాలికను బెదిరించి లైంగిక దాడి చేశాడు. తల్లిదండ్రులకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాలిక భయపడి ఎవరికీ చెప్పలేదు. బాలిక ఇంట్లోకి సఖారాలప్ప రావడం చూసిన పక్కింటి అబ్బాయి ఈ విషయాన్ని బంధువులకు చెప్పాడు. అనంతరం బాలికను ఆరా తీయగా జరిగిన విషయాన్ని చెప్పింది. బాలిక తల్లిదండ్రులు తేన్ కణికోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సంపూర్ణం పోక్సో కేసు నమోదు చేసి సఖారాలప్ప కోసం గాలిస్తున్నారు.

53 సవర్ల నగలు చోరీ చేసిన మహిళ అరెస్టు

అన్నానగర్: ఇంట్లో పనిచేస్తూ 53 సవర్ల బంగారు నగలు చోరీ చేసిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. తెన్‌కాసి జిల్లా శంకరన్‌కోవిల్ సమీపంలోని తిరువెంకడం ఎన్జీవో కాలనీకి చెందిన రఘుపతి (61) ఇంట్లో తులసిమణి భార్య మహేశ్వరి (43) ఇంటి పనులు చేస్తోంది. రఘుపతి ఇంట్లోని బీరువలోని బంగారు, వజ్రాభరణాలు మాయమయ్యాయి. అతను ఆదివారం తిరువెంకటం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో పనిచేసే మహేశ్వరిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె నగలు దొంగిలించినట్లు అంగీకరించింది. రఘుపతి ఇంట్లో చోరీకి గురైన నగలను మహేశ్వరి తన భర్త తులసిమణికి ఇచ్చి తన ఇంట్లో దాచుకుంది. భార్యాభర్తలను అరెస్టు చేసి గొలుసులు, బ్రాసెట్లు, గాజులు, ఒక జత వజ్రాల నగలు సహా సుమారు 53 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.22 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటడమే ధ్యేయం


కమల్

సాక్షి, చెన్నై : లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటడమే లక్ష్యంగా మక్కల్ నీది మయ్యం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆ పార్టీ నేత, విశ్వనటుడు కమలహాసన్ ఆదేశాల మేరకు ద్వితీయ శ్రేణి నేతలు జిల్లాల వారీగా సమాచార సేకరణకు చర్యలు చేపట్టారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే- కాంగ్రెస్ కూటమితో కలిసి ఎన్నికలను ఎదుర్కొనేందుకు కమల్ సిద్ధమవుతున్నారు. ఇందుకు అద్దం పట్టే విధంగా ఆయన కార్యక్రమాలు గత కొంత కాలంగా ఉంటున్నాయి. ఎన్నికలలోపు పార్టీ బూత్ కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు విస్తృతం చేయడానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం ద్వితీయ శ్రేణి నేతల ద్వారా జిల్లాల కార్యదర్శుల సమావేశానికి నిర్ణయించారు. ఆ మేరకు ఆదివారం ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఆళ్వార్ పేటలోని పార్టీ కార్యాలయంలో 16 జిల్లాల కార్యదర్శులతో పార్టీ రాష్ట్ర కమిటీలోని ముఖ్య నేతలు, ద్వితీయ శ్రేణి నేతలు సమావేశమయ్యారు. చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం తదితర జిల్లాలతో పాటు, ఉత్తర, మధ్య, దక్షిణ చెన్నై, శ్రీపెరంబదూరు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి ముఖ్య నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆయా నియోజకర్గాలలో పార్టీ పరిస్థితి, బూత్‌కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదుతో పాటు విస్తృతంగా చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలను ఈసందర్భంగా జిల్లాల కార్యదర్శులకు ముఖ్య నేతలు వివరించారు.

త్యాగరాజస్వామి కీర్తనలు మహోన్నతమైనవి


వక్త డాక్టర్ రాణి నాగశ్రీ శైలేశ్వరిని సత్కరిస్తున్న జె కె రెడ్డి, మధు తదితరులు

కొరుక్కుపేట: కర్ణాటక సంగీత విద్వాంసులతో ఆద్యుడిగా ప్రసిద్ధుడైన త్యాగరాజస్వామి కీర్తనలు మహోన్నతమైనవని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం – తిరుపతి సంగీతం, లలిత కళల శాఖ ఆచార్యులు డాక్టర్ రాణి నాగశ్రీ శైలేశ్వరి కొనియాడారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 135వ ప్రసంగ కార్యక్రమం చేపట్టారు. టి.నగర్ ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణా హాల్ వేదికైంది. త్యాగరాజ కృతులు – సంగీత సాహిత్య విశ్లేషణ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆచార్యులు రాణి నాగశ్రీ శైలేశ్వరి పాల్గొని మాట్లాడారు. త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు సంగీత ప్రపంచంలో అరుదైనవిగా గుర్తింపు పొందాయని తెలిపారు. శాస్త్రీయ సంగీతానికి గొప్ప ప్రతిష్టను తీసుకువచ్చారని తెలిపారు. నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన గొప్ప వాగ్గేయకారుడు అని చెప్పారు. ఆయన కీర్తనలు శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాలపై, ఉపనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియజేస్తాయని వ్యాఖ్యానించారు. ఆయన 19 కోట్ల సార్లు రామజపం చేసిన మహనీయులని కొనియాడారు. వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జె.కె.రెడ్డి వక్తను సభకు పరిచయం చేయగా, కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేసి నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

చెన్నై - తిరుపతి మార్గం విస్తరణకు చర్యలు

• అంబత్తూరు పరిసర వాసులకు నోటీసులు

సాక్షి, చెన్నై: తిరుపతి– చెన్నై రహదారి విస్తరణకు గత దశాబ్దానికి పైగా ప్రయత్నాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తాజాగా నిర్వాసితులకు మరోసారి నోటీసులు జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. వివరాలు.. చెన్నై నుంచి పాడి – అంబత్తూరు – తిరువళ్లూరు మీదుగా తిరుపతి వైపుగా రహదారి ఉన్న విషయం తెలిసిందే. ఈ మార్గంలో 22 కి.మీ దూరం రోడ్డు విస్తరణ అధికారులకు గగనంగా మారింది. ఈ ప్రాంతంలోని వ్యాపారులు, గృహాల యజమానలు కోర్టును ఆశ్రయించడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారింది. ప్రస్తుతం ఈ మార్గంలో రోజుకు లక్షా పది వేల వాహనాలు ప్రయాణిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో విస్తరణ అనివార్యమైంది. గతంలో ఈ పనులకు రూ. 158 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం అదనంగా మరో రూ. 13 కోట్లను విడుదల చేశారు. దీంతో పనులపై దృష్టి పెట్టేవిధంగా రహదారుల శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంబత్తూరు పరిసరాలలోని ఈ మార్గం వెంబడి ఉన్న గృహ యజమానులు, వ్యాపారులు రహదారుల శాఖ నోటీసుల జారీపై దృష్టి పెట్టింది. కొందరికి నోటీసులు జారీ చేశామని, మరి కొందరికి త్వరలో ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ సారి స్థల సేకరణతో రోడ్డు విస్తరణ తప్పనిసిరాగా జరిగి తీరుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఆధునాతన చికిత్స విధానాలపై దృష్టి సారించాలి



సదస్సు ప్రారంభోత్సవంలో డాక్టర్లు సత్యభామ, ఆర్.నరసింహన్ తదితరులు

కొరుక్కుపేట: వైరల్ జ్వరాలు, కోవిడ్ బాధితుల అనారోగ్య సమస్యలను అరికట్టేలా కొత్త చికిత్సా విధానాలపై వైద్యనిపుణులు ప్రత్యేక దృష్టి సారించారని అపోలో ఆస్పత్రుల గ్రూపు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్ పర్సన్‌ప్రీతారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న ఇన్‌ఫ్లూయెంజా కేసులు, దీర్ఘకాలిక కోవిడ్ తర్వాతి పరిణామాల గురించి అవగాహన కల్పించే దిశగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం చెస్ట్ సమ్మిట్ -2023 పేరుతో సదస్సు నిర్వహించారు. శ్వాసకోశ వ్యాధులపై అవగాహన, చికిత్సను ప్రోత్సహించడం తదితర అంశాలపై వైద్యనిపుణులు ప్రసంగించారు. ప్రీతారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సందేశం వెలువరించారు. అపోలో ఆస్పత్రి వైద్యనిపుణులు ఏఆర్ గాయత్రి, ఆర్ నరసింహన్, అపోలో హాస్పిటల్స్ క్లినికల్ అడ్వయిజర్ సత్యభామ, ఇళంగో, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రాత్రి సమయంలో గస్తీని పెంచండి


తిరువళ్లూరులో తనిఖీ చేస్తున్న ఏడీజీపీ శంకర్, ఐజీ కన్నన్, డీఐజీ పగళవన్, ఎస్పీ పకెర్లా సెఫాస్ కల్యాణ్

తిరువళ్లూరు: రాత్రి సమయంలో పోలీసుల గస్తీని మరింత పెంచి నేరాలను నియంత్రించాలని ఏడీజీపీ శంకర్ తిరువళ్లూరు ఎస్పీ పకెర్లా సెఫాస్ కల్యాణ్‌ను ఆదేశించారు. ఆయన అర్ధరాత్రి తిరువళ్లూరు సమీప ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించి పోలీసుల గస్తీ, వాహన తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారితో పాటు, మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై ఉదాసీనత చూపించొద్దని పోలీసులను హెచ్చరించారు. టార్గెట్ పేరిట కేసులు నమోదు చేసి అమాయకులను వేదించవద్దని సూచించారు. రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్న వారి వివరాలతో పాటు ప్రక్రియను పరిశీలించి గస్తీని మరింత పెంచాలని ఆదేశించారు. అనంతరం తిరువళ్లూరు తాలూకా పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆయుధ నిల్వ గది, కేసుల వివరాలు, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. పాత నేరస్తులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను సైతం త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ తనిఖీలో ఐజీ కన్నన్, డీఐజీ పగళవన్, ఎస్పీ కల్యాణ్, అసిస్టెంట్ ఎస్పీ వివేకానందశుక్లా పాల్గొన్నారు.

అందియూర్ అటవీ ప్రాంతంలో మూడు ఏనుగుల మృతి


మృతి చెందిన గున్న ఏనుగు

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లా అందియూర్ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో గత రెండు రోజుల్లో మూడు ఏనుగులు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. ఈరోడ్ జిల్లా అందియూర్ సమీపంలో వున్న మురళి విభాగం తాళక్కరై దక్షిణ బర్గూర్ అటవీ ప్రాంతంలో అందియూర్ అటవీశాఖ అధికారి ఉత్తరస్వామి, ఉద్యోగులు శనివారం గస్తీ చేపట్టారు. ఆ సమయంలో ఒక చోట దుర్గంధం వెదజల్లడంతో పరిశీలించారు. అక్కడ ఒక ఆడ ఏనుగు, దాని సమీపంలో ఒక గున్న ఏనుగు మృతి చెంది పడి వున్నాయి. దీనిపై ఫారెస్టు అధికారి ఉత్తరస్వామి ఈరోడ్ జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్‌కు సమాచారం అందించారు. వెటర్నరీ డాక్టర్లు అక్కడికి చేరుకుని మృతి చెందిన ఏనుగులకు పంచనామా చేశారు. అధికారులు మాట్లాడుతూ అదుపు తప్పి గుంతలో పడి తీవ్ర గాయాలతో ఏనుగులు మృతి చెంది ఉంటాయని తెలిపారు. తల్లితో పాటు సుమారు ఒకటిన్నర సంవత్సరాలున్న మగ ఏనుగు పిల్ల మృతి చెందిందని తెలిపారు. అదేవిధంగా ఈరోడ్ జిల్లా చెన్నంబడి అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం 30 సంవత్సరాల కలిగిన ఏనుగు రెండు ఏనుగులకు మధ్య ఏర్పడిన కుమ్ములాటలో ఒక ఏనుగు మృతి చెందినట్టు తెలిపారు. ఈ మేరకు అందియూరు అటవీ ప్రాంతంలో గత రెండు రోజులలో మూడు ఏనుగులు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

ఏపీ క్రెడాయ్ చైర్మన్‌గా శివారెడ్డి


నూతన కార్యవర్గ సభ్యులు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/మద్రిపాలెం(విశాఖ ఉత్తర): క్రెడాయ్ ఏపీ చాప్టర్ చైర్మన్‌గా గుంటూరుకు చెందిన ఆళ్ల శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2023–25 కాలానికి ఏపీక్రెడాయ్ చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం విశాఖలో ఎన్నుకున్నారు. ఏపీ చాప్టర్ ప్రెసిడెంట్‌గా వైవీ రమణారావు, ప్రధాన కార్యదర్శిగా బయన శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జీవీఎస్‌టీ రాయుడు, కె.సుభాష్‌చంద్రబోస్, జె.సురేష్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా పి.రాజశేఖర్‌రావులు, సంయుక్త కార్యదర్శులుగా వి.భీమశంకర్, కె.రమేష్‌అంకినీడు ఎన్నికయ్యారు. గుంటూరులో 1998లో బిల్డర్స్ అసోసియేషన్ ఏర్పడినప్పట్నుంచి వరసగా ఐదుసార్లు శివారెడ్డి ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రెడాయ్ ఏపీ చాప్టర్ కార్యదర్శిగాను, అడ్వైజర్‌గాను రెండు పర్యాయాలు పని చేశారు. క్రెడాయ్ సభ్యుల అభివృద్ధికి పాటుపడతానని, ప్రభుత్వానికి, బిల్డర్లకు అనుసంధానంగా వ్యవహరిస్తానని శివారెడ్డి చెప్పారు.

ఉత్సాహంగా మారథాన్

- ప్రారంభించిన మంత్రులు రజిని, సురేష్, అమర్‌నాథ్


విశాఖ ఆర్కే బీచ్‌లో మారథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు సురేశ్, అమర్‌నాథ్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): జీ–20 సదస్సు నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. రాష్ట్ర మంత్రులు విడదల రజిని, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్‌లు ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద 3కె, 5కె, 10కె పోటీలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో నగర ప్రజలు ఈ పరుగు పోటీల్లో పాల్గొనడంతో బీచ్ రోడ్డులో సందడి నెలకొంది.

పారాగ్లైడింగ్‌లో అపశ్రుతి

తీరంలో నిర్వహించిన పారాగ్లైడింగ్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. దీంతో మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ప్రమాదం తప్పింది. మారథాన్ అనంతరం తీరంలో ఏర్పాటు చేసిన పారాగ్లైడింగ్‌ను మంత్రి రజిని ప్రారంభించారు. నిర్వాహకులు మంత్రి సురేష్‌ను ఓ సారి రైడ్ చేయాలని కోరడంతో మంత్రి ఆసక్తితో పారాగ్లైడింగ్ చేయడానికి సిద్ధపడ్డారు. అయితే వాతావరణం అనుకూలించక గాలి ఎక్కువగా వీయడంతో పారాగ్లైడింగ్ పైకి లేస్తున్నప్పుడు ఎడమ వైపునకు ఒరిగింది. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది దానిని నియంత్రించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

కాంగ్రెస్ ఆందోళనలు సిగ్గుచేటు: సోము వీర్రాజు



నెల్లూరు(బృందావనం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అవహేళన చేస్తూ మాట్లాడడం పెద్ద తప్పిదమని, ఇందుకు చట్టపరంగా చర్యలు కొనసాగుతుంటే కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు చేపట్టడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వేదాయపాళెంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సమావేశానికి హాజరైన వీర్రాజు విలేకరులతో మాట్లాడారు. రాచరికపాలన సాగించిన నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల ఆలోచనలతో నిమ్నకులమైన 'మోదీ' కమ్యూనిటీని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు నూటికి నూరుశాతం తప్పన్నారు. రాష్ట్రంలో బీసీల గణన చేపట్టాలంటూ ప్రభుత్వ కార్యదర్శులకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుకు సుముఖంగా లేదని విమర్శించారు.

ఈసారి మాదే అధికారం!

- ఆ వెంటనే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనను తొలగిస్తాం
- టీడీపీ నేత నారా లోకేశ్

ఓడీ చెరువు: వచ్చే ఎన్నికల్లో గెలిచి టీడీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేత నారా లోకేశ్ జోస్యం చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను తొలగించి.. పూర్తి రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేస్తామన్నారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండలంలోని రామయ్యపేట నుంచి బోయపల్లి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పగడాలవారిపల్లిలో బీసీలు, విద్యార్థులు, యువతతో ఆయన వేర్వేరుగా ముఖాముఖి నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో 40 శాతం టికెట్లను యువతకు కేటాయిస్తామన్నారు. వడ్డెర్లకు ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని పలువురు కోరగా.. 'ఎవరికి ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలనేది చంద్రబాబు నిర్ణయిస్తారు' అని దాటవేశారు. టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించామని లోకేశ్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా దీన్ని కొనసాగిస్తామన్నారు.

'మీ పాప లేదా బాబు బొద్దుగా ముద్దొస్తున్నారండీ' అని ఎవరైనా అంటే వారి తల్లిదండ్రులు తెగ మురిసిపోతున్నారు. బాల్యంలోనే బొద్దుగా తయారవడం వల్ల వచ్చే దుష్ప్రభావాలను అసలు గుర్తించలేకపోతున్నారు. పిల్లలు ఏం తింటున్నారు, వారు తినే ఆహారంలో పోషకాలు ఏ మాత్రం ఉంటున్నాయనే విషయంపై ఆలోచించే వారైతే చాలా అరుదే. పంజాబ్‌లోని బటిండా, ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వైద్యులు అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. మార్కెట్‌లో లభించే ప్యాక్ చేసిన ఆహార పదార్థాలనే పిల్లలకు పెట్టేందుకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తేలింది. పిల్లలకు పెట్టే ఆహారంలో ఉండాల్సిన పోషక విలువలపై తక్కువ అవగాహన ఉంటోందని గుర్తించారు. - సాక్షి, అమరావతి



ప్యాక్డ్ ఫుడ్‌తో

పిల్లల ఆరోగ్యం గుల్ల

- రుచికి ప్రాధాన్యమిస్తూ పోషకాలపై నిర్లక్ష్యం
- చిన్న వయసులోనే అనారోగ్య సమస్యల బారినపడుతున్న పిల్లలు
- ఎయిమ్స్ వైద్యుల అధ్యయనంలో వెల్లడి



53.9 శాతం అధికంగా కొలెస్ట్రాల్

పాఠశాలల్లో చదివే 14–18 సంవత్సరాల మధ్య వయసు పిల్లలు 722 మంది, వారి తల్లిదండ్రులను ఎయిమ్స్ బృందం అధ్యయనానికి ఎంచుకుంది. ఆ పిల్లల్లో జంక్ ఫుడ్, ప్యాక్ చేసిన ఆహారం కారణంగా చిన్న వయసులోనే ఊబకాయం, హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్ వ్యాధుల బారినపడేలా చేస్తున్నాయని గుర్తించారు. పిల్లలు తినే ఆహారాల (ప్యాకేజీ ఫుడ్) తయారీలో 53.9 శాతం అధికంగా కొలెస్ట్రాల్ పదార్థాలు ఉంటున్నాయని తేల్చారు. ఇది విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని తేల్చారు.

ప్రకటనలతో ప్రభావితం

టీవీలు, డిజిటల్ మీడియాలలో వచ్చే ప్యాక్ చేసిన ఆహార పదార్థాల వైపు పిల్లలు ఆకర్షితులు అవుతున్నారని 273 మంది తల్లిదండ్రులు (37.8 శాతం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 184 (25.5 శాతం) మంది ప్రచారం చేస్తున్న ఆహార ఉత్పత్తుల్లో పోషకాల నాణ్యతకు సంబంధించిన సమాచార కచ్చితత్వంపై సందేహాలు వ్యక్తం చేశారు. దాదాపు 45 శాతం మంది తల్లిదండ్రులు ప్రసిద్ధ వ్యక్తులు జంక్ ఫుడ్స్‌ను ప్రమోట్ చేస్తుండటాన్ని వ్యతిరేకించారు. జంక్ ఫుడ్‌పై కంపెనీలు ఆఫర్లు ఇస్తుండటాన్ని 34 శాతం మంది తప్పుపట్టగా.. ప్రైమ్ టైమ్‌లో జంక్ ఫుడ్ ప్రకటనలు వేయకూడదని 40 శాతం మంది కోరారు.

గడువు తేదీని చూడని వారే అధికం

అధ్యయనంలో పాల్గొన్న విద్యార్థుల్లో 352 మంది (48.8 శాతం) విద్యార్థులు తినే ఆహార ప్యాకెట్లపై కనీసం గడువు తీరే తేదీని (ఎక్స్‌పైరీ డేట్)పరిశీలించడం లేదు. 526 మంది (72.9 శాతం) కేవలం ధరలను పరిశీలిస్తుండగా.. 518 మంది (71.7 శాతం) విద్యార్థులు కొనుగోలు చేసే ముందు ఆ ఆహారం వెజ్, నాన్–వెజ్ అనేది మాత్రమే చూస్తున్నారు. మార్కెట్‌లో లభించే ఆహార ప్యాకెట్లపై తయారీకి వినియోగించిన పదార్థాలు, వాటిలో ఉండే పోషకాలకు సంబంధించిన లేబుల్స్‌పై సమాచారాన్ని కేవలం 50 మంది విద్యార్థులు (6.9 శాతం) మాత్రమే అర్థం చేసుకుంటున్నారు. 356 మంది విద్యార్థులు (49.30 శాతం) లేబుల్ చూసి తాము ఆహార పదార్థాల వైపు ప్రభావితం అవలేదని, 424 మంది (58.7 శాతం) లేబుల్స్ కారణంగా తమ కొనుగోలు ప్రవర్తనను ఎప్పుడూ మార్చుకోలేదని నివేదించారు.

ఇంట్లోనే చేసి పెట్టాలి

పిల్లలకు ఇంటి ఆహారం అలవాటు చేయాలి. పూర్వం తల్లిదండ్రులు పిల్లల కోసం ఇంట్లోనే చక్రాలు, కజ్జికాయలు, అరిసెలు వంటి ఆహార పదార్థాలు చేసేవారు. ఆ తరహా పద్ధతులను ఇప్పుడు కూడా పాటించాలి. వీలైనంత వరకూ కూరగాయలు, పళ్లు తినడాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు అలవాటు చేయాలి. జంక్ ఫుడ్, ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చైల్డ్ ఒబెసిటీ వస్తుంది. దీనివల్ల ఆస్తమా, ఫ్యాటీ లివర్, టైప్–2 డయాబెటిస్ వంటి సమస్యల బారినపడతారు. ఈ ఆహారంలో కలిపే పదార్థాల కారణంగా త్వరగా పిల్లల్లో కౌమార దశ మొదలవుతుంది.

– డాక్టర్ నాగచక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, విజయవాడ జీజీహెచ్

'జేఈఈ' సెషన్–2కు
అభ్యర్థుల తాకిడి

సాక్షి, అమరావతి: ఐఐటీ, ఎన్‌ఐటీ తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్–2023 సెకండ్ సెషన్‌కు అభ్యర్థుల తాకిడి విపరీతంగా పెరగనుంది. జనవరిలో నిర్వహించిన మొదటి సెషన్ పరీక్షలకన్నా రెండో సెషన్‌కు ఎక్కువమంది హాజరుకానున్నారని ఆయా విద్యా సంస్థల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. జనవరి సెషన్ సమయంలో ఇంటర్ పరీక్షల సన్నద్ధతతో పాటు ప్రాక్టికల్ పరీక్షలు కూడా ఉండడంతో తొలిసెషన్ కన్నా రెండో సెషన్‌నే ఎక్కువ మంది ప్రాధాన్యతగా తీసుకున్నారు. అయితే, ఈసారి తొలిసెషన్ పరీక్షలలో కూడా గతంలో కన్నా రికార్డు స్థాయిలో అభ్యర్థులు హాజరయ్యారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వరకు జరిగిన తొలిసెషన్ కంప్యూటర్ ఆధారిత (కంప్యూటర్ బేస్డ్ టెస్టు–సీబీటీ) పరీక్షకు మొత్తం 8,60,064 మంది పేపర్–1కు.. 46,465 మంది పేపర్–2కు రిజిస్టరయ్యారు. వీరిలో పేపర్–1కి 8,23,967 (95.80 శాతం) మంది.. పేపర్–2కి 95 శాతానికి పైగా హాజరయ్యారు.

వచ్చేనెల 6 నుంచి రెండో సెషన్ పరీక్షలు

ఇక జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసింది. సెకండ్ సెషన్ నిర్వహించే పట్టణాలకు సంబంధించిన సిటీ స్లిప్‌లను త్వరలోనే విడుదల చేయనున్నారు. ఏప్రిల్ మొదటి వారం ఆరంభంలో అభ్యర్థుల అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏయే విడుదల చేయనుంది. ఇదిలా ఉంటే.. తొలి సెషన్ పరీక్షల సమయంలో ఇంటర్మీడియెట్, సీబీఎస్‌ఈ ప్లస్2కు సంబంధించిన ప్రాక్టికల్స్ నేపథ్యంలో విద్యార్థుల నుంచి పరీక్షల షెడ్యూల్‌లో మార్పుల కోసం అనేక వినతులు ఎన్‌టీఏకు అందాయి. అదే సమయంలో కొందరు విద్యార్థులు ఉన్నత న్యాయస్థానంలో కేసులూ దాఖలు చేశారు. అయితే, పరీక్షల వాయిదాకు కోర్టు అంగీకరించలేదు.



దేశవ్యాప్తంగా 574 పరీక్ష కేంద్రాలు..

ఇంటర్మీడియెట్ పరీక్షల సన్నద్ధత సమయంలోనే జేఈఈ తొలి సెషన్లో 8.6 లక్షల మందికిగాను 8.22 లక్షల మంది హాజరయ్యారు. రెండో సెషన్ ప్రారంభమయ్యే నాటికి ఇంటర్ పరీక్షలు పూర్తికానున్న నేపథ్యంలో ఇంకా ఎక్కువమంది హాజరయ్యే అవకాశం ఉంటుందని ఆయా కాలేజీల ప్రతినిధులు పేర్కొంటున్నారు. తొలి సెషన్‌లో పాల్గొన్న వారితో పాటు కొత్తగా మరింత మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా 290 పట్టణాల్లోని 574 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఏపీలోని 25 పట్టణాల్లో జరుగుతుంది.

తుది ఫలితాలు ఏప్రిల్ 30 లోపు

ఇక జేఈఈ మెయిన్ తుది ఫలితాలు ఏప్రిల్ 30లోపు వెలువడనున్నాయి. ఏప్రిల్ 30 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుంది. మెయిన్‌లో అర్హత సాధించిన తొలి 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌లో దరఖాస్తుకు అవకాశముంటుంది. రెండు సెషన్లలో సాధించిన మార్కుల్లో ఎక్కువ మార్కులను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ప్రకటిస్తారు. తొలిసెషన్లో దేశవ్యాప్తంగా 100 స్కోర్ పాయింట్లు సాధించిన విద్యార్థులు 20 మంది ఉన్నారు. 100 స్కోర్ పాయింట్లతో పాటు అత్యధిక స్కోర్ పాయింట్లు సాధించిన విద్యార్థుల్లో సగం మంది తెలుగువారే. బాలికల్లో టాప్ స్కోరు పాయింట్లను సాధించిన వారిలోనూ తెలుగు అమ్మాయిలే ఉన్నారు.

విద్యుత్ సబ్సిడీలకు రూ.10,135.22 కోట్లు

- ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: విద్యుత్ రంగంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు విజయవంతమయ్యాయని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఇంధనశాఖ అధికారులతో ఆదివారం ఆయన వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ వినియోగదారులకు 9 గంటల ఉచిత విద్యుత్ అందించడానికి, ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీ, ఆక్వా రైతులు వంటి వివిధ కేటగిరీల విద్యుత్ వినియోగదారుల కోసం సబ్సిడీగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.10,135.22 కోట్ల భారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించిన మొత్తం ఆదాయ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. ఎనర్జీ ఇంటెన్సివ్ ఇండస్ట్రీస్ మినహా ఏ వర్గం వినియోగదారులకు సుంకం పెంపు ఉండదని స్పష్టం చేశారు.

ప్రభుత్వంపైనే ఉచిత, సబ్సిడీ భారం

నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందజేస్తోందన్నారు. ఎంబీసీ, ధోబీఘాట్‌లు, లాండ్రీలు, స్వర్ణకార కార్మికులు, సెలూన్లు, బంగారు ఆభరణాలు, చేనేత కార్మికులు, చెరకు క్రషర్లు, గ్రామీణ ఉద్యాన నర్సరీలు మొదలైన వాటికి ఉచిత, సబ్సిడీ విద్యుత్‌ను ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం రూ.7,641.85 కోట్లు, ఆక్వాకల్చర్ రంగానికి రూ.1,206.20 కోట్లు, ఇతర వర్గాలకు రూ.1,238.30 కోట్లను సబ్సిడీగా కేటాయించినట్టు తెలిపారు. ఎక్కువ విద్యుత్ వినియోగించే ఫెర్రో అల్లాయ్ వంటి పరిశ్రమలకు సాధారణ పరిశ్రమలతో సమానంగా రూ.475 కేవీఏ డిమాండ్ చార్జీలు విధిస్తామన్నారు. సంప్రదాయ పరిశ్రమలతో పోలిస్తే ఇంధన చార్జీలు యూనిట్‌కు రూ.0.50 పైసలు తక్కువగా ఉంటాయన్నారు.

శ్రీదేవి వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఫైర్

- దమ్ముంటే అమరావతి గడ్డపై అడుగు పెట్టాలని సవాల్
- తుళ్లూరులో శ్రీదేవి దిష్టిబొమ్మ దహనం


ఎమ్మెల్యే శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

తాడికొండ (గుంటూరు): తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి వ్యాఖ్యలు వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆగ్రహాన్ని కలిగించాయి. ఆదివారం తుళ్లూరు తులసీ థియేటర్ ఎదుట నాయకులు, కార్యకర్తలు శ్రీదేవి వ్యాఖ్యలకు నిరసనగా ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి సవాల్‌ను స్వీకరిస్తున్నాం. దమ్ముంటే అమరావతి గడ్డపై అడుగుపెట్టు. నిన్ను నమ్మి ఓట్లేసిన నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పు' అంటూ నిలదీశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని అమరావతి గడ్డపై ప్రమాణం చేస్తానంటున్న శ్రీదేవి హైదరాబాద్ వెళ్లి ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. తాడికొండ నియోజకవర్గంలో దళితుల ఆత్మగౌరవానికి శ్రీదేవి భంగం కలిగించారని మండిపడ్డారు.

'భర్తను గన్‌మెన్లతో కొట్టించిన ఘనురాలు'

పార్టీ నాయకుడు మేకల రవి మాట్లాడుతూ.. తనకు శ్రీదేవి రూ.1.40 కోట్లు ఇవ్వాలన్నారు. ఇదే విషయాన్ని గతంలో విలేకరుల సమావేశం ద్వారా అందరికీ చెప్పినా కనికరించలేదన్నారు. శ్రీదేవికి ముగ్గురు కుమార్తెలు ఉండగా.. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో ఇద్దరు అని నమోదు చేసిందన్నారు. భర్త శ్రీధర్‌ను గన్‌మెన్లతో కొట్టించిన ఘనురాలు అన్నారు. శ్రీదేవి అక్రమాలపై ఒక ఫైల్ తయారు చేసిన ఆమె భర్త శ్రీధర్ సజ్జల రామకృష్ణారెడ్డి దగ్గరకు వెళ్లలేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రజల నుంచి రూ.100 కోట్లు వసూలు చేసిన శ్రీదేవికి ప్రజల్లో ప్రాధాన్యత తగ్గడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో అమ్ముడుపోయి నీతులు చెబుతోందన్నారు. 'ఏబీఎన్ రాధాకృష్ణ మధ్యవర్తిత్వంతో టీఎస్09 ఎఫ్‌ఎస్ టీఎల్‌ఆర్ 8876 కారులో నీ కూతురు చంద్రబాబు ఇంటికి వెళ్లలేదా? కిషోర్‌రెడ్డి, బొల్లినేని రామారావు, సుజనా చౌదరి నేతృత్వంలో చంద్రబాబు ఇంటివద్ద రూ.4.50 కోట్లు అడ్వాన్స్ తీసుకున్నది నిజం కాదా? అని మేకల రవి నిలదీశారు. శ్రీదేవి అమ్ముడు పోయిందనడానికి తనవద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని.. ఫొటోలు, సీసీ ఫుటేజీ ఆధారాలను త్వరలో డీజీపీకి, మీడియాకు అందజేస్తానని తెలిపారు.

వారికి త్వరలో రిటర్న్ గిఫ్ట్ ఇస్తా

తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ (గుంటూరు జిల్లా): ఎమ్మెల్సీ ఎన్నికల్లో అమ్ముడు పోయినట్టు తనపై ఆరోపణలు చేసిన వారికి త్వరలో రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. సజ్జల రామకృష్ణారెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో తాను డబ్బులు తీసుకోలేదని అమరావతిలో మట్టిపై ప్రమాణం చేస్తానన్నారు. అలాగే ప్రాణం పోయేవరకూ అమరావతి కోసం పోరాడతానన్నారు.

స్వప్రయోజనాల కోసం దిగజారే
బాబు వల్లే శ్రీదేవికి హాని

- మీరు చేసిన తప్పు పనికి, కులానికి సంబంధం ఏంటి?
- ఓటు అమ్ముకోమని అంబేడ్కర్ ఏమైనా చెప్పారా?
- టీడీపీకి అమ్ముడు పోకపోతే ధైర్యంగా నిలబడవచ్చు కదా..!
- 3 రోజుల తర్వాత హైదరాబాద్‌లో మాట్లాడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?
- టీడీపీ స్క్రిప్ట్ ఇప్పుడే అందిందా?
- ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిపై ఎంపీ నందిగం సురేశ్ ఆగ్రహం
- శ్రీదేవి సవాల్‌ను స్వీకరిస్తున్నా.. క్రాస్ ఓటింగ్ చేశారని నిరూపిస్తానని వెల్లడి

సాక్షి, అమరావతి: 'క్రాస్ ఓటింగ్ చేయలేదని, ప్రమాణానికి సిద్ధమని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి సవాల్ చేశారు. ఆమె సవాల్‌ను స్వీకరిస్తున్నా. శ్రీదేవి ఓటు అమ్ముకున్నారనేది వాస్తవం. ఆమె అమ్ముడుపోయి టీడీపీకి ఓటు వేశారని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నా' అని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేశ్ చెప్పారు. మహిళలను గౌరవించే పార్టీ వైఎస్సార్‌సీపీ అని.. తమ వల్ల ఆమెకు ఎలాంటి నష్టం జరగదన్నారు. స్వప్రయోజనాల కోసం ఎంతవరకైనా దిగజారే చంద్రబాబు వల్లే ఆమెకు హాని పొంచి ఉంటుందన్నారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నందిగం సురేశ్ మీడియాతో మాట్లాడారు. 'నిజంగా తప్పు చేయకపోతే.. ధైర్యంగా నిలబడొచ్చు కదా? మూడు రోజుల తర్వాత హైదరాబాద్‌లో ఎందుకు మాట్లాడారు? టీడీపీ స్క్రిప్ట్ ఇప్పుడే అందిందా?' అని ఉండవల్లి శ్రీదేవిని సురేశ్ ప్రశ్నించారు. సీఎం జగన్ చాలా గొప్ప వ్యక్తి అని మీడియాతో చెప్పారు కదా.. మరి



అలాంటి వ్యక్తిని మోసం చేయాలన్న ఆలోచన ఎలా వచ్చింది? అని మండిపడ్డారు. చేసిన తప్పు పనికి, కులానికి సంబంధమేంటని ప్రశ్నించారు. ఓటు అమ్ముకోమని అంబేడ్కర్ ఏమైనా చెప్పారా? అని నిలదీశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమె ఓటు అమ్ముకోవడం వాస్తవమని.. ఎవరితో ఎక్కడ, ఎలా రాయబారాలు చేసిందో తమకు తెలుసన్నారు. తనకు ఏదైనా జరిగితే అందుకు సజ్జల రామకృష్ణారెడ్డి బాధ్యత వహించాలంటూ శ్రీదేవి ఆరోపించడం దారుణమని మండిపడ్డారు. ఆమెకు ప్రమాదం పొంచి ఉందంటే.. అది కచ్చితంగా టీడీపీ వల్లే అని చెప్పారు. అందుకే శ్రీదేవికి పటిష్ట భద్రత కల్పించాలని కోరుతూ డీజీపీకి లేఖ రాస్తానని తెలిపారు.

జగన్ ప్రభుత్వం వల్లే దళితులకు ఎంతో మేలు..

సీఎం జగన్ పాలనలో దళితులకు ఎంత మేలు జరుగుతోందో అందరికీ తెలుసని ఎంపీ నందిగం సురేశ్ చెప్పారు. చంద్రబాబు హయాంలో ఎప్పుడైనా ఎస్సీలకు ప్రాధాన్యం కలిగిన మంత్రి పదవులు ఇచ్చారా? దళితులను హోం మంత్రి చేశారా? అని ప్రశ్నించారు. అమరావతిలో ఏదో అన్యాయం జరిగిపోయిందని ఇప్పుడు మాట్లాడుతున్న శ్రీదేవి.. గతంలో అమరావతి అంశం గురించి ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలని సూచించారు. అలాగే మిమ్మల్ని ఉద్దేశించి టీడీపీ వాళ్లు ఏమన్నారో కూడా గుర్తు చేసుకోవాలన్నారు. మీదంతా మేకప్.. ప్యాకప్.. మీరెప్పుడూ బ్యూటీ పార్లర్లలో ఉంటారంటూ టీడీపీ వాళ్లు దిగజారి చేసిన మాటలు గుర్తున్నాయా? అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబును నమ్మి వెళ్లిన 23 మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎక్కడున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. అలాగే ఇప్పుడు వెళ్లిన ఆ నలుగురు కూడా సరిగ్గా అక్కడే, అలాగే ఉంటారని చెప్పారు. స్కామ్‌లంటూ శ్రీదేవి ఆరోపిస్తున్న వాటిపై చర్చకు తాను సిద్ధమని చెప్పారు.

ఆ ఎమ్మెల్యేలు
చరిత్రహీనులుగా మిగిలిపోతారు

- జగనన్న కుందేలు కాదు సింహం
- ముందునుంచీ శ్రీదేవి తీరు అనుమానాస్పదమే
- ఆమె వ్యాఖ్యలు విడ్డూరం
- మంత్రులు రోజా, అమర్‌నాథ్, ఆదిమూలపు, తానేటి వనిత, నారాయణస్వామి ధ్వజం

నగరి (చిత్తూరు జిల్లా)/సాక్షి, విశాఖపట్నం/రాజమహేంద్రవరం రూరల్/కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): గుంటూరు జిల్లా తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఆదివారం చేసిన వ్యాఖ్యలపై పలువురు మంత్రులు మండిపడ్డారు. గతంలో అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలకు పట్టిన గతే ఇప్పుడు అమ్ముడుబోయిన వారికీ పడుతుందన్నారు. ఆమె చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదివినట్లు అనిపిస్తోందన్నారు. మంత్రులు ఆర్కే రోజా, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, తానేటి వనిత ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదివారం వేర్వేరుచోట్ల మీడియాతో మాట్లాడారు. వారేమన్నారంటే..

చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ అది: తానేటి వనిత



శ్రీదేవి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదివినట్లు అనిపిస్తోందని హోంమంత్రి తానేటి వనిత రాజమహేంద్రవరంలో అన్నారు. శ్రీదేవి వ్యాఖ్యలను ఆమె ఖండించారు. శ్రీదేవికి వైఎస్సార్‌సీపీ చాలా గౌరవం, గుర్తింపు ఇచ్చిందని గుర్తుచేశారు. మొన్నటి వరకూ సోషల్ మీడియాలో ఆమెను తీవ్రంగా ట్రోల్ చేసిన వారి పక్షానే శ్రీదేవి చేరిందని ఎద్దేవా చేశారు. అమరావతిని రాజధానిగా ఉంచడానికి ప్రయత్నిస్తానని శ్రీదేవి చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఆమె తెలంగాణ వెళ్లి ప్రెస్‌మీట్ పెట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు.

శ్రీదేవి వ్యాఖ్యలు విడ్డూరం: ఆదిమూలపు



మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా శ్రీదేవి వ్యవహరించారని విమర్శించారు. సీఎం జగన్ ప్రభుత్వం దళితులను అవమానిస్తోందని శ్రీదేవి వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. దళితులను అక్కున చేర్చుకున్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని, దళితులు గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారన్నారు. చంద్రబాబు వాపును చూసి బలుపు అనుకుంటున్నాడని సురేష్ వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు.

వారికి పట్టిన గతే వీరికి: నారాయణస్వామి



సీఎం జగన్ అండతో గెలిచి ఆయనకు వెన్నుపోటు పొడిచిన వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. గతంలో అమ్ముడుబోయిన ఎమ్మెల్యేలకు పట్టిన గతే ఇప్పుడు అమ్ముడుబోయిన ఎమ్మెల్యేలకూ పడుతుందన్నారు. ఇక స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆధారాలతో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుకు జైలు కూడు తప్పదన్నారు.

వారికి రాజకీయంగా పుట్టగతులుండవు: రోజా



సీఎం జగనన్న అండతో వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పక్కదారి పట్టిన నలుగురు ఎమ్మెల్యేలకు రాజకీయంగా పుట్టగతులు ఉండవని రోజా అన్నారు. నీచ రాజకీయాలతో నాలుగు సీట్లు గెలిచి ఏదో సాధించినట్లు చంద్రబాబు, ఎల్లో మీడియా చేసే తాటాకు చప్పుళ్లకు భయపడ్డానికి జగనన్న కుందేలు కాదు సింహమన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్నానని చెప్పుకునే చంద్రబాబునాయుడు ఏనాడు న్యాయంగా రాజకీయం చేయలేదన్నారు. ఆయన ఎమ్మెల్యేలను కొనగలడేమోగానీ.. కోట్లాదిమంది ప్రజల గుండెల్లో జగనన్నకు ఉన్న అభిమానాన్ని కొనలేడన్నారు. 2019 మాదిరిగానే 2024లో కూడా జగనన్న అదే రీతిలో సమాధానం చెప్పడం ఖాయమన్నారు.

ఉండవల్లి శ్రీదేవి కాదు.. ఊసరవెల్లి శ్రీదేవి: అమర్‌నాథ్



ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉండవల్లి శ్రీదేవి వైఖరి తనకు మొదటి నుంచి అనుమానం కలిగిస్తూనే ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం విశాఖలో అన్నారు. పోలింగ్ సమయానికి ముందు శ్రీదేవి తన కూతురుతో వచ్చి సీఎం జగన్‌తో ఫొటో కూడా తీయించుకుని సినీనటి శ్రీదేవిని మైమరిపించేలా నటించారన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటువేసి.. ఇప్పుడు దళిత కులం కార్డు అడ్డుపెట్టుకుని అందరి మీద విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నుంచి ముడుపులు తీసుకున్నప్పుడు కులం కార్డు గుర్తురాలేదా? అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. ఇక నుంచి అందరూ ఆమెను ఉండవల్లి శ్రీదేవి అనేకన్నా.. ఊసరవెల్లి శ్రీదేవి అనడం బెటర్ అని ఆయన వ్యాఖ్యానించారు.

సన్నిధి

గురువాణి

ఆగు! జవాబు చెప్పి ముందుకు కదులు!!!

ఏదయినా ఒక ముఖ్యమైన పని చేద్దామనుకున్నప్పుడు మనలోంచి అనేక భావాలు ఒక్కసారి బయటికి వస్తాయి. ఎలా అంటే... మండుతున్న కట్టెను నేలకేసి కొడితే చెలరేగే నిప్పురవ్వల్లాగా అవి లేస్తాయి. అప్పుడు మనలో ఘర్షణ మొదలవుతుంది. ఈ ఘర్షణ మీలో ఉన్న మిమ్మల్ని ఐదు ప్రశ్నలతో నిలదీస్తుందనీ, వాటిలో ఏది మీరు ఎంచుకుంటారో దాన్ని బట్టి మీ స్వభావాన్ని సమాజం అంచనా కడుతుంది. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం కూడా తన స్వీయరచన 'ఇండామిటబుల్ స్పిరిట్'లో ఇదే చెప్పారు.



మీరేదయినా పని సంకల్పించుకుని దాని అమలుపై మీమాంసలో ఉన్నప్పుడు మొదట మీలోని పిరికితనం ఒక ప్రశ్న వేస్తుంది..ఇది నీకు ప్రమాదకరం కాదు కదా! అని... అంటే 'నాకు ఏ ఇబ్బందీ లేదు, నా క్షేమానికి భంగపాటు కలగదు' అని జవాబు ఇచ్చుకుని ముందుకు సాగారనుకోండి. ఎప్పుడూ తన క్షేమం గురించే చూసుకొనేవాడు...ఇతరుల క్షేమం గురించి పట్టించుకోడని సమాజం అర్థం చేసుకుంటుంది.

మీలో ఉన్న దురాశ మిమ్మల్ని ఆపి 'ఈ పని చేస్తే మనకేమిటి లాభం? మనకేమయినా మిగులుతుందా?' అంటుంది. 'నాకు బాగా కలిసొస్తుంది. బాగా వెనకేసుకోవచ్చు కూడా' అని జవాబిచ్చారనుకోండి. ఇంత ఆశబోతు, ప్రతిదానికీ నాకేమిటని చూసుకునేవాడివల్ల నలుగురికీ ఉపయోగం లేకపోయినా వీడితో జాగ్రత్తగా ఉండాలనుకుంటుంది సమాజం.

వెంటనే గర్వం మీ దారికి అడ్డు తగిలి 'క్షేమం, లాభంసంగతి దేముడెరుగు. కనీసం నీకు పేరయినా వస్తుందా.. నిన్ను గురించి నలుగురు మంచిగా చెప్పుకుంటారా?' అని అడుగుతుంది. ఎంతసేపూ పేరుకోసం ఆరాటపడతాడు తప్ప మిగిలినవి పట్టించుకోడు... అని సమాజం అనుకుని మిమ్మల్ని దూరంగా ఉంచుతుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

దాటుకుని పోబోతున్న మీకు మీ ఆకాంక్ష అడ్డుతగులుతుంది. ''అవన్నీ వస్తాయో రావో నాకు తెలియదు. కనీసం సుఖపడతావా.. నీ శరీరానికికానీ, మనసుకు కానీ సుఖం లభిస్తుందా?' అంటుంది. 'తన వరకు సుఖంగా ఉంటేచాలనుకుంటాడు.. మిగతావారు ఎటుబోయినా నాకేమిటి అనుకుంటాడు.' అనుకుని ఇరుగూ పొరుగూ కూడా ఎవరూ దగ్గరకు రానీయరు.

చివరగా తనవంతుకోసం వేచి చూస్తూ ఉన్న అంతరాత్మ అప్పుడు కాస్తగట్టిగానే అడుగుతుంది ''నీవు చేస్తున్న పని సరైనదేనా, ధర్మమేనా..ఆలోచించు'' అంటుంది. 'ఎందుకు ఆ పని చేస్తావు, తప్పుకదా, నీకు నాలుగు డబ్బులు మిగలొచ్చు, నీకు సుఖమివ్వవచ్చు, పేరు కూడా రావచ్చేమో.. కానీ దానివల్ల ఎంతమందికి నష్టం, ఎందరికి కడుపుకోత..? ఆలోచించు, తొందరపడకు' అని పదేపదే హెచ్చరిస్తుంది.

నీవు జీవితంలో ఎవ్వరికీ జవాబుదారీ కాకపోవచ్చు. కానీ నీ అంతరాత్మను దాటుకుని, దాని మాటలు ఖాతరు చేయకుండా పోయిననాడు... అపరాధభావంతో నలుగురిలో ఉన్నా ఒంటరివైపోతావు...అది ఎప్పుడూ శాపమే. అంతరాత్మ ప్రబోధం విని నడుచుకున్న నాడు, నీవు ముందుంటావు, సమాజం నీ వెనుక నడుస్తుంటుంది, నిన్ను అనుసరిస్తూ, నీకు బాసటగా కూడా.

మంచి మాట



దాటవలసిన మనోభావాలు

సత్యాలు వేరు; మనోభావాలు వేరు. ఎవరి మనోభావాలు వాళ్లవి. మనోభావాలు వ్యక్తులకు సంబంధించినవి; మనోభావాలు లేకుండా ఎవరూ ఉండరు. మనిషి అన్నాక మనోభావాలు తప్పకుండా ఉంటాయి. మనోభావాలు అనేవి వ్యక్తిగతమైనవి మాత్రమే. సత్యాలు సార్వజనీనమైనవి. మనోభావాల మత్తులో సత్యాల్ని కాదనుకోవడం, అందుకోలేకపోవడం, వదిలేసుకోవడం అనర్థదాయకం, అపాయకరం. మనోభావాలు కాదు సత్యాలు మాత్రమే అవసరమైనవి ఆపై ప్రయోజనకరమైనవి.

మనోభావాలు దెబ్బతింటాయి లేదా దెబ్బతింటున్నాయి అనే మాటను మనం వింటూ ఉంటాం. మనోభావాలు దెబ్బతినడం అంటూ ఉండదు. వ్యక్తులలో ఉండే మనోభావాలు ఉన్నంత కాలం ఉంటాయి. కాలక్రమంలో పోతూ ఉంటాయి. మనోభావాలు అనేవి ప్రతి వ్యక్తికి వయసుతోపాటు మారిపోతూ ఉంటాయి. ఏ వ్యక్తికైనా ఐదేళ్లప్పుడు ఉన్న మనోభావాలు పదేళ్లప్పుడు ఉండవు. పదేళ్లప్పటివి ఇరవై యేళ్లప్పుడు ఉండవు. వ్యక్తుల మానసిక స్థితిని బట్టి, తెలివిని బట్టి, తెలివిడిని బట్టి మనోభావాలు అన్నవి వేరువేరుగా ఉంటాయి.

విద్య, సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక, శాస్త్రీయ విషయాల్లోనూ, కళల్లోనూ, సార్వత్రికమైన విషయాల్లోనూ మనోభావాలు అనేవి అవసరం అయినవి కావు. సంఘ, ప్రపంచ ప్రయోజనాలపరంగా మనోభావాలు అనేవి ఎంత మాత్రమూ పనికిరావు. మానవ ప్రయోజనాలపరంగా సత్యాలను మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. మనోభావాలు చర్చనీయమూ, పరిగణనీయమూ అవవు. ఒక వ్యక్తి మనోభావాలు మరో వ్యక్తికి, సమాజానికి అక్కర్లేనివి. మనోభావాలు, మనోభావాలు అని అంటూ ఉండడమూ, తమ మనోభావాలు ముఖ్యమైనవి లేదా విలువైనవి అని అనుకుంటూ ఉండడం మధ్యతరగతి జాడ్యం.

మనోభావాలు ప్రాతిపదికగా వ్యవహారాలు, సంఘం, ప్రపంచం నడవవు. ఈ విజ్ఞత ప్రతివ్యక్తికి తప్పనిసరిగా ఉండాలి. మనం మన మనోభావాలవల్ల మనకు, సంఘానికి సమస్యలం కాకూడదు. మన మనోభావాలు మనల్నే అడ్డగించే గోడలుకాకూడదు. మన మనోభావాలకు మనమే గుద్దుకోకూడదు. మనోభావాలు మనుగడ మునుసాగడాన్ని ఆపెయ్యకూడదు.

మనిషి జీవితంలో ఒక మేరకు వరకే మనోభావాలకు స్థానాన్ని, ప్రాముఖ్యతను ఇవ్వాలి. మనోభావాలకు అతీతంగా మనుగడను ముందుకు తీసుకువెళ్లడం మనిషి నేర్చుకోవాలి. మనోభావాలకు కట్టుబడి ఉండడం ఒక మనిషి జీవనంలో జరుగుతున్న తప్పుల్లో ప్రధానమైంది. స్వేచ్ఛగా సత్యాల్లోకి వెళ్లడం, వాటివల్ల స్వేచ్ఛను పొందడం ప్రతిమనిషికి ఎంతో ముఖ్యం. సత్యాలవల్ల వచ్చే స్వేచ్ఛ దాన్ని అనుభవిస్తున్నప్పుడు మాత్రమే తెలుస్తుంది. తమ మనోభావాల్ని అధిగమించినవాళ్లే సత్యాలలోకి వెళ్లగలరు. సత్యాలను ఆకళింపు చేసుకోగలిగితే మనోభావాలు, మనోభావాలవల్ల కలిగే కష్ట, నష్టాలు చెరిగిపోతాయి. మతం, కులం, ప్రాంతీయత, ఉగ్రవాదం వంటివాటి వల్ల జరుగుతున్న హానికి, అల్లకల్లోలానికి మనోభావాలే కారణం. మనిషికి సత్యాలపై తెలివిడి వచ్చేస్తే ఈ తరహా దుస్థితి, దుర్గతి ఉండవు. హిట్లర్ మనోభావాల కారణంగా ప్రపంచయుద్ధమే వచ్చి ప్రపంచానికి పెనుచేటు జరిగింది. మనోభావాలకు అతీతంగా సత్యాలపై ఆలోచన, అవగాహన హిట్లర్‌కు, మరికొంతమందికి ఉండి ఉంటే రెండో ప్రపంచయుద్ధం జరిగేదే కాదు. మనోభావాల వల్ల కుటుంబాల్లోనూ, సమాజంలోనూ, దేశంలోనూ, ప్రపంచంలోనూ ఎన్నో దారుణాలు, ఘోరాలు, నేరాలు జరిగాయి, జరుగుతున్నాయి. చరిత్రను, సమాజాన్ని, మనపక్కన ఉన్న కుటుంబాల్ని పరిశీలిస్తే ఈ సంగతి తెలియవస్తుంది.

మన మనోభావాలను మనవరకే మనం పరిమితం చేసుకోవాలి. మన మనోభావాలకు తగ్గట్టు విషయాల్ని, ఇతరుల్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని పరిగణనలోకి తీసుకోకూడదు. మన మనోభావాల ప్రాధాన్యతకు ఉన్న హద్దుల్ని మనం సరిగ్గా తెలుసుకోవాలి.

మనోభావాలను దాటి సత్యాల ఆవశ్యకతను తెలుసుకుందాం; సత్యాలను ఆకళింపు చేసుకుందాం; సత్యాల వల్ల సత్ఫలితాలను పొందుదాం. సత్యాల సత్వంతో సరైన, సఫలమైన జీవనం చేస్తూ ఉందాం.

– రోచిష్మాన్

అమృత బిందువులు

- మంచి మనుషుల్ని కలుసుకోవడానికి ఎంత దూరం అయినా వెళ్ళాలి. మంచి మనసుల్ని తలుచుకోవడానికి ఎంత గతంలోకి అయినా వెళ్ళాలి. ఆ ఆనందం, సంతోషమే వేరు.
- ఇతరుల మీద గెలవడం వేరు. ఇతరుల మదిలో నిలవడం వేరు.
- ఒకటి ఇబ్బందిపెట్టి లొంగ దీసుకోవడం. రెండవది ప్రేమగా మనసులో నిలిచిపోవడం. ఒకరి మదిలో నిలిచిపోతే, మనం వెళ్ళిపోయినా వారికి గుర్తుండి పోతాము.
- అప్పుడు అప్పుడు అయినా పలకరింపు లేకపోతే ఏ బంధం, ఏ స్నేహం అయినా మరుగున పడుతుంది.

ఈ అనంత లోకంలో నువ్వు వెతికే ప్రతీ సమస్యకి సమాధానం ఎక్కడుందో తెల్సా? నీలోనే ఉంది. అవును నిజంగా నీలోనే. అద్భుతమైన మేధస్సు నీలోనే ఉంది. పదును పెట్టు. అపారమైన తెలివితేటలు నీలోనే ఉన్నాయి. వాటిని ఉపయోగించు. అద్వితీయమైన జ్ఞానం నీ సొంతం. అనిర్వచనీయమైన వివేకం నీ సొంతం. ఇన్ని సుగుణాల కలబోత అయిన నీవు సమస్య వస్తే చతికిలపడిపోతే ఎలా?

బౌద్ధవాణి

ఏ గూటి చిలకకు ఆ గూటి పలుకులు

మనిషి శుద్ధిగా ఉండాలంటే... పరిసరాలు, సమాజం, బంధుగణం, మిత్రజనం శుద్ధిగా ఉండాలి. పరిసరాల్లో ధార్మిక కాలుష్యం లేకుండా ఉంటే... మనిషి నిర్మలంగానే రూపొందుతాడు– అని బుద్ధుడు చెప్పిన కథ ఇది.



ఉత్తర పాంచాల రాజ్య సరిహద్దులో ఒక మలబరీ వనం ఉంది. అందులో ఒక పెద్ద చెట్టు మీద చిలుకల జంట ఉంది. వాటికి రెండు పిల్లలు ఉన్నాయి. ఒక రోజున పెను గాలి రేగింది. సుడి తిరిగింది. చిలుకల గూడు ఆకాశంలోకి లేచింది. కొంత దూరం పోయాక ఆ రెండు చిలుక పిల్లల్లో ఒకటి అడవి మధ్యలో ఉన్న ఒక చిన్న గ్రామంలో పడింది. రెండోది పోయి ఆ అడవికి మరో వైపున ఉన్న పర్ణశాలలో పడింది.

మొదటి పిల్ల పడిన గ్రామం దొంగల గ్రామం. ఆ పిల్లను దొంగల నాయకుడు పెంచసాగాడు. ఆ పిల్లకు శక్తి అని పేరు పెట్టాడు. అలా ఆ శక్తి నిరంతరం కత్తులు, గొడ్డళ్ళ మధ్య కఠోర మాటలు వింటూ పెరిగింది. దాని మనస్సు, ఆలోచనలు క్రూరంగా తయారయ్యాయి.

ఇక రెండో పిల్ల తాను ఉంటున్న పర్ణశాలలో సాధుజనుల మధ్య పెరిగింది. అక్కడ భిక్షువులు పలికే ధర్మ వచనాలు వినడం వల్ల దాని మనస్సు, ఆలోచనలు సాత్వికంగా తయారయ్యాయి. అందమైన పుష్పాల మీద వాలుతూ తిరిగే దానికి అక్కడి భిక్షువులు 'పుష్ప' అని పేరు పెట్టారు.

ఒకరోజు పాంచాల రాజు అడవికి వేటకు వెళ్ళి దారి తప్పాడు. అతని వెంట ఒకే ఒక్క రక్షకుడు మిగిలాడు. వారు అలా పోయి పోయి రాత్రి వేళకు దొంగల గ్రామం దగ్గరలోకి చేరి ఒక పెద్ద చెట్టు కింద ఆగి, నిద్రకు ఉపక్రమించారు.

ఆ సమయానికి శక్తి చిలుక తన మిత్రునితో కలిసి అక్కడికి వచ్చి, రాజును చూసి...

''మిత్రమా! ఇతను చాలా ధనవంతునిలా ఉన్నాడు. వంటి నిండా బంగారు, రత్న ఆభరణాలు ఉన్నాయి. పదునైన చురకత్తిని నోట కరిచి తెచ్చి ఇతగాని కంఠం మీద వదిలి, చంపాలి. అప్పుడు ఈ ఆభరణాలన్నీ మనకు చెందుతాయి'' అంది. రాజుకి పక్షి భాష తెలుసు. చిలుక పలుకులు విన్న రాజుకి భయం కలిగింది. ఇది నిద్రించడానికి తగిన ప్రదేశం కాదనుకుని లేచి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

తెల్లవారేసరికి ఆ అడవిలో మరో చివరన ఉన్న పర్ణశాలకు చేరాడు. రాజు అక్కడికి చేరేసరికి అక్కడి భిక్షువులు ఆహారం కోసం అడవిలోకి వెళ్ళారు. రాజు బాగా అలసిపోయాడు. నీరసించి ఒక చెట్టుకింద కూర్చున్నాడు. వెంటనే అక్కడ ఉన్న పుష్ప అనే చిలుక వారిని చూసింది. మంచినీటి పాత్ర కాళ్ళతో పట్టి తెచ్చి వారి ముందు ఉంచింది. నోట కరచి పండ్లు, దుంపలు తెచ్చి ఇచ్చింది. అతిథి మర్యాదలు చేసింది.

ఒకేరోజు ఆ రెండు చిలుకల ప్రవర్తనలు రాజుకి వింత గొలిపాయి. తన వెంట ఉన్న వానితో ...

''చూశావా! దొంగలూ, హంతకుల దగ్గర పెరిగిన చిలుక క్రూరంగా ఆలోచించింది. కఠినంగా పలికింది. సాధుజనుల చెంత పెరిగిన చిలుక సహాయం చేసింది. సహృదయత చూపింది. సౌమ్యంగా పలికింది. మనిషి కూడా అంతే.. ఎలాంటి వానితో చెలిమి చేస్తే అలాంటి వారుగా మారతాడు. అందుకే.. సజ్జన సాంగత్యం మేలు, దుర్జన సాంగత్యం కీడు కలిగిస్తాయంటారు. నీటిలో చక్కెర కలిపితే తియ్యగా ఉంటుంది. ఉప్పు కలిపితే ఉప్పగా ఉంటుంది. అని చెప్పి చిలుకను దగ్గరకు తీసుకున్నాడు. అది కిలకిల రావాలు చేస్తూ రాజు భుజం మీదకు చేరింది. బుద్ధుడు చెప్పిన ఈ కథ ఎప్పటికీ కాలదోషం పట్టనిది.

ఎలాంటి వానితో చెలిమి చేస్తే అలాంటి వారుగా మారతాడు. అందుకే.. సజ్జన సాంగత్యం మేలు, దుర్జన సాంగత్యం కీడు కలిగిస్తాయంటారు. నీటిలో చక్కెర కలిపితే తియ్యగా ఉంటుంది. ఉప్పు కలిపితే ఉప్పగా ఉంటుంది.



– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



ప్రభాస్

నైట్ మోడ్

'సలార్' యూనిట్ ప్రస్తుతం నైట్ మోడ్‌లో ఉంది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'సలార్'. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాను సెప్టెంబరు 28న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆ్రడీ ప్రకటించింది. దీంతో అనుకున్న సమయానికి సినిమాను విడుదల చేయాలని 'సలార్' టీమ్ షూటింగ్ షెడ్యూల్స్‌ని పక్కాగా ప్లాన్ చేసి, గ్యాప్ రాకుండా చూసుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. నైట్ షూట్ జరుపుతున్నారు. జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్.



రజనీకాంత్

కొచ్చిలో జైలర్

కొచ్చికి మకాం మార్చారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జైలర్'. శివ రాజ్‌కుమార్, సునీల్, రమ్యకృష్ణ, తమన్నా కీలక పాత్రధారులుగా, ఓ అతిథి పాత్రలో మోహన్‌లాల్ నటిస్తున్నారు. 'జైలర్' సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల కొచ్చిలో ప్రారంభమైంది. రజనీకాంత్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరో పది రోజులు ఈ షెడ్యూల్ కొనసాగుతుందని సమాచారం. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు.



మహేశ్‌బాబు

సంక్రాంతికి సై

సంక్రాంతికి సై అంటున్నారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాను సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు ఆదివారం రిలీజ్ డేట్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. ''డేట్ (13.01.2024) సేవ్ చేసుకోండి' అంటూ ట్వీట్ చేశారు మహేశ్‌బాబు. సినిమాలో ఓ యాక్షన్ సీక్వెన్స్ తర్వాత మాస్ అవతారంలో మహేశ్ కనిపిస్తున్న లుక్‌గా ఫస్ట్ లుక్ పోస్టర్ కనిపిస్తోంది. ఈ సినిమాకు సంగీతం: తమన్, కెమెరా: పి.ఎస్. వినోద్.

ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి

– ఆదిత్య ఓం



ఆదిత్య ఓం

''ప్రతీ శుక్రవారం కొత్త సినిమాలు వస్తాయి. కానీ, 'దహనం' లాంటి సినిమాలు ఏ ఐదేళ్లకో, పదేళ్లకో అరుదుగా వస్తాయి. ఇది కమర్షియల్ ప్రాజెక్ట్ కాదు. ప్యాషన్‌తో తీసిన ప్రాజెక్ట్. ఈ సినిమాను ఇంత గొప్పగా తీసిన మా దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అని నటుడు ఆదిత్య ఓం అన్నారు. ఆడారి మూర్తిసాయి దర్శకత్వంలో ఆదిత్య ఓం హీరోగా నటించిన చిత్రం 'దహనం'. డా. పెతకంశెట్టి సతీష్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్, ట్రైలర్ లాంచ్ వేడుక నిర్వహించారు. ''వర్తమాన, భూత, భవిష్యత్ కాలాల్లో నీరు, నిప్పు, గాలితో అవసరం ఉంటుందని చెప్పే కథ ఇది'' అన్నారు ఆడారి మూర్తిసాయి. ''కథ నచ్చి ఈ సినిమా నిర్మించాను'' అని డా. పెతకంశెట్టి సతీష్ కుమార్ అన్నారు. దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి, నిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ్, ప్రసన్న కుమార్, దామోదర్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు, డిస్ట్రిబ్యూటర్ ఆదినారాయణ, నటుడు మాదాల రవి, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మాచలం మాట్లాడారు.

ప్రైవేట్ పోలీస్ స్టేషన్



రక్షిత్

రక్షిత్ అట్లూరి హీరోగా గొల్లపాటి నాగేశ్వరరావు దర్శకత్వంలో 'పోలీస్ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సినిమా షురూ అయింది. విశ్వేశ్వర శర్మ, రాజరాయ్ నిర్మిస్తున్న ఈ మూవీ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత ప్రసన్న కుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ చందు మొండేటి క్లాప్ కొట్టారు అనంతరం గొల్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ–''సస్పెన్స్, యాక్షన్ డ్రామా, పోలీస్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది'' అన్నారు రక్షిత్. ''మా సినిమాలో నటించే ఇతర నటీనటులు, పనిచేసే సాంకేతిక నిపుణల వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అన్నారు విశ్వేశ్వర శర్మ.

కష్టపడితే ఫేమస్ అవుతాం

– మంత్రి మల్లారెడ్డి



శరత్, మల్లారెడ్డి, సుమంత్ ప్రభాస్, చంద్రు మనోహరన్, అనురాగ్

''పాలు అమ్ముకునే నేను ఈ రోజు మంత్రినయ్యాను. యువత కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలి. కష్టపడితే ఆటోమేటిక్‌గా ఫేమస్ అవుతాం. 'మేమ్ ఫేమస్' ట్రైలర్ బాగుంది.. సినిమా హిట్టవుతుంది'' అని తెలంగాణ రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్ర పోషించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మేమ్ ఫేమస్'. మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య, సిరి రాశి ఇతర కీలక పాత్రధారులు. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 2న రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని చామకూర మల్లారెడ్డి రిలీజ్ చేశారు. ''కాలేజీలో ఉన్నపుడు 'పిల్ల పిల్లగా' అనే వెబ్ సిరీస్ చేశాను. నేను సినిమా చేయగలనని నమ్మి, చాన్స్ ఇచ్చిన నిర్మాతలకు రుణపడి ఉంటా'' అన్నారు సుమంత్ ప్రభాస్. ''మా 'రైటర్ పద్మభూషణ్' సినిమాలా 'మేమ్ ఫేమస్'ని కూడా ఆదరించాలి'' అన్నారు నిర్మాతలు.



రాశీ ఖన్నా

పీరియాడికల్ డ్రామాలో...

కోలీవుడ్ నుంచి మళ్లీ కబురు అందుకున్నారు రాశీ ఖన్నా. ఇప్పటికే తమిళంలో అరడజను చిత్రాలకు పైగా చేసిన ఈ బ్యూటీ తాజాగా హీరో జీవా సరసన నటించనున్నారని టాక్. దర్శకుడు పా. విజయ్ తెరకెక్కించనున్న సినిమాలో జీవా హీరోగా, ప్రధాన పాత్రలో అర్జున్ నటించనున్నారు. ఈ పీరియాడికల్ డ్రామా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ చిత్రంలోనే రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించనున్నారని తెలిసింది. ''జీవా, అర్జున్‌గార్ల కాంబినేషన్‌లో గతంలో నేను ఓ సినిమా ప్లాన్ చేశాను. కానీ కుదర్లేదు. ఇప్పుడు నా కొత్త సినిమాకు ఈ ఇద్దరూ ఓకే కావడం హ్యాపీగా ఉంది. మా సినిమా కోసం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో సెట్ వేస్తున్నాం. సెట్ పూర్తి కాగానే షూటింగ్ ప్రారంభిస్తాం. ఆ తర్వాత ఊటీ, కొడైకెనాల్‌లో చిత్రీకరణ ప్లాన్ చేశాం'' అని పేర్కొన్నారు పా. విజయ్. అయితే రాశీ ఖన్నా విషయంపై విజయ్ క్లారిటీ ఇవ్వలేదు. త్వరలో అధికారికంగా ప్రకటించాలని అనుకుంటున్నారట.

పడిపోతున్నా నిన్ను చూస్తూ...



మధుబాల

గీతానంద్, నేహా సోలంకి జంటగా, మధుబాల, ఆదిత్య మీనన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అశ్విన్–అరుణ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పడిపోతున్నా నిన్ను చూస్తూ...' అనే సెకండ్ లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. కిట్టు విస్సా ప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి–హారిక నారాయణ్ పాడారు. రవి కస్తూరి మాట్లాడుతూ–''గేమ్ ఆన్'కి అన్నతమ్ముళ్లు అయిన గీతానంద్, దయానంద్ హీరోగా, డైరెక్టర్‌గా పోటీపడి పని చేయడం విశేషం'' అన్నారు.

ఈ రిస్క్ హిట్టవ్వాలి

– యంయస్ రాజు



ఘంటాడి కృష్ణ, యంయస్ రాజు

సందీప్ అశ్వా హీరోగా మ్యూజిక్ డైరెక్టర్ ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'రిస్క్'. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. 'సిక్స్ టీన్స్' సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలోని 'సొగసుకే సోకు' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. తెలుగు వెర్షన్‌ను సిధ్ శ్రీరామ్ పాడారు. ఈ పాట విడుదల వేడుకలో 'రిస్క్' సినిమా తెలుగు మోషన్ పోస్టర్ విడుదల చేసిన నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ – ''ఈ సినిమాతో హీరో సందీప్, దర్శకుడు ఘంటాడి కృష్ణకు పాన్ ఇండియా సక్సెస్ రావాలి''అన్నారు. ''ఈ రిస్క్ తప్పక విజయం సాధించాలి'' అన్నారు దర్శక–నిర్మాత యంయస్. రాజు. ''ఈ చిత్రం పూర్తి కావడంలో నాకు సహకరించిన చిత్ర యూనిట్‌కు ధన్యవాదాలు'' అన్నారు ఘంటాడి కృష్ణ.

ఏందిరా ఈ పంచాయితీ



విషికా, భరత్

భరత్, విషికా లక్ష్మణ్ జంటగా నటిస్తున్న సినిమా 'ఏందిరా ఈ పంచాయితీ'. గంగాధర. టి దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాను ఎం. ప్రదీప్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోను విడుదల చేసింది చిత్రబృందం. ''ఒక ఊర్లో ఉండే సహజమైన వాతావరణాన్ని చూపించనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పెద్దపల్లి రోహిత్, కెమెరా: సతీష్ మాసం.

ప్రేమ కథ



విద్య

తోట కార్తీక్, అమన్, విద్య క్రిష్ణ హీరో హీరోయిన్లుగా నటించనున్న చిత్రం 'ఏది ప్రేమ కథ'. కీర్తన సమర్పణలో నంద్యాల టి. ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై రమేష్ తోడేటి నిర్మించనున్నారు. ''రాయలసీమ జిల్లాలైన నంద్యాల, కర్నూలు లొకేషన్స్‌లో ఈ సినిమా చిత్రీకరణను ప్లాన్ చేశాం. విభిన్నమైన ప్రేమకథా చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా యువతను, మహిళలను ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు రమేష్.

నిఖత్ తడాఖా

రెండోసారి విశ్వవిజేతగా భారత స్టార్ బాక్సర్ • ఫైనల్లో ఆసియా చాంపియన్‌పై విజయం
రూ. 82 లక్షల 34 వేల ప్రైజ్‌మనీ సొంతం • లవ్లీనా ఖాతాలోనూ స్వర్ణం

సొంతగడ్డపై భారత మహిళా బాక్సర్లు పసిడి పంచ్‌లతో అదరగొట్టారు. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో తమ అత్యుత్తమ 'స్వర్ణ' ప్రదర్శనను సమం చేశారు. ఆదివారం ముగిసిన ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగు బంగారు పతకాలతో తమ ప్రస్థానాన్ని ముగించింది. శనివారం నీతూ (48 కేజీలు), స్వీటీ (81 కేజీలు) పసిడి పతకాలు సాధించగా... ఆదివారం నిఖత్ జరీన్ (50 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) 'గోల్డెన్' ఫినిషింగ్ ఇచ్చారు.


నిఖత్


స్వర్ణ పతకంతో నిఖత్

న్యూఢిల్లీ: గత ఏడాది తాను సాధించిన ప్రపంచ చాంపియన్‌షిప్ పసిడి పతకం గాలివాటమేమీ కాదని భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ నిరూపించింది. ఈ తెలంగాణ అమ్మాయి వరుసగా రెండో ఏడాది ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది. న్యూఢిల్లీలో ఆదివారం ముగిసిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో 26 ఏళ్ల నిఖత్ 50 కేజీల విభాగంలో విజేతగా అవతరించింది. ఫైనల్లో నిఖత్ 5–0తో రెండుసార్లు ఆసియా చాంపియన్‌గా నిలిచిన ఎన్గుయెన్ థి టామ్ (వియత్నాం)పై గెలుపొందింది. గత ఏడాది తుర్కియేలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిఖత్ 52 కేజీల విభాగంలో బంగారు పతకం గెలిచింది. తాజా ప్రదర్శనతో నిఖత్ ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో రెండు స్వర్ణ పతకాలు గెలిచిన రెండో భారతీయ బాక్సర్‌గా గుర్తింపు పొందింది. దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆరు స్వర్ణాలు, ఒక రజతంతో కలిపి ఏడు పతకాలు సాధించింది. 2006లో న్యూఢిల్లీయే ఆతిథ్యమిచ్చిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతంతో కలిపి ఐదు పతకాలు గెలిచింది.

దూకుడుగా...

థి టామ్‌తో జరిగిన ఫైనల్లో నిఖత్ ఆద్యంతం దూకుడుగా ఆడింది. ఒకవైపు అవకాశం దొరికినపుడల్లా ప్రత్యర్థిపై పంచ్‌ల వర్షం కురిపించింది. మరోవైపు ప్రత్యర్థి విసిరిన పంచ్‌లను కాచుకుంది. తొలి రౌండ్‌లో నిఖత్‌ను ఒడిసిపట్టుకొని కింద పడేసినందుకు వియత్నాం బాక్సర్‌కు రిఫరీ పెనాల్టీ పాయింట్ విధించారు. ఆ తర్వాత నిఖత్ ఎదురుదాడికి దిగి రెండు రైట్ హుక్ పంచ్‌లతో, ఆ తర్వాత స్ట్రెయిట్ పంచ్‌లతో విరుచుకుపడింది. ఫలితం తొలి రౌండ్‌లో నిఖత్‌దే పైచేయిగా నిలిచింది. రెండో రౌండ్‌లో థి టామ్ పుంజుకుంది. నిర్ణాయక మూడో రౌండ్‌లో నిఖత్ మళ్లీ జోరు పెంచింది. నిఖత్ సంధించిన పంచ్‌కు వియత్నాం బాక్సర్‌కు దిమ్మదిరిగిపోయేలా చేసింది. చివరకు నిఖత్ అదే జోరు కొనసాగించి విజయాన్ని ఖరారు చేసుకుంది. టోర్నీ మొత్తం నిలకడగా రాణించిన నిఖత్‌కు 'బెస్ట్ బాక్సర్' అవార్డు కూడా లభించింది. విజేతగా నిలిచిన నిఖత్‌కు లక్ష డాలర్లు (రూ. 82 లక్షల 34 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 'బెస్ట్ బాక్సర్' పురస్కారం కింద 'మహీంద్రా థార్' వాహనం లభించింది.

ఓవరాల్ చాంపియన్ భారత్

ఆతిథ్య భారత్ నాలుగు స్వర్ణ పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. చైనా మూడు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో ఏడు పతకాలతో రన్నరప్‌గా నిలిచింది. ర్యాంక్ వర్గీకరణలో నెగ్గిన స్వర్ణ పతకాల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటారు. రష్యా ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో మూడు పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. మొత్తం 12 వెయిట్ కేటగిరీలలో 48 పతకాల కోసం బౌట్‌లు జరగ్గా... 20 దేశాలు కనీసం ఒక్క పతకమైనా సాధించాయి. రష్యా బాక్సర్లను అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వడంపై పలు దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఐబీఏ నిర్ణయాన్ని నిరసిస్తూ 17 దేశాలు ఈ పోటీలకు దూరంగా ఉన్నాయి.

> రెండోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. అందులోనూ ఒలింపిక్ కేటగిరీలో స్వర్ణం గెలవడం ఇంకా సంతృప్తినిచ్చింది. టోర్నీలో సహజంగానే నా దృష్టిలో ఇదే కఠినమైన బౌట్. ఆమె ఆసియా చాంపియన్. హోరాహోరీగా తలపడ్డాం. కామన్వెల్త్ క్రీడల్లో నేను పెద్దగా పోటీని ఎదుర్కోలేదు. ఈ తర్వాత ఇక్కడే మళ్లీ బరిలోకి దిగాను. కానీ ఇక్కడ ప్రపంచ స్థాయి ప్రత్యర్థులతో వరుస బౌట్‌లలో తలపడాల్సి వచ్చింది. అందుకే కొన్నిసార్లు నేను వేగంగా కదల్లేకపోయాను. ఫైనల్లో మాత్రం చివరి బౌట్ కాబట్టి పూర్తి శక్తిసామర్థ్యాలు వాడాలని నిశ్చయించుకున్నా. వంద శాతంకంటే ఎక్కువ ప్రయత్నించా. గత ఏడాది పతకంతో పోలిస్తే ఇది ఎక్కువ శ్రమతో వచ్చింది. దీని కోసం బరువు తగ్గించుకొని ఎంతో కష్టపడాల్సి వచ్చింది. సన్నాహానికి సమయం తక్కువగా ఉన్నా పూర్తి ఏకాగ్రతతో సాధన చేశా. ఉత్తమ బాక్సర్‌గా మహీంద్రా థార్ వాహనం బహుమతిగా వచ్చింది కాబట్టి ప్రస్తుతానికి నాకు వచ్చిన ప్రైజ్‌మనీతో అమ్మా, నాన్నను హజ్ యాత్రకు పంపిస్తా.
>
> –నిఖత్ జరీన్



లవ్లీనా తొలిసారి...

అస్సాం బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ మూడో ప్రయత్నంలో ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. 2018, 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న లవ్లీనా ఈసారి మాత్రం విశ్వవిజేతగా నిలిచింది. ఫైనల్లో లవ్లీనా 5–2తో కైట్లిన్ పార్కర్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించింది. చాంపియన్‌గా నిలిచిన లవ్లీనాకు లక్ష డాలర్లు (రూ. 82 లక్షల 34 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

'పంచ్' పదును పెరిగింది

సాక్షి క్రీడా విభాగం

మే 19, 2022... నిఖత్ జరీన్ తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. అప్పటి వరకు ఆమెకు ఉన్న గుర్తింపు వేరు. ఒకసారి యూత్ వరల్డ్ చాంపియన్‌గా, మరోసారి రన్నరప్‌గా నిలిచినా సరే, సీనియర్ స్థాయికి వచ్చేసరికి కనుమరుగైన వారి జాబితాలో ఆమె కూడా చేరుతుందని చాలా మంది అనుకున్నారు. ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యంతో పాటు మరో ఆరు అంతర్జాతీయ పతకాలు సాధించినా నిఖత్‌పై ఎక్కువగా అంచనాలు లేవు. ఆమె ప్రదర్శనపై కూడా ఫర్వాలేదన్న వారే తప్ప అద్భుతం అని, ముస్ముందు గొప్ప విజయాలు సాధించగలదని ఎవరూ ఊహించలేదు. అందుకు కారణం అప్పటికే ఉత్తరాది, ముఖ్యంగా హరియాణా బాక్సర్లతోనే భారత బృందం నిండి ఉంది. ఆటా వారిదే, ఫలితాలు వారి నుంచే అన్నట్లుగా పరిస్థితి ఉంది. పైగా మేరీకోమ్‌తో పోటీ పడేందుకు సిద్ధపడి అదేదో తప్పు చేసినట్లుగా తన ప్రమేయం లేకుండానే చాలా మంది దృష్టిలో నిఖత్ విలన్‌గా మారిపోయింది. కానీ...కానీ...ఒక్క అద్భుత ప్రదర్శన అంతా మార్చేసింది... వరల్డ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో నిఖత్ సత్తా అందరికీ అర్థమైంది. నిఖత్ ప్రతిభను ప్రపంచం గుర్తించింది. భారత్ నుంచి విశ్వ వేదికపై నిలబడగల అథ్లెట్ల జాబితాలో ఆమె కూడా చేరింది.

అసలు కర్తవ్యంపైనే దృష్టి...

గత వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణం నుంచి నిఖత్ ప్రయాణం కొత్తగా మొదలైంది. ఎందుకంటే అగ్రశ్రేణి ఆటగాళ్లు విజయాలు సాధించడం మాత్రమే కాదు, వాటిని కొనసాగించడం, నిలబెట్టుకోవడం కూడా చాలా ముఖ్యం. గొప్ప ఘనత తర్వాత వచ్చే కీర్తి కనకాదులు, ప్రచారాలు ప్లేయర్లను ఒక్కసారిగా ఆటకు దూరం చేసిన ఘటనలు గతంలో ఎన్నో జరిగాయి. సరిగ్గా ఈ విషయంలోనే నిఖత్ తడబడలేదు. వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత ఎన్నో ప్రచార, బ్రాండింగ్ కార్యక్రమాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలకు ఆహ్వానాలు, ప్రారంభోత్సవాలు, ఆపై టీవీ, సినిమా షోలు, అవార్డుల స్వీకరణ... ఇలా ఒక్కసారిగా నిఖత్ బిజీగా మారిపోయింది. అయితే ఈ సమయంలోనూ ఆమె తన అసలు కర్తవ్యాన్ని మరచిపోలేదు.

వెయిట్ కేటగిరీ మారినా...

గత విజయం తర్వాత నిఖత్ ముందు నిలిచిన పెద్ద సవాల్ వెయిట్ కేటగిరీ! 2022 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఆమె 52 కేజీల విభాగంలో టైటిల్ సాధించింది. దాంతో పారిస్ ఒలింపిక్స్–2024 అనేది అసలు లక్ష్యంగా మారింది. అయితే వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో 52 కేజీల విభాగం లేకపోవడంతో తప్పనిసరిగా దానిని మార్చుకోవాల్సి వచ్చింది. ముందుకెళితే 54 కేజీల్లో అప్పటికే అక్కడ సత్తా చాటుతున్న అంతర్జాతీయ స్టార్ బాక్సర్లు, అనుభవజ్ఞులు ఉంటారు. దాంతో తన పంచ్ పవర్ పదును పని చేసేందుకు వెయిట్ తగ్గడమే సరైందని భావించి 50 కేజీలకు మారింది. దానికి అనుగుణంగా తన బరువును మార్చుకొని తీవ్రంగా సాధన చేసింది. భారత కోచ్ జాన్ వార్‌బర్టన్ సాధన విషయంలో నిఖత్‌కు అన్ని రకాలుగా సరైన దిశానిర్దేశం చేశారు. ఆమె శ్రమ ఫలితం బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో కనిపించింది. వరల్డ్ చాంపియన్‌గా తన స్థాయిని ప్రదర్శిస్తూ అక్కడ సునాయాసంగా స్వర్ణం గెలుచుకుంది. అదీ తాను కొత్తగా మొదలుపెట్టిన 50 కేజీల కేటగిరీలో కావడంతో తన ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఆపై మరో ఐదు నెలలకు వచ్చిన జాతీయ చాంపియన్‌షిప్‌లో నిఖత్‌కు మొదటి స్థానం లాంఛనమే అయింది. ఈ ఏడాది వ్యవధిలో ఆమె ఈ రెండు ఈవెంట్లు మినహా మరే టోర్నీలోనూ పాల్గొనలేదు. విదేశాల్లో కొన్ని టోర్నమెంట్‌లకు ఆహ్వానాలు అందినా... తన ఆట మెరుగవ్వాలంటే అలాంటి టోర్నీలలో ఆడి 'విజేత' అనిపించుకోవడంకంటే ప్రాక్టీస్ చేయడమే సరైందని జరీన్ భావించింది. చివరకు దాంతో ఫలితాన్ని అందుకుంది.



ఆద్యంతం ఆధిపత్యం...

సొంతగడ్డపై జరిగిన ఈ టోర్నీలో ఆద్యంతం నిఖత్ ఆధిపత్యం కనిపించింది. సెమీస్ మినహా మిగిలిన బౌట్‌లలో ఎక్కడా తడబాటు లేకుండా ఆమె అలవోక విజయాలు అందుకుంది. ఒక బౌట్‌లో ఆర్‌ఎస్‌సీ (రిఫరీ స్టాప్స్ ద కంటెస్ట్), 4 బౌట్‌లలో 5–0తో నెగ్గిన ఆమె ఒక్క సెమీస్‌లో 5–2తో ప్రత్యర్థికి కాస్త అవకాశం ఇచ్చింది. తాజా విజయంతో ఈ కేటగిరీలో నిఖత్ తన స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. ఇకపై పారిస్ ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగాల్సి ఉంది. ఇదే తరహా ఆటను కొనసాగిస్తే ప్రపంచంలోని అత్యుత్తమ, మెగా ఈవెంట్‌లో కూడా పతకం అందుకోవడం అసాధ్యం కాబోదు!



విజేత ముంబై ఇండియన్స్

- డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం
- 'తొలి' టైటిల్ అందుకున్న హర్మన్ బృందం
- గెలిపించిన మాథ్యూస్, నాట్ సివర్

ముంబై: తొలి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నమెంట్ టైటిల్‌ను ముంబై ఇండియన్స్ సొంతం చేసుకుంది. టోర్నీ ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తుది పోరులోనూ సమష్టి ప్రదర్శనతో అదే జోరును కొనసాగించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 131 పరుగులు చేయగా...ముంబై 19.3 ఓవర్లలో 3 వికెట్లకు 134 పరుగులు సాధించింది. ముంబై బౌలింగ్ ధాటికి ఢిల్లీ ఆరంభం నుంచే తడబడింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (29 బంతుల్లో 35; 5 ఫోర్లు) మినహా అంతా విఫలం కావడంతో టపటపా వికెట్లు కోల్పోయింది. దాంతో స్కోరు 79/9కు చేరింది. అయితే ఆఖరి వికెట్‌కు రాధ యాదవ్ (12 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శిఖా పాండే (17 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగి 24 బంతుల్లోనే అభేద్యంగా 52 పరుగులు జోడించడంతో కాస్త గౌరవప్రదమైన స్కోరు దక్కింది. అనంతరం ముంబై కూడా 23 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాట్ సివర్ బ్రంట్ (55 బంతుల్లో 60 నాటౌట్; 7 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (39 బంతుల్లో 37; 5 ఫోర్లు) మూడో వికెట్‌కు 74 బంతుల్లో 72 పరుగులు జోడించి జట్టును విజయం దిశగా నడిపించారు.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (రనౌట్) 35; షఫాలీ (సి) కెర్ (బి) వాంగ్ 11; క్యాప్సీ (సి) అమన్‌జోత్ (బి) వాంగ్ 0; జెమీమా (సి) మాథ్యూస్ (బి) వాంగ్ 9; మరిజాన్ కాప్ (సి) యస్తిక (బి) కెర్ 18; జొనాసెన్ (సి అండ్ బి) మాథ్యూస్ 2; అరుంధతి రెడ్డి (సి) ఇషాక్ (బి) కెర్ 0; శిఖా పాండే (నాటౌట్) 27; మిన్ను (సి) యస్తిక (బి) మాథ్యూస్ 1; తానియా (బి) మాథ్యూస్ 0; రాధ (నాటౌట్) 27; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1–12, 2–12, 3–35, 4–73, 5–74, 6–75, 7–75, 8–79, 9–79. **బౌలింగ్:** నాట్ సివర్ 4–0–37–0, ఇసీ వాంగ్ 4–0–42–3, సైకా ఇషాక్ 4–0–28–0, అమేలియా కెర్ 4–0–18–2, హేలీ మాథ్యూస్ 4–2–5–3.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (సి) అరుంధతి (బి) జొనాసెన్ 13; యస్తిక (సి) క్యాప్సీ (బి) రాధ 4; నాట్ సివర్ (నాటౌట్) 60; హర్మన్‌ప్రీత్ (రనౌట్) 37; అమేలియా కెర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19.3 ఓవర్లలో 3 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1–13, 2–23, 3–95. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4–0–22–0, రాధ యాదవ్ 4–0–24–1, జొనాసెన్ 4–0–28–1, శిఖా పాండే 4–0–23–0, అలైస్ క్యాప్సీ 3.3–0–34–0.

345 డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా మెగ్ లానింగ్ (ఢిల్లీ క్యాపిటల్స్) నిలిచింది. ఆమె 9 మ్యాచ్‌లు ఆడి రెండు అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 345 పరుగులు సాధించింది.

16 డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లుగా హేలీ మాథ్యూస్ (ముంబై), సోఫీ ఎకెల్‌స్టోన్ (యూపీ వారియర్స్) నిలిచారు. వీరిద్దరు 16 వికెట్ల చొప్పున తీశారు.

జడేజాకు ప్రమోషన్... భరత్‌కు చోటు


జడేజా


భరత్

బీసీసీఐ కాంట్రాక్ట్‌ల ప్రకటన

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆటగాళ్లకు సంబంధించిన వార్షిక కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. గత ఏడాది 'ఎ' గ్రేడ్‌లో ఉన్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ప్రమోషన్ సాధించి 'ఎ ప్లస్' గ్రేడ్‌లో చోటు దక్కించుకున్నాడు. మరోవైపు వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న కేఎల్ రాహుల్ ఇప్పటి వరకు 'ఎ' గ్రేడ్‌లో ఉండగా, ఇప్పుడు 'బి'కి పడిపోయాడు. నిలకడగా రాణిస్తున్న అక్షర్ పటేల్‌కు 'ఎ' గ్రేడ్‌లోకి ప్రమోషన్ లభించగా, ఇటీవలే ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌తో అరంగేట్రం చేసిన ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి బోర్డు కాంట్రాక్ట్ (సి గ్రేడ్) దక్కడం విశేషం. మరో వైపు సీనియర్ ఆటగాళ్లు అజింక్య రహానే, ఇషాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్‌లు తమ కాంట్రాక్ట్‌లు కోల్పోయారు.

కాంట్రాక్ట్ జాబితా (మొత్తం 26 మంది)

'ఎ ప్లస్' గ్రేడ్ (రూ. 7 కోట్లు): రోహిత్, కోహ్లి, బుమ్రా, జడేజా.

'ఎ' గ్రేడ్ (రూ. 5 కోట్లు): హార్దిక్ పాండ్యా, అశ్విన్, షమీ, రిషభ్ పంత్, అక్షర్ పటేల్.

'బి' గ్రేడ్ (రూ. 3 కోట్లు): పుజారా, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, సిరాజ్, సూర్యకుమార్ యాదవ్, శుబ్‌మన్ గిల్.

'సి' గ్రేడ్ (రూ. 1 కోటి): ఉమేశ్ యాదవ్, శిఖర్ ధావన్, శార్దుల్ ఠాకూర్, ఇషాన్ కిషన్, దీపక్ హుడా, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, సంజూ సామ్సన్, అర్ష్‌దీప్ సింగ్, కోన శ్రీకర్ భరత్.

సాత్విక్–చిరాగ్ జోడీకి టైటిల్

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ


చిరాగ్ శెట్టి సాత్విక్

బాసెల్: కీలకదశలో పట్టుదల కోల్పోకుండా ఆడిన భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో పురుషుల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 68 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో పురుషుల డబుల్స్ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ జోడీగా సాత్విక్–చిరాగ్ గుర్తింపు పొందింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో రెండో సీడ్ సాత్విక్–చిరాగ్ జంట 54 నిమిషాల్లో 21–19, 24–22తో రెన్ జియాంగ్ యు–టాన్ కియాంగ్ (చైనా) జోడీపై విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టిలకు ఈ ఏడాది ఇదే తొలి టైటిల్ కాగా, ఓవరాల్‌గా ఐదో టైటిల్. విజేతగా నిలిచిన సాత్విక్–చిరాగ్ జోడీకి 16,590 డాలర్ల (రూ. 13 లక్షల 66 వేలు) ప్రైజ్‌మనీ, 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

5 సాత్విక్–చిరాగ్ కెరీర్‌లో గెలిచిన వరల్డ్ టూర్ డబుల్స్ టైటిల్స్. స్విస్ ఓపెన్ కంటే ముందు ఈ జంట హైదరాబాద్ ఓపెన్ (2018), థాయ్‌లాండ్ ఓపెన్ (2019), ఫ్రెంచ్ ఓపెన్ (2022), ఇండియా ఓపెన్ (2022) టోర్నీల్లో విజేతగా నిలిచారు.

7 స్విస్ ఓపెన్‌లో భారత్ ప్లేయర్లకు టైటిల్ దక్కడం ఇది ఏడోసారి. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ (2011, 2012), పీవీ సింధు (2022)... పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ (2015), హెచ్‌ఎస్ ప్రణయ్ (2016), సమీర్ వర్మ (2018)... పురుషుల డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ (2023) విజేతగా నిలిచారు.

కాంస్యంతో ముగింపు

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండో స్థానం


సిఫ్ట్ కౌర్ సామ్రా

భోపాల్: ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌ను భారత్ కాంస్య పతకంతో ముగించింది. చివరిరోజు ఆదివారం భారత్ ఖాతాలో ఒక కాంస్య పతకం చేరింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా మూడో స్థానంలో నిలిచింది. ఎంబీబీఎస్ చదువుతోన్న పంజాబ్‌కు చెందిన 21 ఏళ్ల సిఫ్ట్ కౌర్ క్వాలిఫయింగ్‌లో 588 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానంలో నిలిచి ర్యాంకింగ్ రౌండ్‌కు అర్హత సాధించింది. ఎనిమిది మంది పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో సిఫ్ట్ కౌర్ 403.9 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. సిఫ్ట్ కౌర్‌కిది రెండో ప్రపంచకప్ పతకం. గత ఏడాది కొరియాలో జరిగిన ప్రపంచకప్‌లోనూ ఆమె కాంస్య పతకం సాధించింది. సొంతగడ్డపై జరిగిన ప్రపంచకప్‌లో ఓవరాల్‌గా భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, ఐదు కాంస్యాలతో కలిపి మొత్తం ఏడు పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. చైనా ఎనిమిది స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్యాలతో కలిపి మొత్తం 12 పతకాలతో టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది.

హంపి, హారిక తొలి గేమ్ 'డ్రా'



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీని భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక 'డ్రా'తో ప్రారంభించారు. ఆదివారం జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో వీరిద్దరు ముఖాముఖిగా తలపడ్డారు. తెల్లపావులతో ఆడిన హంపి 31 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. భారత్‌కే చెందిన అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) వైశాలికి తొలి గేమ్‌లో 'వాకోవర్' లభించింది. ఆమెతో తొలి రౌండ్‌లో తలపడాల్సిన జర్మనీ గ్రాండ్‌మాస్టర్ ఎలిజబెత్ పాట్జ్ టోర్నీ నుంచి వైదొలిగింది. దాంతో తొలి గేమ్‌లో వైశాలిని విజేతగా ప్రకటించారు. టోర్నీ నిర్వాహకుల నిర్వహణ వైఫల్యాల కారణంగానే తాను టోర్నీ నుంచి తప్పుకుంటున్నానని ఎలిజబెత్ తెలిపింది. నిర్వాహకుల తీరుపై ఆగ్రహంతో కజకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ జాన్సయ అబ్దుమలిక్ కూడా ఈ టోర్నీ నుంచి వైదొలిగింది.

బోపన్న జోడీకి షాక్



ఫ్లోరిడా: గతవారం ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గిన రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ... మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో మాత్రం నిరాశపరిచింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 5–7, 6–4, 4–10తో 'సూపర్ టైబ్రేక్'లో కెవిన్ క్రావిట్జ్ (జర్మనీ)–ఫాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ 11 ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. కీలకమైన సూపర్ టైబ్రేక్‌లో మాత్రం బోపన్న, ఎబ్డెన్ తడబడి ఓటమి చవిచూశారు. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న–ఎబ్డెన్ జోడీకి 18,020 డాలర్ల (రూ. 14 లక్షల 83 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

దక్షిణాఫ్రికా రికార్డు ఛేదన

- రెండో టి20లో విండీస్ ఓటమి
- చార్లెస్, డికాక్ మెరుపు శతకాలు


డికాక్

సెంచూరియన్: అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులను ఛేదించిన జట్టుగా దక్షిణాఫ్రికా కొత్త రికార్డు సృష్టించింది. ఆదివారం జరిగిన రెండో టి20లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. ముందుగా విండీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. జాన్సన్ చార్లెస్ (46 బంతుల్లో 118; 10 ఫోర్లు, 11 సిక్స్‌లు) మెరుపు వేగంతో 39 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. అనంతరం సఫారీ టీమ్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 259 పరుగులు చేసి గెలిచింది. క్వింటన్ డి కాక్ (44 బంతుల్లో 100; 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) దూకుడుగా ఆడి 43 బంతుల్లో శతకం బాదగా, హెన్‌డ్రిక్స్ (28 బంతుల్లో 68; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండగా నిలిచాడు. దాంతో మరో 7 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా రికార్డు విజయాన్ని అందుకుంది. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక ఛేదన రికార్డు ఆస్ట్రేలియా (245/5) జట్టు పేరిట ఉంది. 2018లో న్యూజిలాండ్ జట్టుతో (20 ఓవర్లలో 243/6)తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఈ రికార్డు నమోదు చేసింది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	398	57,527
నిఫ్టీ ▽	132	16,945

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	11,824	△ 37
డోజోన్స్	32,238	△ 132
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,405	▽ 94
డాక్స్	14,957	▽ 253
షాంఘై	3,266	▽ 21
నికాయ్	27,385	▽ 34

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

రేట్ల పెంపు రూటు.. ఇంటికి దారెటు?





- గృహ రుణం ఫ్లోటింగ్ రేటుతో లాభ, నష్టాలు
- వడ్డీ రేట్లు పెరిగే తరుణంలో భారం
- రుణ కాల వ్యవధిని పెంచుకోవచ్చు
- లేదంటే ఈఎంఐ పెంపు
- ఫిక్స్‌డ్ రేటు 2 శాతం ఎక్కువ
- ముందస్తు సన్నద్ధత కావాల్సిందే..
- ఆదాయానికి తగ్గట్టు అదనపు చెల్లింపులు

సొంతింటి కలను రుణం సాకారం చేస్తుంది. రుణం తీసుకోకపోయినా సొంతిల్లు సమకూర్చుకోవచ్చు. కాకపోతే మధ్య తరగతి వాసులు రుణం జోలికి వెళ్లకుండా ఉండాలంటే.. దీర్ఘ కాలం పాటు క్రమశిక్షణతో పొదుపు, మదుపు చేసినప్పుడే ఇంటి కొనుగోలుకు కావాల్సినంత సమకూరుతుంది. అదే గృహ రుణం అయితే, కొన్నేళ్ల ముందుగానే ఇంటి కల నెరవేరుతుంది. పైగా రుణం తీసుకున్న తర్వాత ఎలా అయిన తీర్చాల్సిన బాధ్యత ఉంటుంది. కనుక దానికి కట్టుబడి ఉంటాం. కానీ, 20-30 ఏళ్ల పాటు ఇంటి కోసం పొదుపు చేసే క్రమంలో.. జీవితంలో వచ్చే ముఖ్యమైన అవసరాల కోసం గృహ రుణ నిధి విషయంలో రాజీపడే ప్రమాదం ఉంటుంది. కనుక గృహ రుణం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. కాకపోతే, గృహ రుణం విషయంలో సరైన ప్రణాళిక, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే సమస్యలు ఎదురైనప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆర్థిక సమస్యలూ, ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి రావచ్చు. గృహ రుణం అంటే చాలా పెద్ద మొత్తంలోనే ఉంటుంది. కనుక దీనిపై వడ్డీ రేట్ల ప్రభావం కూడా ఎక్కువే. గత 10 నెలలుగా వడ్డీ రేట్లు అసాధారణంగా పెరిగాయి. రుణం తీసుకున్న వారు, తీసుకోబోయే వారు ఈ రిస్కులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. పెద్ద మొత్తంలో గృహ రుణం తీసుకునే ముందు తప్పకుండా గమనించాల్సిన అంశాలేంటో ఈ కథనంలో చూద్దాం...

గృహ రుణంపై ఫ్లోటింగ్ రేటు చాలా తక్కువ రేటు ఆప్షన్లలో ఒకటి. అదే ఫిక్స్‌డ్ రేటు (స్థిరంగా ఉండే వడ్డీ రేటు, అదీ కొన్నేళ్ల పాటే) అయితే చాలా ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఫ్లోటింగ్ రేటు కంటే ఫిక్స్‌డ్ వడ్డీ రేటు 2 శాతం అధికంగా ఉంటుంది. గృహ రుణం తీసుకునే వారిలో ఎక్కువ మంది ఫ్లోటింగ్ రేటును ఎంపిక చేసుకోవడానికి ఈ వ్యత్యాసమే కారణం. కానీ, ఫ్లోటింగ్ రేటు అన్నది రెండు వైపులా పదునున్న కత్తి మాదిరే అనుకోవాలి. వడ్డీ రేట్లు తగ్గిపోయే క్రమంలో ఫ్లోటింగ్ రేటు వల్ల ఎంతో ఉపశమనం లభిస్తుంది. కానీ, అదే వడ్డీ రేట్లు పెరిగిపోయే తరుణంలో రుణ గ్రహీతలను మరింతగా బాధిస్తుంది. ఫ్లోటింగ్ రేటుపై గృహ రుణాలు తీసుకుంటే, అవి రెపో రేటుకు అనుసంధానమై ఉంటాయి. అందుకని ఫ్లోటింగ్ రేటుపై గృహ రుణం తీసుకునే వారు, వడ్డీ రేట్లు పెరిగే సమయంలో అదనంగా చెల్లించేందుకు ముందుగానే సన్నద్ధం కావాల్సి ఉంటుంది.

రేట్లు ఇంకా పెరగొచ్చు

సవాళ్లు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు సాధారణంగా అవి తొందరగా ముగిసిపోవాలని కోరుకుంటారు. కానీ, వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో ఇలాంటి కోరికలు నెరవేరవు. ఆర్‌బీఐ గతేడాది మే నుంచి రెపో రేటును 2.5 శాతం పెంచింది. రెపో రేటు ప్రస్తుతం 6.5 శాతంగా ఉంది. చాలా మంది నిపుణులు రెపో రేటు 6.5 శాతానికి చేరిన వెంటనే వడ్డీ రేట్ల పెంపు ముగుస్తుందని లోగడ అంచనా వేశారు. కానీ, పరిస్థితులు తర్వాత మారిపోయాయి. అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం సమస్యాత్మకంగా తయారైంది. అందుకే అన్ని కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపు విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీంతో రుణ గ్రహీతలు మరో విడత లేదంటే, మరిన్నిసార్లు రెపో రేటు పెంపును చూడాల్సి రావచ్చని నిపుణులు అంటున్నారు.

చాలా సైకిల్స్

వడ్డీ రేట్లన్నవి ఆర్థిక చక్ర భ్రమణాల మాదిరే ఉంటాయి. పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. మరి గృహ రుణం అంటే ఎంత లేదన్నా 20 ఏళ్లు, అంతకంటే ఎక్కువ కాలానికి తీసుకుంటూ ఉంటారు. దీంతో వడ్డీ రేట్ల సైకిల్స్ ఎన్నో వచ్చి పోతుంటాయి. దీనిపై రుణం తీసుకునే వారు ముందుగానే అవగాహన కలిగి ఉండాలి. గృహ రుణం ఈఎంఐ అనేది ఆర్జించే వేతనంలో 40 శాతం మించకుండా చూసుకుంటే, ఇలాంటి ఆర్థిక అనిశ్చితులు, వడ్డీ రేట్ల పెరుగుదలను ధైర్యంగా ఎదుర్కోవచ్చు.

సరైన సమయం కోసం వేచి చూడొద్దు

ఏదీ శాశ్వతం కాదు. కనిష్ఠ వడ్డీ రేట్లు అయినా, గరిష్ఠ వడ్డీ రేట్లు అయినా ఒక నిర్ణీత కాలం పాటే కొనసాగుతాయి. ఉదాహరణకు 20 ఏళ్ల గృహ రుణ కాలవ్యవధిలో ఒకటి నుంచి రెండు సైకిల్స్ అధిక వడ్డీ రేట్లు ఉండొచ్చు. కనుక కనిష్ఠ వడ్డీ రేట్లు ఉన్నప్పుడే గృహ రుణం తీసుకుందామని అనుకోవద్దు. దీనివల్ల విలువైన కాలం గడిచిపోతుంది. ఇంటి కొనుగోలు ధర కూడా పెరగొచ్చు. కనుక తక్కువ వడ్డీ రేట్ల కోసం చూస్తే, అందులో మిగిలేది, పెరిగే ఇంటి ధరతో పోలిస్తే తక్కువే ఉండొచ్చు. అవసరం, తక్కువ ధరలే ఇంటి కొనుగోలుకు ఆధారం కావాలి కానీ, వడ్డీ రేట్లు కాదని నిపుణుల సూచన.

రేట్ల పెంపునకు సన్నద్ధం

ఇంటిని కొనుగోలు చేసే సమయంలో కొందరు తమ అభిరుచులకు అనుగుణంగా సదుపాయాలు ఉండాలని కోరుకుంటారు. ఇందుకోసం అదనపు ఖర్చుకూ వెనుకాడరు. ఇంటి బడ్జెట్ పెంచుకోవడం అన్నది అదనపు భారానికి దారితీస్తుంది. తీసుకునే గృహ రుణం పెరుగుతుంది. దీంతో వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో మరింత చెల్లించాల్సి రావచ్చు. కనుక అధిక మొత్తానికి గృహ రుణం తీసుకోవడం అన్నది పెద్ద సవాలు అవుతుందని ఆంద్రోమెడా లోన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వి. స్వామినాథన్ పేర్కొన్నారు. కనుక అవసరమైతే, వడ్డీ రేట్లు ఊహించని విధంగా పెరిగిపోతే, నెలవారీ ఈఎంఐ 20-25 శాతం అధికంగా చెల్లించేందుకు వీలుగా, నెలవారి ఆదాయంలో వెసులుబాటు ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు నెలవారీ గరిష్ఠంగా రూ.40,000ను ఈఎంఐ కింద చెల్లించే సామర్థ్యం ఉంటే, అప్పుడు రూ.30,000-32,000 ఈఎంఐకి పరిమితమై గృహ రుణం తీసుకోవాలి. దీంతో వడ్డీ రేట్లు పెరిగినా, ఇబ్బంది లేకుండా అదనపు మొత్తాన్ని చెల్లించేందుకు అవకాశం ఉంటుంది.

కాలవ్యవధి పెంపు

వడ్డీ రేట్లు పెరిగిన ప్రతీ సందర్భంలోనూ రుణమిచ్చిన సంస్థలు రుణ గ్రహీతల ఈఎంఐ పెంపు కంటే, కాల వ్యవధిని పెంచేందుకు మొగ్గు చూపిస్తుంటాయి. అయితే, దీనికీ పరిమితి ఉంది. రుణ గ్రహీతలు పదవీ విరమణకు ఇంకా ఎన్నేళ్లు ఉందన్న అంశాన్ని బ్యాంకులు చూస్తాయి. సాధారణంగా గృహ రుణ కాలాన్ని బ్యాంకులు రుణ గ్రహీతల వయసు, ఆర్జన ఆధారంగా నిర్ణయిస్తుంటాయి. అదే పనిగా వడ్డీ రేట్లు పెరుగుతున్న క్రమంలో.. బ్యాంకులు రేటు పెరిగినప్పుడల్లా ఆ మేరకు కాలవ్యవధిని పెంచుకుంటూ పోతే, తిరిగి చెల్లింపుల కాలం రిటైర్మెంట్ వయసుకు త్వరగా చేరిపోవచ్చు. ఇక ఆ తర్వాత కాలవ్యవధి పెంచుకోవడానికి ఉండదు. దీనికి బదులు ఈఎంఐ మొత్తాన్ని పెంచుతుంటాయి బ్యాంకులు. దీంతో అదనపు భారం పడుతుంది.

●●●

రుణ కాల వ్యవధి పెంచుకోవడం వల్ల అంతిమంగా చెల్లించే వడ్డీ కూడా ఎక్కువగానే ఉంటుంది. కనుక రుణదాత కాల వ్యవధి పెంచేందుకు ఆసక్తి చూపించినా.. రుణ గ్రహీతలు దీనికి మొగ్గు చూపకపోవడమే మంచిది. కాల వ్యవధి పెంచుకోవద్దంటే, పెరిగిన వడ్డీ రేట్ల మేర అదనపు ఈఎంఐ చెల్లించేందుకు సిద్ధం కావాలి. నెలవారీ చెల్లించే ఈఎంఐని పెంచడం వల్ల గృహ రుణాన్ని త్వరగా తీర్చేయవచ్చు. అందుకే గృహ రుణ గ్రహీతలకు నెలవారీ మిగులు ఉండాలి. దీనివల్ల వడ్డీ రేట్లు పెరిగినప్పుడు అదనంగా చెల్లించే సామర్థ్యం ఉంటుంది. దీంతో కాల వ్యవధి పెంచుకోవడం కంటే ఈఎంఐ పెంపునకే మొగ్గు చూపుతారు. ఫలితంగా అదనపు వడ్డీ భారం పడదు.

ముందస్తు చెల్లింపులు

వడ్డీ రేట్లు ఎప్పుడు పెరుగుతాయో ఎవరూ చెప్పలేరు. అందుకనే గృహ రుణం తీసుకున్న తర్వాత వీలు చిక్కినప్పుడల్లా పాక్షిక చెల్లింపులకు మొగ్గు చూపించడం మెరుగైన ఆప్షన్ అవుతుంది. దీనివల్ల గృహ రుణం బకాయిని వేగంగా తగ్గించుకోవచ్చు. నిర్ణీత కాలం కంటే ముందుగానే తీర్చివేయవచ్చు. ఒకవేళ వడ్డీ రేట్లు పెరిగినా పెద్ద భారం పడకుండా ఉంటుంది. ఉద్యోగులు అయితే బోనస్ రూపంలో వచ్చిన మొత్తాన్ని గృహ రుణానికి చెల్లింపులు చేసుకోవచ్చు. అదే మాదిరి, ఏటా వేతనం పెరుగుతూ ఉంటుంది. పెరిగే వేతనంలో సగ భాగాన్ని గృహ రుణ ఈఎంఐ పెంచి కట్టుకోవడానికి ఉపయోగించుకోవాలి.

క్రెడిట్ స్కోరు అనుకూలత

వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. అప్పుడు ఫ్లోటింగ్ రేటును ఎంచుకోవడమే మార్గం. అప్పటికే తీసుకున్న గృహ రుణానికి సంబంధించి వడ్డీ భారాన్ని భరించలేకపోతుంటే.. దాన్ని తక్కువ రేటుకు ఆఫర్ చేసే బ్యాంకుకు లేదా ఇతర సంస్థకు బదిలీ చేసుకోవడం ఒక మార్గం. సేవలు బాగుండి, తక్కువ రేటుకు ఆఫర్ చేసే సంస్థకు నిశ్చింతంగా మారిపోవచ్చు. గృహ రుణ బ్యాలన్స్‌ను బదిలీ చేసుకునే ముందు, కొత్తగా రుణం ఇచ్చే బ్యాంకులో ప్రాసెసింగ్ చార్జీలు, ఇతర చార్జీలను కూడా చూడాలి. క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉంటే కాస్త డిమాండ్ చేసి రేటును తగ్గించుకోవచ్చు. బ్యాలన్స్ బదిలీ విషయంలోనూ మెరుగైన క్రెడిట్ స్కోరు ఉపయోపడుతుంది.

మరో పావు శాతం రెపో పెంపు ఖాయం!



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వచ్చే నెల 3,5,6వ తేదీల్లో జరపనున్న ఆర్థిక సంవత్సరం తొలి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటును మరో పావుశాతం పెంచడం ఖాయమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు 6.75 శాతానికి పెరగనుంది. పాలసీ సమీక్ష నిర్ణయాలు 6వ తేదీన వెలువడనున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఫిబ్రవరి మొదట్లో జరిగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానంలో వరుసగా ఆరవసారి (పావు శాతం) రేటు పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగింది. ఈ రేటు 6.5 శాతానికి ఎగసింది.

జాగరూకత అవసరం:
బ్యాంకింగ్‌కు నిర్మలా సీతారామన్ సూచన
కాగా, వడ్డీరేట్ల పెరుగుదల, దీనికి సంబంధించిన ఎదురయ్యే సవాళ్ల వంటి విషయాల్లో అప్రమత్తత అవసరమని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల చీఫ్‌లతో ఆమె ఒక అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. బ్యాంకింగ్ పనితీరు, పటిష్టతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించడం జరిగింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
26-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

సాక్షి స్టాక్స్

బిర్లాసాఫ్ట్ లిమిటెడ్ | రెలిగేర్ బ్రోకింగ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 265 టార్గెట్: రూ. 341

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో వార్షికంగా ఆదాయం 3.5 శాతం బలపడింది. వెరసి అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో డాలర్ల రూపేణా 14.84 కోట్ల డాలర్లకు చేరింది. అయితే రూ.లలో ఆదాయం 1,220 కోట్లను తాకడంతో 14 శాతం వృద్ధి నమోదైంది. ప్రధానంగా టెక్నాలజీ ట్రాన్స్‌ఫార్మేషన్, క్లౌడ్ సర్వీసుల బిజినెస్‌లు వృద్ధికి దోహదం చేశాయి. దీంతో ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్ల బిజినెస్ నెమ్మదించినప్పటికీ ఆదాయంలో పురోగతిని సాధించింది. కాగా.. స్థూల ఆర్థిక సవాళ్లు, క్లయింట్లలో ఒక సంస్థ దివాలా ప్రకటించడం వంటి అంశాలు సమీప కాలంలో పనితీరును దెబ్బతీయవచ్చని యాజమాన్యం తాజాగా అంచనా వేసింది. అయినప్పటికీ టెక్నాలజీ బిజినెస్, క్లౌడ్ సర్వీసుల విభాగాలలో డీల్ పైప్‌లైన్(ఆర్డర్లు పొందే అవకాశాలు) భవిష్యత్‌లో మెరుగైన పనితీరుకు సహకరించే అవకాశముంది. అంతేకాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా(బీఎఫ్ఎస్ఐ) విభాగంలో యాక్టివిటీ, తయారీ సంబంధ విభాగానికి కనిపిస్తున్న డిమాండు వీటికి జత కలవనున్నాయి. యూరప్, అమెరికా ప్రాంతాల నుంచి పెరుగుతున్న డీల్స్(ఒప్పందాలు) సైతం ఆదాయ వృద్ధికి దోహదం చేయనుంది. నిర్వహణా వ్యయాలపై యాజమాన్య ప్రత్యేక దృష్టి కారణంగా లాభదాయకత మెరుగుపడే వీలుంది. క్యూ3లో కంపెనీ చేపట్టిన ప్రొవిజన్లు, సమీప కాలంలో ఎదురుకానున్న సవాళ్లను మినహాయిస్తే దీర్ఘకాలంలో కంపెనీ పటిష్ఠ ఫలితాలను ప్రకటించవచ్చని అంచనా.



బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 352 టార్గెట్: రూ. 440

ఎందుకంటే: దేశీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సంప్రదాయ స్వల్పాహార(స్నాక్స్) విభాగంలో బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్‌కు పట్టుంది. వివిధ ఉత్పత్తులతో 9 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. తద్వారా ఈ విభాగంలోని దిగ్గజాలలో మూడో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. దేశీ స్నాక్స్ మార్కెట్ విలువ రూ. 18,100 కోట్లుకాగా.. నాలుగేళ్ల కాలంలో(2022-26 మధ్య) వార్షికంగా 15.6 శాతం చొప్పున పురోగతి సాధించవచ్చని అంచనా. ప్యాకేజ్‌డ్ స్నాక్స్ పరిశ్రమలో బ్రాండ్ ఈక్విటీ, విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో, సప్లై చైన్ సామర్థ్యాలు వంటి అంశాలు కంపెనీల పురోగతికి కీలకంగా నిలుస్తాయి. సంఘటిత రంగంలో ప్రధాన కంపెనీలుగా ఎదిగేందుకు ఇలాంటి సామర్థ్యాలు దోహదం చేస్తాయి. కంపెనీ నాయకత్వ స్థాయి, అత్యధిక ప్రొడక్టులు, ఫ్యామిలీ ప్యాక్‌లపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలు పోటీ కంపెనీలతో పోలిస్తే బికాజీని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. వెరసి కుటుంబ వినియోగంలో కీలక బ్రాండుగా బికాజీ పేరొందింది. గత రెండేళ్లుగా కంపెనీ తయారీ సామర్థ్యాలను పెంచుకునే బాటలో కొత్త యూనిట్లను ఏర్పాటు చేస్తూ వస్తోంది. తద్వారా కీలక మార్కెట్లకు ప్రత్యక్షంగా చేరే వీలు కలుగుతోంది. అంతేకాకుండా ప్రత్యేక మార్కెట్లలో మరింత విస్తరించే అవకాశముంది. పంపిణీ పటిష్టతతో 2017-22 మధ్య కీలక మార్కెట్లలో 19 శాతం, ప్రత్యేక మార్కెట్లలో 41 శాతం చొప్పున అమ్మకాలలో వార్షిక వృద్ధిని సాధించింది. ముడివ్యయాలు తగ్గడం, వినిమయం పుంజుకోవడం, పెట్టుబడులు కంపెనీకి బలాన్నివ్వనున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫండ్స్‌కు నామినేషన్ ఇచ్చారా..?

మార్చి 31తో గడువు పూర్తి




న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లు నామినేషన్ సమర్పించేందుకు ఇచ్చిన గడువు మార్చి 31తో ముగియనుంది. ఎవరినైనా నామినీగా నమోదు చేయడం లేదంటే, నామినేషన్ ఆప్ట్ అవుట్ ఈ రెండింటిలో ఏదో ఒకటి చేయడం తప్పనిసరి. ఈ రెండింటిలో ఏదో ఒకటి ఇన్వెస్టర్ ఎంపిక చేసుకోకపోతే గడువు ముగిసిన తర్వాత వారి మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులన్నీ స్తంభనకు గురవుతాయి. దాంతో పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఉండదు. ఫండ్స్ పెట్టుబడులు, డీమ్యాట్ ఖాతాలకు నామినేషన్ లేదా నామినేషన్ వద్దంటూ డిక్లరేషన్ ఇవ్వడాన్ని తప్పనిసరి చేస్తూ సెబీ 2022 జూన్ 15న ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత జూలై ఆఖరి వరకు గడువు ఇవ్వగా.. అక్టోబర్ వరకు పొడిగించారు. అప్పటికే పెట్టుబడులు కలిగిన వాటికి నామినేషన్ సమర్పించేందుకు 2023 మార్చి 31 వవరకు గడువు ఇచ్చింది. నామినేషన్ లేకుండా పెట్టుబడిదారు మరణించినట్టయితే.. వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వారసులు లేదా కుటుంబ సభ్యులు క్లిష్టమైన ప్రక్రియను పూర్తి చేయాల్సి వస్తుంది. ఆ ఇబ్బంది లేకుండా నామినేషన్‌ను సెబీ తీసుకొచ్చింది.

యాక్సిస్ కొత్త ఈటీఎఫ్ ఫండ్...

ఏప్రిల్ 5న ముగింపు

ముంబై: దేశీయంగా ఏడో పెద్ద ఫండ్ హౌస్ యాక్సిస్ ఎంఎఫ్ కొత్త ఫండ్ ఆఫర్(ఎన్ఎఫ్‌వో)కు తెరతీస్తోంది. ఈ నెల 22న ఫండ్ ప్రారంభమైన ఫండ్, ఏప్రిల్ 5న ముగియనుంది. ఈ ఎన్ఎఫ్‌వో(ఓపెన్ ఎండెడ్ ఎస్అండ్‌పీ 500 ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్) ద్వారా కనీసం రూ. 50 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ నిధులను ఎస్అండ్‌పీ 500 ఇండెక్స్‌ను ప్రతిబింబించే ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు)లో ఇన్వెస్ట్ చేయనుంది. ఫండ్‌ను వినాయక్ జయంత్ నిర్వహించనున్నారు. అలాట్‌మెంట్ తేదీ నుంచి 30 రోజుల్లోగా రిడీమ్ లేదా స్విచ్‌డ్ ఔట్ అయితే 0.25 శాతం ఎగ్జిట్ లోడ్ విధిస్తారు. అలాట్‌మెంట్ అయ్యాక 30 రోజుల్లోగా రిడీమ్ లేదా స్విచ్‌డ్ ఔట్ అయితే ఎలాంటి ఎగ్జిట్ లోడ్ అమలుకాదని ఫండ్ హౌస్ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాఘవ్ అయ్యంగర్ పేర్కొన్నారు. వివిధ రకాల ఆస్తులలో పెట్టుబడులు చేపట్టే ఇతర రెగ్యులర్ మ్యూచువల్ ఫండ్స్ మాదిరికాకుండా ఈ ఫండ్ సొంత పథకాలు లేదా ఇతర ఫండ్ హౌస్ పథకాలలో ఇన్వెస్ట్ చేయనుంది. ఆఫ్‌షోర్ మ్యూచువల్ ఫండ్స్‌లో అయితే యూనిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంది.

పీఎఫ్‌ను ముందస్తుగా వెనక్కి తీసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను ఒక కంపెనీలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాను. నా సోదరి వివాహం కోసం నా పీఎఫ్ ఫండ్‌ను వాడుకోవాలని అనుకుంటున్నాను. నా సందేహం ఏమిటంటే.. నేను కరోనా లాక్‌డౌన్ల సమయంలో ఒకసారి పాక్షికంగా ఉపసంహరించుకున్నాను. కనుక మరోసారి పీఎఫ్ ఉపసంహరణకు దరఖాస్తు చేసుకోవచ్చా? పన్ను పడుతుందా?
– వేణు ఉదత్

ప్రావిడెంట్ ఫండ్ నుంచి రెండు సార్లు ఉపసంహరించుకోవచ్చు. పన్నుల అంశానికంటే ముందు తెలుసుకోవాల్సిన ఇతర అంశాలు కూడా ఉన్నాయి. పలు సందర్భాల్లో పీఎఫ్ నుంచి ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు లేదా నిర్మాణం, రుణాల చెల్లింపు, కొన్ని వ్యాధులకు సంబంధించి చికిత్సా వ్యయాల చెల్లింపులకు, వివాహం లేదా పిల్లల ఉన్నత విద్య, రిటైర్మెంట్‌కు ఏడాది ముందు సందర్భాల్లో ఉపసంహరించుకోవచ్చు. ఈ ప్రత్యేక సందర్భాలకు సంబంధించి ఈపీఎఫ్‌వో సభ్యుడు నిర్ణీత సర్వీసు కాలాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు సభ్యుడు/సభ్యురాలి వివాహం కోసం లేదంటే కుమార్తె, కుమారుడు, సోదరుడు లేదా సోదరి వివాహం కోసం ఉపసంహరించుకోవాలంటే కనీసం ఏడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవాలి. ఉద్యోగి వాటా కింద జమ అయి, దానికి వడ్డీ చేరగా సమకూరిన మొత్తం నుంచి 50 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఈ అవసరాల కోసం మూడు సార్లు ఉపసంహరణకు అనుమతిస్తారు. మీరు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. కనుక మీరు చేసే ఉపసంహరణలపై పన్ను ఉండదు. మీ సోదరి వివాహం కోసం ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నారు. కనుక కనీసం ఏడేళ్ల సర్వీసు ఉండాలి. మీకు ఐదేళ్ల సర్వీసు మాత్రమే ఉంది. ఏడేళ్లు పూర్తి కాకుండా దరఖాస్తు చేసుకుంటే తిరస్కరణకు గురవుతుంది. గతంలో మీరు కోవిడ్ సమయంలో చేసిన ఉపసంహరణ ప్రభావం తాజా ఉపసంహరణలపై ఉండదు.

ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌ను ఒక సంస్థ నుంచి ఇంకో సంస్థకు మార్చుకోవచ్చా..?
– రాజేష్ షా

ఈక్విటీ లింక్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్స్ మూడేళ్ల తప్పనిసరి లాకిన్ పీరియడ్‌తో వస్తాయి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి ఈ లాకిన్ పీరియడ్ అమల్లోకి వస్తుంది. ఒక సంస్థ నుంచి ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడిని మరోసంస్థకు చెందిన ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌లోకి మార్చుకోవాలంటే ముందుగా ఉపసంహరించుకోవాలి. మూడేళ్ల లాకిన్ పీరియడ్ వరకు ఉపసంహరించుకోలేరు. మూడేళ్లు నిండిన తర్వాత అప్పుడు మీ పెట్టుబడులు అన్నింటినీ వెనక్కి తీసుకోవచ్చు. మీకు నచ్చిన పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈఎల్ఎస్ఎస్ కానీ, మరే ఇతర పన్ను ఆదా పథకాలు అయినా తప్పనిసరి లాకిన్ పీరియడ్‌తో వస్తుంటాయి. కనుక లాకిన్ సమయంలో ఉపసంహరణలను అనుమతించరు.

ప్రీమియం కస్టమర్లకు హెచ్‌డీఎఫ్‌సీ గోల్డెన్ కార్డ్



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డ్ పేరుతో ఓ సూపర్ ప్రీమియం క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేసింది. ప్రయాణ, లైఫ్‌స్టయిల్ ప్రయోజనాలు ఈ కార్డుతో పొందొచ్చని బ్యాంక్ ప్రకటించింది. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్‌ను ఉచితంగా అందిస్తోంది. ప్రీమియం మైల్ స్టోన్ ప్రయోజనాలు కూడా కార్డులో భాగం. ఇది అందరికీ కాకుండా అధిక ఆదాయం ఉన్న వారికే బ్యాంక్ జారీ చేయనుంది. అంతర్జాతీయ ప్రయాణాలు, హోటళ్ల బుకింగ్‌లు, లైఫ్ స్టయిల్ కోసం ఖర్చు, కొనుగోళ్ల కోసం ప్రత్యేకంగా ఈ కార్డును తీసుకొచ్చింది. రిలయన్స్ డిజిటల్, మింత్రా, నైకాలో కొనుగోళ్లపై 5 రెట్ల రివార్డులు వస్తాయి. ప్రతి రూ.150 రిటైల్ వ్యయంపై 4 రివార్డు పాయింట్లు లభిస్తాయి. వార్షిక వ్యయం లక్ష్యాలను చేరుకున్న కస్టమర్లకు రెండు ఫ్లయిట్ టికెట్ వోచర్లు అందిస్తుంది.

ఏ ఆసుపత్రిలో అయినా నగదు రహిత వైద్యం

ఐసీఐసీఐ లాంబార్డ్ ఆఫర్

ముంబై: ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ తన హెల్త్ పాలసీదారులకు మంచి ఆఫర్‌ను ప్రకటించింది. పాలసీదారులు నగదు రహిత వైద్యాన్ని ఏ ఆస్పత్రి నుంచి అయినా పొందొచ్చని.. నాన్ ఎంప్యానెల్డ్ హాస్పిటల్స్‌లోనూ ఈ సేవలు వినియోగించుకోవచ్చని సూచించింది. పరిశ్రమలో ఈ తరహా ఆఫర్ మొదటిదిగా పేర్కొంది. వైద్యం కోసం కస్టమర్లు తమ పాకెట్ నుంచి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. 'ఐఎల్ టేక్ కేర్' యాప్ నుంచి ఈ నూతన సదుపాయాన్ని పొందొచ్చని ప్రకటించింది. నగదు రహిత వైద్యాన్ని హాస్పిటళ్లు అందించడంపై ఆధారపడి ఉంటుందని, ఆస్పత్రిలో చేరడానికి 24 గంటల ముందే పాలసీదారులు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. తాము సూచించిన హాస్పిటల్ లేదంటే సమీపంలోని హాస్పిటల్‌కు వెళ్లొచ్చని సూచించింది.

ఇసాఫ్ బ్యాంక్ కస్టమర్లకు జియోజిత్ ట్రేడింగ్ ఖాతా



కోచి: జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ఇసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఈసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కస్టమర్లకు 3 ఇన్ 1 డీమ్యాట్ బండిల్డ్ అకౌంట్‌ను ఆఫర్ చేస్తున్నట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రకటించింది. దీని కింద ఈసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాదారులు జియోజిత్ డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్‌ను ఉచితంగా ప్రారంభించుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కేవలం 15 నిమిషాల్లో ఖాతా తెరవొచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ తెలిపింది. 3 ఇన్ 1 ఖాతా కింద.. డీమ్యాట్ ఖాతా తెరిచేందుకు ఎలాంటి చార్జీలు ఉండవని, సౌకర్యమైన బ్రోకరేజీ ప్లాన్లు పొందొచ్చని ప్రకటించింది.

ఏప్రిల్ 10 నుంచి వస్త్రాల ఈ-వేలం

తిరుపతి అలిపిరి: తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఏప్రిల్ 10 నుంచి 15వ తేదీ వరకు ఈ-వేలం (ఆన్‌లైన్‌లో) వేయనున్నారు. కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు 297 లాట్లు ఉన్నాయి. ఇందులో ఆర్ట్ సిల్క్, పాలిస్టర్ ధోతీలు, ఉత్తరీయాలు, ఆర్ట్ సిల్క్, పాలిస్టర్, నైలాన్, నైలెక్స్ చీరలు, ఆఫ్ చీరలు, క్లాత్ బిట్స్, బ్లౌజ్‌పీస్‌లు, టర్కీ టవళ్లు, లుంగీలు, శాలువాలు, బెడ్‌షీట్లు, హుండీ గల్లేబులు, దిండు కవర్లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, జంకాళం కార్పెట్లు, దుప్పట్లు, కర్టన్లు, గర్భగృహ కురాళాలు, బంగారువాకిలి పరదాలు, శ్రీవారి గొడుగులు ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం 0877-2264429 నంబరులో గానీ, టీటీడీ వెబ్‌సైట్‌లో సంప్రదించగలరు.

విజయవాడ-షిర్డీ విమాన సర్వీసులు ప్రారంభం



విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన షిర్డీకి ఇండిగో సంస్థ ఆదివారం నుంచి విమాన సర్వీసులను ప్రారంభించింది. మధ్యాహ్నం 12.25 గంటలకు సుమారు 70 మంది ప్రయాణికులతో విమానం షిర్డీకి బయల్దేరి వెళ్లింది. అక్కడి నుంచి 66 మంది ప్రయాణికులతో విమానం తిరిగి సాయంత్రం 4.35 గంటలకు గన్నవరం చేరుకుంది. రోజూ అందుబాటులో ఉండే ఈ విమాన సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఇండిగో ప్రతినిధులు కోరారు.

బీఏఐ ఎన్నికల్లో తెలుగు న్యాయవాదుల విజయం

సాక్షి, న్యూఢిల్లీ: ది బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) కమిటీ ఎన్నికల్లో ముగ్గురు తెలుగు న్యాయవాదులు గెలుపొందారు. 2023–25 కాలానికి గాను ఈ నెల 25న ఎన్నికలు నిర్వహించినట్లు ఎలక్షన్ సబ్ కమిటీ కన్వీనర్ అమర్జిత్ తెలిపారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది అమర్జిత్ సింగ్ చందోక్, ఉపాధ్యక్షులుగా సీనియర్ న్యాయవాదులు శ్యామ్ దివాన్, సీఎస్ వైద్యనాథన్, జైదీప్ గుప్తా, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా తన్నేరు శ్రీనివాస్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి న్యాయవాది ఆర్.శ్రీనివాసన్ నాయుడు, తెలంగాణ నుంచి న్యాయవాది నోముల శ్రీనివాస్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. మొత్తం 54 మందితో బీఏఐ పనిచేయనుందని తెలిపారు.


చూసొద్దాం రండి!

సమీపిస్తున్న వేసవి సెలవులు

- టూర్లకు సిద్ధమవుతున్న పెద్దలు, పిల్లలు
- ఉమ్మడి అనంతలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు
- చుట్టుపక్కలా రమణీయ క్షేత్రాలు
- తక్కువ ఖర్చుతోనే సందర్శించే అవకాశం



లేపాక్షిలోని నంది విగ్రహం



ప్రకృతి రమణీయతకు నిలయమైన ఆలూరు కోన

అనంతపురం డెస్క్ : వేసవి సెలవులు సమీపిస్తున్నాయి. పరీక్షలు పూర్తవగానే ఎంచక్కా టూర్లకు వెళ్లడానికి పిల్లలు ఉత్సాహం చూపుతున్నారు. అందుకు అనుగుణంగానే పెద్దలు ఇప్పటి నుంచే ప్లాన్ చేస్తున్నారు. కొందరు షిర్డీ, ఊటీ, గోవా వంటి సుదూర ప్రాంతాలను సందర్శించడానికి ఆసక్తి చూపుతుండగా..మరికొందరు వారి ఆర్థిక స్తోమతను బట్టి ఉమ్మడి జిల్లా పరిధిలోనే, లేదంటే చుట్టుపక్కల జిల్లాల్లో మంచి ప్రదేశాలకు వెళ్లాలని భావిస్తున్నారు. ప్రకృతి రమణీయతను, ఆధ్యాత్మికతను పంచే సందర్శనీయ ప్రాంతాలు మన చుట్టుపక్కలే ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో కొన్ని మీకోసం...

ఆధ్యాత్మిక ధామం పుట్టపర్తి

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిని సందర్శిస్తే వేరే దేశంలో ఉన్నామన్న ఫీలింగ్ కలుగుతుంది. అద్భుతమైన నిర్మాణాలు, హాయిగొలిపే వాతావరణం, అణువణువూ గోచరించే సాయితత్వం మనకు కొత్త అనుభూతి ఇస్తాయి. చైతన్య జ్యోతి మ్యూజియం, నక్షత్రశాల, హిల్‌వ్యూ స్టేడియం, డీమ్డ్ యూనివర్సిటీ, భారీ ఆంజనేయుడి విగ్రహం వంటివి ఇక్కడి ప్రత్యేక ఆకర్షణలు.

ప్రకృతి అందాల ఆలూరు కోన

రంగనాథస్వామి కొలువైన ఆలూరు కోన తాడిపత్రికి 5 కి.మీ.దూరంలో ఉంది. రెండు కొండల మధ్య నుంచి పెద్దనీటి బుగ్గ ఉత్తర-దక్షిణ దిశగా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రకృతి అందాల నడుమ కొలువైన ఈ క్షేత్రాన్ని సందర్శిస్తే చక్కటి అనుభూతికి లోనవుతారనడంలో సందేహం లేదు. ఆలూరు కోనకు వెళ్లేవారు తాడిపత్రిలోని చింతల వేంకటరమణస్వామి, బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాలను కూడా సందర్శించొచ్చు. ఇవి పురాతన ఆలయాలు.

శిల్ప కళల కాణాచి..లేపాక్షి

హిందూపురం నుంచి సుమారు 13 కి.మీ. దూరంలో లేపాక్షి ఉంది. ఇక్కడి వీరభద్రస్వామి ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించింది. శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఆలయంలోని శిల్పకళ అబ్బురపరుస్తోంది. వేలాడే స్తంభం, ఏడు పడగల నాగేంద్రుడు, వటపత్రసాయి చిత్రం ప్రధాన ఆకర్షణలు. ఇక్కడి నందీశ్వరుడి ఏకశిలా విగ్రహం దేశంలోనే పెద్దది.



'రికార్డు' మర్రి చూడాల్సిందే!

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన తిమ్మమ్మ మర్రిమాను ఎన్పీకుంట మండలం గూటిబైలులో ఉంది. కదిరి నుంచి 26 కి.మీ. దూరంలో ఉండే ఈ మర్రిమాను ప్రస్తుతం 8.75 ఎకరాల్లో విస్తరించింది. 6,689 ఊడలు ఉన్నాయి. ఇది 1989లోనే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది. ఈ మర్రిమాను వృత్తాంతాన్ని తెలియజేసేందుకు గైడ్‌లు కూడా అందుబాటులో ఉన్నారు. తిమ్మమ్మ మర్రిమాను చూడడానికి వెళ్లేవారు మార్గమధ్యంలోని కదిరి పట్టణంలో గల ఖాద్రీ లక్ష్మీనృసింహాలయాన్ని, కటారుపల్లిలోని యోగివేమన సమాధిని కూడా సందర్శించవచ్చు.

శత్రుదుర్భేద్యం ..గుత్తికోట

బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉండే గుత్తి కోటను అప్పట్లో శత్రుదుర్భేద్యంగా నిర్మించారు. దాదాపు 25 హెక్టార్ల విస్తీర్ణంలో శంకు ఆకారంలో కోట ఉంటుంది. ముఖద్వారం నుంచి బురుజు వరకు 101 బావులు, 15 ప్రధాన ద్వారాలు ఉన్నాయి. ఇక్కడి ఆలయాలు, కారాగారం, సొరంగ మార్గాలు, కోడిగుడ్డు బావి, ఏనుగు, గుర్రపు శాలలు ప్రధాన పర్యాటక ఆకర్షణలుగా నిలుస్తున్నాయి.

ఆహ్లాదాన్ని, భక్తిభావాన్ని పంచే పెన్నహోబిలం

ఉరవకొండ మండలంలోని పెన్నహోబిల క్షేత్రం మంచి వేసవి విడిది. ఇక్కడి లక్ష్మీనృసింహుడి ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతుండగా..చెంతనే ఉండే జలపాతం ఆహ్లాదాన్ని పంచుతోంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా కుటుంబ సభ్యులతో ఎంచక్కా సేదదీరడానికి అనువైన ప్రదేశం. ఇక్కడికి కొద్దిదూరంలోనే పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) ఉంది. ప్రస్తుతం ఇది జలకళతో కనువిందు చేస్తోంది.

అబ్బురపరిచే బెలూంగుహలు

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని బెలూంగుహలు పది లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడినవని భూగర్భశాస్త్రవేత్తల అంచనా. భారత ఉపఖండంలో మేఘాలయ గుహల తర్వాత వీటినే రెండవ అతిపెద్ద గుహలుగా పరిగణిస్తున్నారు. ఇవి తాడిపత్రి పట్టణానికి కేవలం 30 కి.మీ. దూరంలో ఉన్నాయి. గుహల లోపలికి వెళ్లిరావడం జీవితంలో మధురానుభూతిగా మిగిలిపోతుంది. వీటి సందర్శనకు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

హంపీ అందాలు వీక్షించాల్సిందే

అనంతపురం నుంచి హంపీ కేవలం 165 కిలోమీటర్ల దూరంలో ఉంది. విజయనగర రాజధానిగా విరాజిల్లిన హంపీలో ఎన్నో చూడదగిన చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. ఉత్తరం వైపు తుంగభద్ర నది, మిగతా మూడువైపులా చారిత్రక కట్టడాలతో హంపీ అలరారుతోంది. విరూపాక్ష దేవాలయం, విఠల దేవాలయ సముదాయం, శిలా రథం, గజ శాల వంటివి కనువిందు చేస్తాయి.

నయనమనోహరం నంది కొండలు

కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లాలో ఉన్న నందికొండలపై నుంచి సూర్యోదయాన్ని తిలకించడం దివ్యానుభూతికి లోను చేస్తుంది. కొండపై నుంచి చూస్తే మేఘాలపై నుంచి కిందకు చూస్తున్నట్టుంది. బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44)కి సమీపంలోనే ఉండే నందికొండలకు అనంతపురం నుంచి రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయి. అనంతపురం నుంచి దూరం 178 కి.మీ. మాత్రమే. ఈ వేసవిలో చిన్నారులను నందిహిల్స్‌కు తీసుకెళితే అక్కడి ప్రకృతి రమణీయతను ఎంతగానో ఆస్వాదిస్తారనడంలో అతిశయోక్తిలేదు.

విజయనగర చరిత్రకు సాక్షీభూతం పెనుకొండ

విజయనగర వైభవాన్ని, నాటి చరిత్రను తెలుసుకోవడానికి పెనుకొండ సందర్శన ఉపయోగపడుతుంది. ఇక్కడ జైన సంస్కృతి కూడా పరిఢవిల్లింది. కొండపైనున్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, గగన్‌మహల్, బాబయ్య దర్గా, కుంభకర్ణ విగ్రహం, తిమ్మరుసు బందీఖానా, పార్శ్వనాథుడు, అజితనాథ ఆలయాలు వంటివి సందర్శనీయ ప్రదేశాలు.

ఉద్యానానికి ఉపాధి ఊతం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా అమలు

- అడిగిన వారందరికీ అందించేలా చర్యలు
- వచ్చేనెల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మేలో కందకాల తవ్వకాలు

ఏలూరు(మెట్రో): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంటలోనూ రైతులకు మేలు జరిగేలా సంకల్పించింది. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఉద్యాన పంటల సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు ఉంది. వీటికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందించేలా సన్నాహాలు చేస్తోంది.

ఐదెకరాల్లోపు..

ఉపాధి హామీ పథకం ద్వారా అరెకరం నుంచి ఐదు ఎకరాల లోపు భూములున్న రైతుల నుంచి డ్రై ల్యాండ్ హార్టీకల్చర్ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వచ్చేనెల 1వ తేదీ నుంచి మొదలు కానున్న ఈ పథకం ద్వారా పండ్ల తోటలు, పూలసాగుకు చర్యలు తీసుకుని రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న పండ్ల తోటల్లోనూ అంతర్ పంటలు సాగు చేసుకునేలా వెసులుబాటు కల్పించనున్నారు.

పంట చేతికి వచ్చే వరకూ..

ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసే పంటలు చేతికి వచ్చే వరకూ ప్రభుత్వం సాయం అందిస్తుంది. రైతు దుక్కి దున్నేందుకు, కందకాలు తీసుకునేందుకు, మొక్కల కొనుగోలు, నాటడం వంటి పనులకు తోడ్పాటు అందిస్తారు. అంతర్ పంటలుగా పూల సాగు చేస్తే ఏడాది పొడవునా రైతుకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకుంటారు.

ఎకరాకు రూ.లక్ష వరకూ..

ఉపాధి హామీ డ్రైల్యాండ్ హార్టీకల్చర్‌లో భాగంగా నేల స్వభావాన్ని బట్టి రైతులకు మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, చింత, నేరేడు, కొబ్బరి, సీతాఫలం, యాపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్, గులాబీ, మల్లె, మునగ పంటల సాగు కోసం రైతు కోసం దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. గుంతలు తవ్వే దగ్గర నుంచి మొక్కలతో పాటు పురుగు మందుల వరకు సుమారు ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వం వెచ్చించనుంది. దీంతో పాటు అదనంగా మూడేళ్లపాటు మొక్కలకు నీటిని సైతం పెట్టి సంరక్షించేందుకు రైతుకు బిల్లులు అందిస్తారు.

రైతులను ప్రోత్సహించేలా..



రైతులను ప్రోత్సహించేందుకు, ఖర్చు లేకుండా ఆదాయాన్ని సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన ప్రతిఒక్క రైతుకు డ్రైల్యాండ్ హార్టీకల్చర్ ద్వారా ఉద్యాన పంటలు పండించేలా చర్యలు తీసుకుంది. వచ్చేనెల మొదటి వారం నుంచి రైతులు ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అరెకరం నుంచి ఐదెకరాల వరకు ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చు.

-డి.రాంబాబు,
డ్వామా పీడీ, ఏలూరు జిల్లా

మరింత మందికి మేలు



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలకు తోడ్పాటు అందిస్తోంది. జిల్లావ్యాప్తంగా 1.80 లక్షల ఎకరాలకు పైబడి ఉద్యాన పంటలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా మరింత మంది రైతులను ప్రోత్సహించడం ద్వారా వేలాది ఎకరాలు ఉద్యాన పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

-పీవీఎస్ రవికుమార్, జిల్లా
ఉద్యానశాఖ అధికారి, ఏలూరు జిల్లా



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943